# ఈనాడు
## మంచిర్యాల

గురువారం 4 జనవరి 2018 | 16 పేజీలు




ఇది దండేపల్లి మండలం చింతపల్లి పంచాయతీ భవనం. ఇందులో పంచాయతీ కార్యాలయంతో పాటు పశువైద్యశాల, ఇటు ఆరోగ్య ఉపకేంద్రం కొనసాగుతున్నాయి. నిత్యం వివిధ సమావేశాలు, వివిధ పనులతో సందడిగా ఉండే ఇదే భవనంలో పశువులకు చికిత్స చేయడం ఇబ్బందిగా ఉంది. ఉన్న ఒక గదిలోనే మందులు నిల్వ చేయడం, వైద్యం చేయడం కష్టంగా ఉంది.

# పశువైద్యం.. కడు దైన్యం



- అద్దె గదులు, పంచాయతీ కార్యాలయాల్లో మూగజీవాలకు చికిత్స
- శిథిలావస్థలో 26 భవనాలు
- సిబ్బంది కొరత మరో సమస్య

దండేపల్లి, న్యూస్‌టుడే

**మనకు చిన్నపాటి వ్యాధి వస్తే చాలు...ఆసుపత్రికి వెళతాం. ..బాగుకాకుంటే పెద్దాసుపత్రికి పరుగులు తీస్తాం. పశువుల పరిస్థితి వేరు.. ప్రభుత్వ ఆసుపత్రులే దిక్కు. జిల్లాలోని పశువుల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రులు లేవు. . ఉన్నవి శిథిలావస్థకు చేరడంతో పాటు అరకొర సిబ్బందితో పశు వైద్యం అందడం లేదు. ప్రభుత్వం పాడి అభివృద్ధి కోసం రాయితీపై గొర్రెలు పంపిణీ చేస్తోంది. మరో వైపు గేదెలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పాడి అభివృద్ధికి ఇంత చేస్తున్నా క్షేత్రస్థాయిలో భవనాలు లేకపోవడం..సిబ్బంది కొరతతో వైద్యం అందడం లేదు. జిల్లాలో పశువైద్యం ఇబ్బందులపై 'న్యూస్‌టుడే' కథనం..**

మంచిర్యాల జిల్లాలో వ్యవసాయం తర్వాత ప్రజలకు ప్రధాన వృత్తి పాడి. దీనిని ఆధారం చేసుకుని జిల్లాలో వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇంత ప్రధానమైన పరిశ్రమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పశువులకు అనుగుణంగా పశువైద్యశాలలు లేవు.. ఐదు నుంచి ఆరు గ్రామాలకు ఒక్క వైద్యశాల ఉంది. అసలే తక్కువగా ఉన్నాయంటే ఉన్నవాటిలోనూ సిబ్బంది లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరబడి పోస్టులు ఖాళీగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పోస్టులే తక్కువగా ఉన్నాయంటే ఉన్నవి ఖాళీగా ఉండటంతో ఉన్న సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించినా వారు పని ఒత్తిడితో సరైన వైద్యం అందించలేని పరిస్థితి నెలకొంది.

### ఇదీ పరిస్థితి

జిల్లాలో 44 ఆసుపత్రులు ఉండగా పలు చోట్ల శిథిలావస్థ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉండటంతో విధులు నిర్వర్తించడానికి సిబ్బంది జంకుతున్నారు. రైతులు కూడా రావడానికి ఇబ్బంది పడుతున్నారు. భవనాలు (మిగతా 7లో)

**జిల్లాలో వైద్య సిబ్బంది ఖాళీల వివరాలు:**


| హోదా | మంజూరు | ఉన్న పోస్టులు | ఖాళీలు |
|---|---|---|---|
| జేడీ | 1 | 1 | --- |
| ఏడీలు | 3 | 2 | 1 |
| వైద్యాధికారి | 26 | 23 | 1 (ఇద్దరు డిప్యుటేషన్‌లో) |
| సహాయ సిబ్బంది | 38 | 17 | 21 |
| అటెండర్లు | 44 | 33 | 11 |

**భవనాల వివరాలు:**

| స్థాయి | ఉన్న భవనాలు | శిథిలావస్థలో | నిర్మాణంలో |
|---|---|---|---|
| నియోజకర్గ | 2 | 1 | - |
| మండల | 27 | 10 | 9 |
| గ్రామీణ | 15 | 15 | -- |

## నేతలకు కీలక సంవత్సరం

నియోజకర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి జిల్లా శాసనసభ్యులకు మరో ఏడాదిన్నర సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ సంవత్సరం వారికి అత్యంత కీలకమైనది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ముగ్గురు శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్‌రావు, నల్లాల ఓదెలు, దుర్గం చిన్నయ్యలతో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది.. ఆ వివరాలు 3వ పేజీలో..



# పెరిగిన జీతం.. పన్నుకు సరి..

◆ కార్మికుల రెండు, మూడు నెలల జీతం ఆదాయం పన్నుకే



శ్రీరాంపూర్, న్యూస్‌టుడే:

**సింగరేణి కార్మికులకు పదో వేతన ఒప్పందం అమలవుతున్నా ఆ సంతోషం వారి ముఖాల్లో కనిపించడంలేదు. పెరిగిన వేతనాలు కార్మికుల జేబుల్లోకి కాకుండా ఆదాయం పన్ను శాఖ ఖాతాల్లో జమ అవుతుండటమే దీనికి కారణం. మార్చినెలతో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో, కార్మికుల ఆదాయం పన్ను కోతలూ పెరిగాయి. వేతనాలు పెరిగిన సంబురం కార్మిక కుటుంబాల్లో కనిపించకపోవడంపై 'న్యూస్‌టుడే' కథనం.**

దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమల్లో బొగ్గు పరిశ్రమ ఒకటి. ఇతర పరిశ్రమలకన్నా ముందుగా బొగ్గు గని కార్మికులకు పదో వేతన ఒప్పందం అమల్లోకి వచ్చింది. అక్టోబరు 10న జాతీయ బొగ్గు వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ-నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్) కుదిరింది. 2016 జులై 1 నుంచి పెరిగిన వేతన ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీంతో యాజమాన్యం పెరిగిన వేతనాలను నవంబరు నెల వేతనాలతో డిసెంబరు 3న చెల్లించింది. అంతకు ముందు యాజమాన్యం దీపావళి కానుకగా కార్మికుల ఖాతాలో రూ.51 వేల చొప్పున వేతన బకాయిలను అక్టోబరు 17న జమ చేసింది. ఈ విధంగా సంస్థ కార్మికులకు రూ.265 కోట్లు చెల్లించింది. దీపావళి బోనస్ కింద ఒక్కో కార్మికుడికి రూ.57 వేల చొప్పున మొత్తం రూ.336 కోట్లు చెల్లించింది. ఇవి కాకుండా సంస్థ గడించిన లాభాల్లో 25 శాతం వాటా కింద ఒక్కో కార్మికుడికి సగటున రూ. 35 వేలకు పైగా ఇచ్చింది. లాభాలా వాటా కింద మొత్తం రూ.98.84 చెల్లించింది. ఇలా కార్మికులకు ఒకేసారి మూడు ప్రయోజనాలు దక్కడంతో వారి వార్షిక ఆదాయం ఒక్కసారిగా పెరిగి పోయింది.



ఆదాయం పన్ను శాఖ కార్యాలయం

### జేబుల్లో చేరని సొమ్ముకూ పన్ను పోటే

కార్మికుల జేబుల్లోకి వెళ్లని సొమ్ము కూడా ఆదాయం పరిధిలో చేరడం కార్మికవర్గానికి మరింత ఇబ్బందిగా మారింది. దీపావళి బోనస్, వేతన బకాయిలు, లాభాల్లో వాటా కాకుండా యాజమాన్యం కార్మికులకు కేటాయించే క్వార్టర్లు, నీటి సరఫరా వ్యయం కూడా ఆదాయపు పన్ను నిబంధనల మేరకు 7.5 శాతం ఆదాయం కింద పరిగణించి దాన్ని కూడా పన్ను పరిధిలో చేర్చడం ఆనవాయితీగా వస్తోంది. వాస్తవిక సంపాదన కాకుండా ఇంటి అద్దె పేరిట పన్ను చెల్లించాల్సి (మిగతా 7లో)

# వ్యాపారులకు 'తెల్ల బంగారం'..!




మిల్లుల్లో పేరుకుపోయిన పత్తి నిల్వలు

- క్వింటాకు రూ.800 నుంచి 1000 పెరిగిన ధర
- రైతులకు రూ.190 కోట్ల మేర నష్టం



మొక్కజొన్నకు నీటి తడులు ఇస్తున్న రైతు సత్యనారాయణ మండలంలోని తిమ్మాపూర్. రెండెకరాల్లో పత్తి పంట వేయగా గులాబి పురుగు సోకి దిగుబడులు దెబ్బతిన్నాయి. రెండెకరాలకు సుమారు రూ.30 వేలు పెట్టుబడులు పెట్టాడు. కేవలం అయిదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. పెట్టుబడులు సైతం చేతికి రాకపోవడంతో పత్తి పంటను తొలగించి మొక్కజొన్న వేశాడు. పత్తి పంటను అలాగే దమ్ము చేయడంతో తెల్లబంగారం ఇలా నేలపై పరుచుకుంది.

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే



**గతేడాది ప్రభుత్వం పత్తి సాగు తగ్గించడంతో రైతులు ఇతర పంటల వైపు మళ్లారు. దీన్నే నమ్ముకున్న రైతులు పత్తి సాగు చేయగా అధిక ధరలు లభించాయి. ఈసారి ఖరీఫ్‌లో భారీ స్థాయిలో రైతులు పత్తి పంట సాగు చేశారు. దిగుబడులు రాక ధరలు లేక తీవ్రంగా నష్టపోయారు. దీనికి తోడు గులాబి పురుగు రైతులను నట్టేట ముంచింది. రైతులు పత్తి నంతా అమ్ముకున్నాక ప్రస్తుతం అమాంతంగా ధరలు పెరిగాయి. విపణిలో క్వింటా రూ.5,200 వరకు పలుకుతోంది. పెరిగిన ధరలతో పంట పడిన రైతుకన్నా పంట కొనుగోలు చేసిన వ్యాపారులకే 'తెల్లబంగారం' అయ్యింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు క్వింటా సరాసరి రూ.800-1000 కోల్పోగా రూ.190 కోట్లు నష్టపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. పత్తి రైతు దయనీయస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..**

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి సాగు, నష్టం వివరాలు పట్టికలో..**

| జిల్లా | విస్తీర్ణం హెక్టార్లలో | అంచనా దిగుబడి (లక్షల క్వింటాళ్లలో) | విపణికి వచ్చిన పంట (లక్షల క్వింటాళ్లలో) | విపణిలో పెరిగిన ధరలతో రైతుకు వాటిల్లిన నష్టం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 1.40 లక్షలు | 23.00 | 14.00 | రూ.140 కోట్లు |
| నిర్మల్ | 1.36 లక్షలు | 12.00 | 3.00 | రూ.30 కోట్లు |
| మంచిర్యాల్ | 64 వేలు | 2.00 | 1.10 | రూ.10.10 కోట్లు |
| కుమురంభీం | 62 వేలు | 1.80 | 1.00 | రూ.10 కోట్లు |

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మునుపెన్నడూ లేనంతగా భారీ విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 1.40 లక్షల హెక్టార్లలో, నిర్మల్ జిల్లాలో 1.36 లక్షల హెక్టార్లలో, మంచిర్యాల జిల్లాలో 64 వేల హెక్టార్లలో, కుమురం భీం జిల్లాలో 62 వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు కేవలం 19 లక్షల క్వింటాళ్ల పత్తి మాత్రమే విపణికి (మిగతా 7లో)

## విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

**ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని బాదనకుర్తిలో బుధవారం జరిగింది. బాదనకుర్తికి చెందిన రైతు మడిషెట్టి రాజన్నకు ఎద్దు మేతకు వెళ్లి విద్యుత్తు నియంత్రిక వద్ద మేత మేస్తుండగా నియంత్రికకు ఉన్న 11 కేవీ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో బాధిత రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. యాసంగి పంటలకు నాట్లు వేసే సమయంలో రూ.55 వేలు విలువ చేసే ఎద్దు ఆకస్మాత్తుగా మృత్యువాతపడటంతో చేయివిరిగినంత పనయ్యిందని వాపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం మంజూరయ్యేలా కృషిచేయాలని బాధిత రైతు కోరుతున్నాడు. సర్పంచి గడ్డం మోహన్, నాయకులు దొనికెని సాగర్, పశువైద్య సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు.


విద్యుత్తు నియంత్రిక వద్ద మృతిచెందిన ఎద్దు

## వన్యప్రాణులు వేటాడిన వ్యక్తులపై కేసు నమోదు

**నెన్నెల, న్యూస్‌టుడే:** మండలంలోని బొప్పారం సమీపంలో వన్యప్రాణుల కోసం వేటాడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖాధికారి అప్పలకొండ తెలిపారు. అయన తెలిపిన వివరాలిలా.. బెల్లంపల్లి మండలం దుగ్నెపల్లి గ్రామానికి చెందిన చల్లూరి నానయ్య, దుగుట రవి, చెల్మటికారి రవిలు విద్యుత్తు తీగలు అమర్చి వన్యప్రాణుల వేట కోసం ప్రయత్నిసున్నట్లు తెలిపారు. అడవీలో గస్తీ తిరుగుతుండగా వేటగాళ్లను గుర్తించినట్లు చెప్పారు. అక్కడికి వెళ్లగా ముగ్గురులో ఇద్దరు పరారైనట్లు చెప్పారు. చల్లూరి నానయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోని రిమాండ్‌కు పంపించినట్లు ఆయన వివరించారు.


నిందితుడు నానయ్యను అదుపులోకి తీసుకున్న అధికారులు

## మహిళను అవమానపర్చినందుకు జరిమానా

**హాజీపూర్ (మంచిర్యాల న్యాయవిభాగం), న్యూస్‌టుడే:** హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామానికి చెందిన వైద్య తిరుపతి అనే వ్యక్తి ఒక మహిళను అవమానపర్చినందుకు రూ.5వేలు జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట ఫాస్టు ట్రాక్ అసిస్టెంట్ సెషన్స్ ఇన్చార్జి జడ్జి మహ్మద్ నిజాముద్దీన్ బుధవారం తీర్పునిచ్చారు. 2013 సెప్టెంబర్ 3న అదే గ్రామానికి చెందిన అంకం అమ్మాయి అనే మహిళను దూషించి అవమానపర్చినందుకు బాధితురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు బాధితురాలి కుటుంబసభ్యులు హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి కోర్టుకు పంపారు. కోర్టులో పీపీ కిరణ్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా దూషించి అవమానపర్చినట్లు నిరూపణ కాగా న్యాయమూర్తి దోషి తిరుపతికి రూ.5వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య

**భీంపూర్, న్యూస్‌టుడే:** మండలంలోని నిపాని చెందిన గొంపల్లి చిన పొచ్చన్న(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగి పొచ్చన్నను గమనించిన కుటుంబీకులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లేష్ తెలిపారు.

## కాలిబూడిదైన కంది పంట

**ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే:** ఇంద్రవెల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని అంజి గ్రామానికి పండిత్ చాందుడే అనే రైతుకు చెందిన కంది పంట ప్రమాదవశాత్తు కాలిబూడిద కావడంతో రూ.లక్ష నష్టం జరిగింది. గ్రామస్థులతో పాటు తహసీల్దార్ మామిడి శివరాజ్‌లు తెలిపిన వివరాల ప్రకారం రైతు తన ఐదు ఎకరాల సాగు భూమిలో వేసిన కంది పంటను ఒక చోట పోగు చేశారని, మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూర్తిగా కాలి పోయిందన్నారు. రైతు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకుని కంది పంటను అంచన వేయగా రూ.లక్ష నష్టం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. కంది పంట కాలిబూడిద అయిన సంఘటన స్థలాన్ని ఎస్సై గంగారం సైతం సందర్శించారు.


కాలిబూడిద అయిన కందిపంట

# అతి వేగం.. ఒకరి ప్రాణాన్ని బలిగొంది

**☛ మరొకరి పరిస్థితి విషమం ☛ ఇద్దరికి గాయాలు**

**కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** అతి వేగం ఒకరికి ఉత్సాహం కలిగిస్తే.. మరొక కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అప్పటిదాక చిన్నారితో ఆడుకున్న అమ్మ ఆనందం అంతలోనే ఆవిరైంది. ఇంటికి చేరే క్రమంలో ద్విచక్రవాహనం రూపంలో మృత్యువు కబలించింది. పేద కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలుతో ఇంటి యాజమాని ఆటో నడుపుతూ సంతోషంగా జీవిస్తున్నా సమయంలో ద్విచక్రవాహన చోదకుని అతివేగం ఓ కుటుంబంలో ముగ్గురు చిన్నారులకు తల్లిని లేకుండా చేసింది. కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి కమాన్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కన్నెపల్లి గ్రామానికి చెందిన గోమాస దేవాజీ, అతని భార్య అనిత, చిన్న కుమార్తె సరితను తీసుకొని బుధవారం మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లి వస్తున్నారు. కాసిపేట పోలిస్‌స్టేషన్ పరిధిలోని చొప్పరిపల్లి ముఖద్వారం సమీపంలో ఆటోను వెనుక నుంచి ద్విచక్రవాహనం అతి వేగంగా ఢీకొని ఆటోలోకి చొచ్చుకుపోయింది. ఈప్రమాదంలో ఆటోలో వెనుక కూర్చున్న అనిత వారి కుమార్తె సరిత వెంటనే కిందపడిపోయారు. పడిపోయే సమయంలో అనిత(27) తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. అనిత పక్కనే కూర్చున్న చిన్నారి సరిత కింద పడిపోయే సమయంలో తల్లి మీద పడింది. దీంతో చిన్నారికి స్వల్పగాయాలు కాగా మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న అనిత భర్త దేవాజీ కాలు విరిగింది. ద్విచక్రవాహనం నడుపున్న రియాజ్ చేతికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా అతన్ని 108లో బెల్లంపల్లి ఆసుపత్రి నుంచి అత్యవసర చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అతని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కాసిపేట ఎస్సై సతీష్ తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదం సంఘటణ స్థలంలో ఉన్న వారందరిని కంటతడి పెట్టించింది.


ఆటోలోకి చొచ్చుకుపోయిన ద్విచక్రవాహనం


ప్రమాదంలో మృతిచెందిన అనితపై పడిపోయిన చిన్నారి

# సంస్కృతి పరిరక్షణలో శిశుమందిరాలు ఆదర్శం

**జిల్లా విద్యాధికారి డా.రవికాంత్‌రావు**

**చొక్కారాంనగర్ (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే:** శిశుమందిరాల్లో చదివే విద్యార్థులు చదువు, నైతిక విలువలతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా విద్యాశాఖాధికారి డా.రవికాంత్‌రావు పేర్కొన్నారు. బుధవారం హాజీపూర్ మండలం పడ్తనపల్లి పంచాయతీ పరిధిలోని చొక్కారాంనగర్‌లో లోని శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఐదు జిల్లాలకు చెందిన విభాగ్‌స్థాయి ఖేల్‌కూద్ పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని కాపాడేప్రయత్నంలో శిశుమందిరాలు ఎంతో పురోగతి సాధిస్తున్నాయన్నారు. క్రీడలతో విద్యార్థుల మనోవికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీఐ వివేకానందరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు ప్రతి విద్యార్థి నిత్యం శ్రమించాలన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎంపీఐ రంగారావు, పాఠశాల అధ్యక్షుడు వినయ్‌ప్రకాష్‌రావు, విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు డా.విష్ణువర్ధనరావు, కరీంనగర్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవిందర్, ప్రధానాచార్యుడు రావుల రామన్న, తదితరులు పాల్గొన్నారు.

### విజేతలు వీరే....

రాష్ట్రంలోని ఐదు జిల్లాల పరిధిలోని శ్రీసరస్వతి విద్యాపీఠం పాఠశాలలకు చెందిన 250 కి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జూనియర్ల విభాగంలో 600మీ.పరుగు పందెంలో గడ్డం చరణ్ (జమ్మికుంట) ప్రథమ, రుత్విక్ (తడకపల్లి) ద్వితీయ స్థానాలు సాధించారు. 80మీ. హార్డిల్స్ విభాగంలో కౌశిక్ (రాంపూర్) ప్రథమ, కె.రాహుల్ (తడకపల్లి) ద్వితీయ స్థానాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో మణిదీపక్ (ప్రథమ), పి.సంతోష్(ద్వితీయ), హైజంప్‌లో ఉదయ్‌కిరణ్ (ప్రథమ), సంతోష్ (ద్వితీయ), షాట్‌పుట్ శ్రీనివాస్ (ప్రథమ), మణికంఠస్వామి (ద్వితీయ), కబడ్డీ మంచిర్యాల జట్టు, ఖోఖోలో రాంపూర్ జట్లు ప్రథమ స్థానాలు పొందారు. సీనియర్స్ విభాగంలో 1500 మీ.పరుగు పందెంలో అఖిల్ (ప్రథమ), హరీష్ (ద్వితీయ), మూడువేల మీ.పరుగు పందెంలో అఖిల్, రూప్‌సాగర్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలకు క్రీడల అనంతరం నిర్వహించిన సమారోప్ కార్యక్రమంలో కరీంనగర్ శైక్షణిక్ ప్రముఖ్ కాటం రవిందర్, వినయ్‌ప్రకాష్‌రావు, తదితరుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ విభాగ్ కార్యదర్శి మేచినేని దేవెందర్, ప్రబంధకారిణి సభ్యులు బొడ్డు శంకర్, తదితరులు పాల్గొన్నారు.


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

# కరెంటుపై ఆధారపడిన వారికి కానుక

**★ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలు అమలు ★ తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి**

**ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** తెలంగాణ ప్రభుత్వం 24గంటల కరెంటు ఇస్తుండటంతో పంటల సాగుతో పాటు దీనిపై ఆధారపడిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం కానుక ఇచ్చినట్లయిందని తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కరెంటు లేక గతంలో అనేక పంటలు ఎండిపోయాయని ప్రస్తుతం బోరుబావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు 24గంటల విద్యుత్తు వరం లాంటిదని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డైరీ కార్యాలయం ఆవరణలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే ఎలాంటి లాభాలు ఉంటాయో చెప్పడమే కాకుండా.. అప్పుడు చెప్పిన ఘట్టాన్ని గుర్తుకు తెచ్చేలా విద్యుత్తును అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. వద్దనే వరకు నీళ్లు.. సరిపోతుందనే వరకు కరెంటు ఇచ్చే ప్రభుత్వమని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు అందించడం, ఎరువుల కొరత లేకుండా చేయడం, పంటలకు గిట్టుబాటు ధరలు అందజేస్తూ ముఖ్యమంత్రి రైతుపక్షపాతిగా నిరూపించుకుంటున్నారని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ మూడున్నరేళ్లలో రూ.14వేల కోట్లు ఖర్చుచేసిందని తెలిపారు. రాష్ట్రం పవర్‌హబ్‌గా మారబోతోందన్నారు. ఆటోస్టార్టర్లను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాబాయి, మమత, గంగారెడ్డి పాల్గొన్నారు.

### అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి

రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ సంక్షేమంతో పాటు అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేస్తానని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాబాయి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డైరీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ మహిళకు గుర్తింపు దక్కడం ఇది మొదటిసారిగా భావిస్తున్నట్లు వివరించారు. పదవి వచ్చినందుకు ముఖ్యమంత్రి, జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ సభ్యులు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆమెను స్థానిక తెరాస నాయకులు శాలువాతో సత్కరించారు.


మాట్లాడుతున్న తెరాస రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి


నీలాబాయిని సన్మానిస్తున్న తెరాస నాయకులు

# ఏడాదిలోగా రూపురేఖలు మారుస్తాం

- జిల్లా శాసనసభ్యులు హామీ
- ఈ సంవత్సరం ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడి

రానున్న ఏడాదిన్నరలో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను తప్పకుండా అమలు చేస్తామని జిల్లా శాసనసభ్యులు తెలిపారు. గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటివరకు చేసిన పనుల గురించి వివరించారు. శాసనసభ్యులుగా ఎన్నికై మూడున్నరేళ్ల కాలం పూర్తైన సందర్భం, కొత్త సంవత్సరంలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టబోయే అభివృద్ధి పనులపై వారితో 'న్యూస్‌టుడే' ముఖాముఖి నిర్వహించింది. ఈ వివరాలు ఇలా..

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

**- మంచిర్యాల శాసనసభ్యుడు నడిపెల్లి దివాకర్‌రావు**

**మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే**

మంచిర్యాల నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఈ ఏడాది ఎక్కువగా గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వంద పడకల ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.



**న్యూస్‌టుడే:** నియోజకవర్గంలో 2017లో మీరు చేసిన అభివృద్ధి పనులు ఏమిటి?

**ఎమ్మెల్యే దివాకర్‌రావు:** గతేడాది ఎమ్మెల్యే కోటా కింద కేటాయించిన రూ.3 కోట్ల నిధుల నుంచి ఇటీవల రూ.60 లక్షలతో వివిధ అభివృద్ధి పనుల నిర్మాణానికి నిధులు కేటాయించాం. ఈ నిధులను రహదారులు, కల్వర్టులు, బోరుబావులు తదితల అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నియోజకవర్గంలో ఉపాధి పనులను చేయడానికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. ఈ నిధుల మంజూరైతే ఎమ్మెల్యే కోట నుంచి 20 శాతం నిధులు ఈజీఎస్ అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంటుంది.

**న్యూ: ప్రభుత్వ భూముల ఆక్రమణపై మీ మీద వచ్చిన ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి?**

**ఎమ్మెల్యే:** ఒక్క ఇంచు ప్రభుత్వ భూమి కూడా నేను కబ్జా చేయలేదు. మంచిర్యాలలోని సర్వే నెం.324లో 117.04 ఎకరాల ప్రభుత్వ భూమిలో గతంలో ఎవరికి ఎంత కేటాయించారో రెవెన్యూ రికార్డుల్లో భూముల లెక్కలు ఉన్నాయి. రెవెన్యూ ఉద్యోగుల తప్పిదం వల్ల మా నాన్న పేరు మీద 57 ఎకరాలు ఉన్నట్టు పొరపాటున ఎక్కించారు. ఆ తప్పును గుర్తించి అధికారులే రెవెన్యూ రికార్డు నుంచి ఆ పేరును తొలగించారు. నాపై కొంతమంది పనికట్టుకుని అసత్య ఆరోపణలు చేశారే తప్ప నేను ఎక్కడా ప్రభుత్వ భూమి ఆక్రమించలేదు.

**న్యూ:** మూడున్నరేళ్ల పాలనలో మీరు చేసిన అభివృద్ధి పనులు ఏమిటి?

**ఎమ్మెల్యే:** గోదావరినది పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాం. ఈ పుష్కరాల నిధులతో ప్రధాన రహదారులను విస్తరించాం. ఎల్లంపల్లి జలాశయం బ్యాక్‌వాటర్ కింద గూడెం ఎత్తిపోతల పథకం నిర్మించి వ్యవసాయానికి సాగునీరు అందించేలా కృషి చేశాం. రాయపట్నం వంతెన నిర్మాణం పూర్తి చేయించాం. నంబాలలో ఎత్తిపోతల పథకం నిర్మించాం

**న్యూ:** మీ దత్తత తీసుకున్న గ్రామాల్లో ఏ అభివృద్ధి పనులు చేశారు?

**ఎమ్మెల్యే:** హాజీపూర్, లక్షెటిపేట, రాజంపేట గ్రామాలను దత్తత తీసుకున్నాను. ఆయా గ్రామాల్లో దాదాపు రూ.4 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం.

**న్యూ:** ఎన్నికల ముందు, ఆ తర్వాత వివిధ సమావేశాలు నిర్వహించిన సమయంలో మీరు ఇచ్చిన హామీలను ఎంత వరకు అమలు చేశారు?

**ఎమ్మెల్యే:** ఎన్నికల ముందు, ఆ తర్వాత కూడా ప్రత్యేకమైన హామీలు ఏమీ ఇవ్వలేదు. ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాను.

**న్యూ:** మంచిర్యాల పురపాలక సంఘంలో అవినీతి పెరిగిపోతోంది. . మీరు ప్రతి నెల కౌన్సిల్ సమావేశాలు హాజరు అవుతున్నా అవినీతిని అరికట్టంలేదనే ఆరోపణలపై మీ సమాధానం ఏమిటి?

**ఎమ్మెల్యే:** పురపాలక సంఘంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గుత్తేదారులతో వెంటనే చేయిస్తాం. పురపాలక సంఘంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల వద్ద ఒక్క రూపాయి తీసుకోకుండా పని చేయాలని గతంలోనే ఆదేశించాను. ఎవరైనా అక్రమంగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే నా దృష్టికి తీసుకొస్తే వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.



**లక్షెట్టిపేటలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనం ఉన్నచోట నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని అనేక సార్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు హామీ ఇచ్చారు. ఇంతవరకు పక్కాభవనం నిర్మాణం చేయలేకపోయారు.**

## అన్ని రంగాల్లో అభివృద్ధి

**- ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే నల్లాల ఓదెలు**

**చెన్నూరు, న్యూస్‌టుడే**

గత మూడున్నరేళ్లలో రూ.800 కోట్లకు పైగా నిధులతో చెన్నూరును అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల సమస్య ఉండకుండా చేస్తానని తెలిపారు.



**న్యూస్‌టుడే:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను ఎంతవరకు అమలు చేశారు?

**ఓదెలు:** ప్రధానంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని చెప్పాను. చెప్పినట్టే ప్రజలకు అందుబాటులో ఉంటున్నాను. నియోజకవర్గ వ్యాప్తంగా మిషన్ కాకతీయ పథకం ద్వారా రూ.32 కోట్లు, మిషన్ భగీరథ పథకం కింద రూ.250 కోట్లు, మున్సిపాలిటీ అర్బన్‌లో అభివృద్ధి పనులకు రూ.38.75 కోట్లు, పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.38 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు నియోజకవర్గానికి రూ.197.38 కోట్లు, ఇందారం నుంచి అర్జున గుట్ట వరకు జాతీయ రహదారి నిర్మాణానికి రూ.240 కోట్లు, సీడీపీ నిధులు రూ.8.25 కోట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రూ.6.25 కోట్లు, పింఛన్లకు రూ.9 కోట్లు నిధులు కేటాయించాను.

**న్యూ: నియోజకవర్గ కేంద్రానికి మంజూరైన మినీ ట్యాంకుబండ్‌ను మందమర్రికి తరలించడంపై స్థానిక ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. దీనిపై మీ స్పందన ఏమిటి?**

**ఓదెలు:** ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అసంతృప్తికి గురికావాల్సిన అవసరం లేదు. చెన్నూరు పెద్ద చెరువును కూడా వచ్చే ఏడాదిలోగా మినీ ట్యాంకుబండ్‌గా మార్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేశాం. ఇప్పటికే చెరువు అభివృద్ధికి రూ.75 లక్షలు కేటాయించాం. చెరువు అభివృద్ధి విషయమై మంత్రి హరీష్‌రావుతో సైతం మాట్లాడాం. ఆయన సానుకూలంగా స్పందించారు. ఎన్నికలకంటే ముందే దీన్ని పూర్తి చేస్తాం.

**న్యూ:** నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. వేసవికి ముందే నీటి ఎద్దడి మొదలై ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. శాశ్వత పరిష్కార దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఓదెలు:** ఇది గతంలో మాట. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాను. మిషన్ భగీరథ పథకంలో భాగంగా అన్ని చోట్ల నీటి పథకాలను నిర్మిస్తున్నాం.

**న్యూ:** నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైద్య రంగంలో సమస్యలు ఉన్నాయి. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, వైద్యుల కొరతతో రోగులకు సరైన సేవలు అందడం లేదు. ఉప కేంద్రాలకు పక్కా భవనాలు సైతం లేవు. ఏమంటారు?

**ఓదెలు:** గతంలో కంటే ఆసుపత్రులన్నీ ఉన్నతీకరించాం. కోటపల్లి పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలే ఇందుకు నిదర్శనం. త్వరలో ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయనుండటంతో సమస్యకు పరిష్కారం లభిస్తోంది. ఉపకేంద్రాలకు పక్కా భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాం. ఇందుకోసం అన్ని చోట్ల స్థలాలను ఎంపిక చేస్తున్నాం.

**న్యూ:** అగ్నిమాపక కేంద్రం, ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాట్లు ఎన్నికల హామీలకు మాత్రమే పరిమితమయ్యాయి. వీటి ఏర్పాటుకు ఏవిధంగా ప్రయత్నం చేస్తున్నారు?

**ఓదెలు:** చెన్నూరులో ఆర్టీసీ బస్‌డిపో, అగ్నిమాపక కేంద్ర నిర్మాణాలకు స్థల కేటాయింపు జరిగింది. నిధులు విడుదలకు కృషి చేస్తున్నాం.



**చెన్నూరులో బస్‌డిపో ఏర్పాటు ఎన్నికల ప్రధాన హామీగానే మిగులుతోంది. మూడు పర్యాయాలు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికైన నల్లాల ఓదెలు ప్రతి సారి ఎన్నికలకు ముందు బస్‌డిపో ఏర్పాటుకు హామీ ఇస్తూనే ఉన్నారు. ఇప్పటికీ ఈ హామీ నెరవేరలేదు.**

## కీలక సమస్యల పరిష్కారమే ఎజెండా

**- బెల్లంపల్లి శాసనసభ్యుడు దుర్గం చిన్నయ్య**

**తాండూరు, న్యూస్‌టుడే**

రానున్న ఏడాదిన్నరలో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలను తప్పకుండా అమలు చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే తెలిపారు. బెల్లంపల్లి పట్టణాన్ని విద్యా కేంద్రంగా పేరు తీసుకువస్తామని తెలిపారు.

**న్యూ:** గడిచిన మూడున్నరేళ్లలో మీరు ఇచ్చిన, నెరవేర్చిన హామీలు న్నాయా..వాటి పరిస్థితి ఏమిటి..?

**ఎమ్మెల్యే:** విద్య, వైద్యం, రవాణా మార్గాలతో పాటు బెల్లంపల్లి పట్టణ సమస్యలను ప్రభుత్వం దృష్టికి వెళ్లి పరిష్కరిస్తున్నాను. ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాను. బెల్లంపల్లి పట్టణవాసుల పట్టాలు, సామాజిక ఆసుపత్రి స్థాయి పెంపు, ఖజానా గండి చెరువు లాంటి ప్రధాన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాను.



**న్యూ:** మీరు పరిష్కరించిన ప్రధాన సమస్యలు చెబుతారా?

**ఎమ్మెల్యే:** గతంలో భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లోని గ్రామాలకు కనీస రవాణా లేదు. నేను ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేమనపల్లి నుంచి బెల్లంపల్లి, నీల్వాయి నుంచి చెన్నూరు రోడ్లు, నెన్నెల మండలంలోని జంగల్‌పేటకు రూ.11కోట్లతో రోడ్డు, భీమిని నుంచి బెల్లంపల్లి, తాండూరు మండలాలకు రెండు వరుసల దారి పనులు పూర్తవుతున్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికే పూర్తయ్యాయి. భీమిని మండలంలో పీఎంజీఎస్‌వై నుంచి 10కోట్లతో 5 వంతెనలు, ఆర్‌అండ్‌బీ పరిధిలో 15కోట్లతో 6వంతెనలు మంజూరు చేయించాను.

**న్యూ: బెల్లంపల్లి బస్‌డిపో ఏర్పాటు వెనుకబడిపోయింది.. ఎందుకు..?**

**ఎమ్మెల్యే:** బెల్లంపల్లిలో బస్ డిపో ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాను. మొదటి సంవత్సరమే ఈసమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాను. మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాను.

**న్యూ:** ఇంకా మీరు పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలేమున్నాయి.. 2018లో వాటికి పరిష్కారం వస్తుందా?

**ఎమ్మెల్యే:** ప్రధానంగా బెల్లంపల్లి పట్టణం, శివారు ప్రాంతాల్లోని సింగరేణి స్థలాలకు పట్టాలిప్పిస్తానని హామీనిచ్చాను. దాదాపుగా 20వేల మందికి పట్టాలు ఇప్పించేందుకు ఇప్పటికే చర్చలు చేపట్టాను. అటు ప్రభుత్వం, ఇటు సింగరేణి సంస్థతో చర్చించాను. ఈఏడాదిలో వారందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు వస్తాయి. బెల్లంపల్లి క్లస్టర్ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాను. తాండూరు మండలం మాదారంటౌన్‌షిప్‌లో కార్మికేతరుల ఇళ్ల సమస్య, విద్యుత్ సమస్య పరిష్కారానికి దగ్గర పడ్డాయి. ఇవన్నీ ఈసంవత్సరం పరిష్కారమవుతాయి.

**న్యూ:** దత్తత గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదని ఆరోపణలున్నాయి.. ఏమంటారు..

**ఎమ్మెల్యే:** నెన్నెల మండల కేంద్రంలోని ప్రతి వాడలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశాం. తాండూరు మండలంలోని కిష్టంపేటలో ఇప్పటికే 18 లక్షల సీడీపీ నిధులు, మరో 20లక్షల ఉపాధి నిధులు కేటాయించి సీసీ రోడ్లు పూర్తి చేయించాను. కన్నెపల్లి మండలంలోని నాయికినిపేటలో ఏళ్లుగా నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరిస్తూ గ్రామానికి ఉప విద్యుత్ కేంద్రం మంజూరు చేయించాను.

**న్యూ:** రెండుపడక గదుల ఇళ్లు, దళిత బస్తీ ప్రజల్లో నిరాశ కలిగించాయి. మామిడి మార్కెట్ యార్డు నిర్మాణం నత్తనడకన సాగుతోంది కదా..!

**ఎమ్మెల్యే:** బెల్లంపల్లి పురపాలక సంఘంలో 160 ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయి. వేమనపల్లి, భీమిని మండలాల్లో దళిత బస్తీ పథకం కింద పట్టాలు కూడా అందజేశాం. బెల్లంపల్లిలో మామిడి మార్కెట్ యార్డు ఏర్పాటులో హామీకి కట్టుబడి నిధులు మంజూరు చేయించాను.



**తాండూరు మండలం ఖజానాగండి చెరువును అధికారులతో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరిశీలిస్తున్న చిత్రం ఇది. 15 గ్రామాలకు సాగునీరు అందించే ఈ చెరువు పునరుద్ధరణకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికీ హామీగానే మిగిలిపోయింది..**

# మంచిర్యాల

## రక్తనిధి కేంద్రంలో నిల్వలు

**ఏసీసీ(మంచిర్యాల:** మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో నిల్వలు బుధవారం వరకు ఎ పాజిటివ్ 6, ఎ నెగటివ్ 0, బి పాజిటివ్ 29, బి నెగటివ్ 1, ఏబీ పాజిటివ్ 1, ఏబీ నెగటివ్ 1, ఒ పాజిటివ్ 10, ఒ నెగటివ్ 7 అన్ని పరీక్షలు చేసి సిద్ధంగా ఉన్నాయి. అవసరం ఉన్నవారు కేంద్రం స్థిరవాణి సంఖ్య(08736-259259, 252259)లను, లేదా రక్తనిధి కేంద్రం నిర్వాహకుడు డా.డి.విష్ణుమూర్తి చరవాణి(9492557337)ని సంప్రదించగలరు.

## పాఠశాలల అభ్యున్నతికి కృషి చేయాలి

**లక్సెట్టిపేట, న్యూస్‌టుడే:** పాఠశాలల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ కృషి చేయాలని మండల విద్యాధికారి కాసుల రవిందర్ కోరారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం హెలెన్ డోరోతి, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

# పత్తికి 'గులాబీ' విపత్తు



గులాబి తెగులు సోకిన పత్తి కాయ

### కాత, పూత ఉన్న పత్తిని తొలగించేందుకు రైతులు విముఖం✤ లార్వా విస్తరిస్తే కష్టమేనంటున్న వ్యవసాయ అధికారులు

**లక్సెట్టిపేట, న్యూస్‌టుడే:**

గులాబీ రంగు పురుగు ఈ ఏడాది రైతన్నను ఆందోళనకు గురి చేస్తోంది. అనూహ్యంగా సోకిన తెగులు పంటకు వేగంగా విస్తరించే అవకాశం ఉండటంతో ఈ ఏడాది రెండు నెలల ముందుగానే పత్తి పంటను తొలగించాలని వ్యవసాయ అధికారుల సూచిస్తున్నారు. ప్రారంభంలో పత్తికి నామమాత్రంగా మద్దతు ధర పలికినా అనూహ్యంగా మద్దతు ధర రూ.5500 వరకు చేరడంతో గట్టెక్కినట్టే అని భావించిన రైతులకు గులాబీ ఉద్ధృతి రోజు రోజుకు పెరుగుతుండటం ఆశనిపాతంగా మారింది. మరో రెండు నెలల వరకు పత్తి ఏరే అవకాశం ఉన్నా నోటికాడికి వచ్చిన ముద్ద ఒలికిపోయినట్టు తమ పరిస్థితి మారిందని రైతులు వ్యక్తం చేస్తున్న ఆవేదనపై 'న్యూస్‌టుడే' కథనం..

### తొలగించకుంటే తీరని నష్టం

గులాబీ తెగులు జీవిత దశలను త్వరగా పూర్తి చేసుకుని పంట కాలంలోనే దశల వారీగా సంతతిని పెంచుకుంటుంది. దీంతో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం 10 నుంచి 20 శాతం వరకు పంటలను ఆశించి తెగులు మార్చినాటికి కొన సాగితే పూర్తిస్థాయిలో విస్తరించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. తెగులు 70 శాతానికి మించితే ఖరీఫ్‌లో పంట నష్టం దారుణంగా ఉంటుందని వారు చెబుతున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించారు. ఉన్న దూదిని ఏరి పంట మొక్కలను పూర్తిగా తొలగించి దుక్కి దున్నుకోవాలని అవకాశం ఉన్న భూముల్లో వేసవి పంటలు సాగు చేయాలని సూచిస్తున్నారు.



విచ్చుకుని విరగ పూసిన దూది

### ఆశ నిరాశల ఆరాటం

గతేడాది పత్తికి అధిక దిగుబడి రావడంతో ఈ ఏడు నియోజకవర్గంలోని రైతులు పెద్ద ఎత్తున పత్తి పంట సాగు చేశారు. వర్షాలు సకాలంలో కురవడంతో పత్తికి తగిన మందులు పిచికారి చేశారు. దీంతో పంట ఏపుగా ఎదిగింది. ప్రారంభంలో అకాల వర్షాలకు కాయలు నల్లబారినా తర్వాత దశలో పత్తి ఏపుగా పెరిగి దూది పింజలు విచ్చుకున్నాయి. మరో వైపు మద్దతు ధర కూడా పెరగడంతో తమ ఇబ్బందులు తొలిగినట్టే అని భావించిన రైతులకు గులాబీ తెగులు తీవ్రత ఇబ్బందిగా మారింది. ఒక వైపు పెరిగిన ధర.. మరో వైపు ముందస్తుగా పంట తొలగించాల్సిన దుస్థితి రైతాంగానికి ఆశ నిరాశల ఆరాటంగా మారింది.

**నియోజక వర్గంలో పత్తి సాగు వివరాలు**

| మండలం | సాగు విస్తీర్ణం(ఎకరాల్లో) |
| --- | --- |
| లక్సెట్టిపేట | 9988 |
| .దండేపల్లి | 9581 |
| హాజీపూర్ | 6561 |
| మంచిర్యాల | 470 |
| మొత్తం | 26,600 |



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు( దాచిన చిత్రం)

నియోజకవర్గంలో సాగునీటి వనరులు ఉన్న చోట్లలో మినహా మిగతా భూముల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది అనూహ్యంగా కురిసిన వానలకు పత్తి పంటపై ప్రభావాన్ని చూపింది. దూది పింజలు తడిసి నల్లగా మారాయి. దీనికి తోడు కొనుగోలు సమయంలో మద్దతు ధర అంతంత మాత్రంగానే ఉంది. అనూహ్యంగా పత్తి ధర పెరగడంతో తమ పంట పండిందని భావించిన రైతులకు గులాబీ పురుగు ఉద్ధృతి కోలుకోని దెబ్బ తీసింది. పత్తిని తొలగించి తెగులు నివారణకు తగిన యాజమాన్య చర్యలు చేపడితేనే వచ్చే ఖరీఫ్‌నకు తెగులు ఉద్ధృతి తగ్గించవచ్చని లేదంటే మరింత పెరిగి పంట నష్టం తీవ్రత పెరుగుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

### మూడో విడత తర్వాత తొలగిస్తాం గోపతి రాము, రైతు, ఇటిక్యాల



ఈ ఏడాది అకాల వర్షం వల్ల పత్తి నల్లబారింది. మొదటి విడత అంతంతమాత్రంగానే వచ్చింది. రెండో విడత ఏరిన సమయంలో కొంత మేర పంట వచ్చినా మరో రెండు విడతల ఏరే అవకాశం ఉంది. నీరు పెట్టినందున పంట కూడా బాగుంది. వ్యవసాయ అధికారులు చెప్పినట్టు ఇప్పుడే పంటను తొలగిస్తే పెట్టుబడులు కూడా రావు. వచ్చే ఏడాది దిగుబడి, వాతావరణం ఎలా ఉంటుందో అన్న ఉద్దేశంతో చాలా మంది రైతులు కళ్ల ముందు ఉన్న పంటను రెండు నెలల ముందే తొలగించడానికి సిద్ధంగా లేరు.

### అవగాహన కల్పిస్తున్నాం చల్ల ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి, లక్సెట్టిపేట

గులాబి తెగులు ఉద్ధృతిపై రైతులకు అవగాహన కల్పించాం. పంట తొలగించకుంటే వచ్చే సంవత్సరం తెగులు రెట్టింపు అవుతుందన్న విషయాన్ని, తలెత్తే ఇబ్బందులను గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి వివరించాం. పంట సాగు ఆలస్యం కావడంతో పాటు ఈ ఏడాది ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో రైతులు ముందస్తుగా పంటను తొలగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడే తొలగిస్తే పెట్టుబడులు కూడా వెళ్లవన్న ఉద్దేశంతో ఉన్నారు. ప్రస్తుతానికి ఇబ్బంది లేకున్నా సాధ్యమైనంత త్వరగా తొలగిస్తే రానున్న రోజుల్లో పంటలకు ఇబ్బందులు ఉండవు.




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

## ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం

**దండేపల్లి, న్యూస్‌టుడే:** ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమం ఆగదని ఎటువంటి ఆందోళనలకైనా కలిసి పోరాడాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తగరపు సత్తయ్య, యువజన అధ్యక్షుడు లింగపల్లి బాపు కోరారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన 45 రోజుల దీక్షకు మద్దతుగా దండేపల్లిలో బుధవారం సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు వర్గీకరణ చేస్తామంటూ హామీలిస్తూ మన ఓట్లతో గద్దెనెక్కి ఆ తర్వాత విస్మరిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ తహసీల్దార్ దత్తు ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంద రాజయ్య, కొల్లూరి రమేశ్, ఆవుల గంగన్న, బొమ్మెన గంగాధర్, జిల్లపల్లి వెంకటేశ్, కొంగల సత్తయ్య, మల్యాల శ్రీనివాస్, ఉపారపు లింగయ్య, దుమాల్ల కొండయ్య పాల్గొన్నారు.

## ఉపాధిహామీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉమ్మడి మంచిర్యాల మండలంలోని పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు వేగంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల మండలపరిషత్తు అభివృద్ధి అధికారి ఎంఎ హై అన్నారు. బుధవారం మంచిర్యాల మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల్లో నిర్మిస్తున్న వంటగదులు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను సత్వరమే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీపీ బేర సత్యనారాయణ, గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీడీ మల్లేష్, పంచాయతీ విస్తరణాధికారి శంకర్, సర్పంచులు డేగ బాపు, దుర్గం లక్ష్మి, జాడి సత్యం, సీపల్లి లక్ష్మి, కార్యదర్శులు సమ్మిరెడ్డి, శ్రీపతిబాపురావు, అజ్మత్‌అలీ, చంద్రకళ, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కుంటల్‌గూడ కట్ట గిరిజన గ్రామంలో చేతి పంపు వద్ద నిలిచిన మురుగునీరు

## చేతిపంపు వద్ద శుభ్రం చేయండి

**దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** దండేపల్లి మండలం తాళ్లపేట పంచాయతీ పరిధిలోని కుంటల్‌గూడ కట్ట గిరిజన గ్రామంలో చేతి పంపు వద్ద మురుగునీరు నిలుస్తోంది. దీంతో మంచినీరు పట్టుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటోందని వారు వాపోతున్నారు. చేతి పంపు వద్ద శుభ్రం చేసి మురుగునీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రార్థన దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:** హైదరాబాద్‌లో ఈనెల 5న నిర్వహించే ప్రార్థన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని క్రైస్తవ సంఘం నాయకురాలు చల్లగుల్ల విజయశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రహదారులు, భవనాల విశ్రాంత గృహంలో సంబంధిత ప్రచారప్రతులను ఆవిష్కరించారు. లోక కళ్యాణం కోసం ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమానికి కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి క్రైస్తవులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు సామ్యూల్, రజినికుమార్, పద్మారావు, రవిజోసెఫ్, స్వామిదాస్, జాషువా, ప్రభుదాస్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళతో కొక్కిరాల సురేఖ తదితరులు

## పాతమంచిర్యాలలో గడప గడపకు కాంగ్రెస్

**ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే:** గడప గడపకు కాంగ్రెస్ అనే నినాదంతో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపట్టిన కార్యక్రమం కొనసాగుతోంది. ఆయన సతీమణి, కాంగ్రెస్ నాయకురాలు కొక్కిరాల సురేఖ పట్టణంలో పలు వార్డులను సందర్శిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా బుధవారం 26వ వార్డు పాతమంచిర్యాలలో పర్యటించి మహిళలతో మాట్లాడారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొల్లూరి భీమయ్య, పెంట రమేష్, రజిత, గడ్డం అశోక్, రాజయ్య, నర్సయ్య, గట్టెశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### తెరపై ఈనాడు

**మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:** వేంకటేశ్వర - హలో, ఏషియన్ శ్రీనివాస - ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయి), లక్ష్మి- ఒక్క క్షణం, మయూరి - టూ కంట్రీస్

## నేడు దండేపల్లి మండల సర్వసభ్య సమావేశం

**దండేపల్లి, న్యూస్‌టుడే:** దండేపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 4న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని సమస్యలపై సమావేశంలో చర్చిస్తామని చెప్పారు. సకాలంలో అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

# మంచిర్యాల




సావిత్రి బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు


నివాళులు అర్పిస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు


నివాళులు అర్పిస్తున్న సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాల విద్యార్థినులు

## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

**మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే:** నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల పట్టణంలో పలు విద్యార్థి, యువజన, విద్యాసంస్థల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్థానిక బెల్లంపల్లిచౌరస్తాలోని బీసీ భవనంలో, బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆచార్య జయశంకర్ స్టడీ సర్కిల్‌లో, శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో, సాంఘిక సంక్షేమ మహిళల డిగ్రీ గురుకుల కళాశాలలో సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు సావిత్రి బాయి పూలే ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు సల్మాన్, చంద్రమోహన్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, వైద్యుడు కుమారస్వామి, శ్రీనివాస్, రాజు, ప్రవీణ్‌కుమార్, శ్రీహర్ష డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్లె భూమేష్, ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, ఎస్సీ మహిళల డిగ్రీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న, అధ్యాపకులు నర్మద, సరిత, జ్యోత్స్నచంద్రదత్, దివ్యశ్రీ, మమత, తదితరులు పాల్గొన్నారు.

**లక్సెట్టిపేట:** సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి పూలే ఆదర్శ భావాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ అన్నారు. సావిత్రి బాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి ఎంపీడీవో వి.రాంప్రసాద్, ఎస్సై బి.సమ్మయ్య, ఎంఈవో కె.రవిందర్‌లు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జైభారత్ ఆధ్వర్యంలో బాలికోన్నత పాఠశాల, ఛత్రపతి సాహుమహారాజ్ సంపూర్ణ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ గురుకుల పేరెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో హెలెన్ డోరోతి, మైలారం శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రంజిత్ కుమార్, జైభారత్ అధ్యక్షుడు ఎం.ఎ.సలీం, గురుకుల పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగన్న, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని దండేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దండేపల్లి ఉన్నత, కస్తూర్బా పాఠశాలల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆమె జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. గ్రామాల్లో మహిళల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, మహిళల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాండు రంగప్ప, ఎస్ఓ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రెబ్బన్‌పల్లి(దండేపల్లి గ్రామీణం):** దండేపల్లి మండలం రెబ్బన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అర్చన మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే ఉపాధ్యాయురాలుగా విద్యార్థులకు, సంఘ సంస్కర్తగా సమాజానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మంచిర్యాల పట్టణం:** మంచిర్యాలలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను టీ-మాస్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆ సంఘం కన్వీనర్ ఆర్.రాజేశం మాట్లాడుతూ భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని, బహుజన ఉద్యమకారిగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని యువత సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీ-మాస్, ప్రజా సంఘాల నాయకులు సంకె రవి, బి.సత్యాజీ, బి.చందు, ఎం.రాందాస్, పాలితపు శంకరయ్య, కాశి సతీష్, గోమాస ప్రకాష్, మోహన్, అరిగెల మహేశ్, బియ్యల రాజేశ్వరి, నూరినేని కిషన్, పూదరి రాంచందర్, బెంజ్‌మెన్, మిడపెల్లి శంకర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రెబ్బన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో


మంచిర్యాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీ-మాస్ నాయకులు

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

### ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

**చెన్నూరు, న్యూస్‌టుడే:** చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని విద్యార్థులు చదువులకెంతటి ప్రాధాన్యమిస్తున్నారో క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సూచించారు. గురుకృప స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చెన్నూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ చేపట్టారు. 10, 12, 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పురాణం సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలు మానసికొల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాల్లో సైతం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో విద్యార్థులు పోటీల్లో రాణించి తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. క్రీడాకారులకు, క్రీడలకు పుట్టినిల్లుగా నిలిచి ఎందరో గొప్ప క్రీడాకారులను తయారు చేస్తున్న చెన్నూరులో మైదానం సక్రమంగా లేదని దీన్ని అభివృద్ధి చేసేందుకు మీవంతుగా కృషి చేయాలని గురుకృప స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రకాష్‌రావు, దాసరి మల్లేష్‌లు ఎమ్మెల్సీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. స్థానికంగా మినీ స్టేడియం నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. స్టేడియం నిర్మాణం పూర్తైతే క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. క్రీడా పోటీల నిర్వాహణకు అన్ని విధాలుగా సహకరించిన దాతలు పట్టణానికి చెందిన సేజ్ పాఠశాల నిర్వాహకులు పులి కిషోర్‌కుమార్, పులి చంద్రశేఖర్‌లను అతిథులు, పోటీల నిర్వాహకులు అభినందించారు. అంతకముందు క్రీడా పతాకాన్ని ఎగురవేసిన ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ స్థానిక సర్పంచి కృష్ణ, సేజ్ కిషోర్‌కుమార్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లతో కలిసి వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కారెంగుల రామయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యసురేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు రామారావు, రాంమోహన్, దాసరి మల్లేష్, పులి జయశ్రీ, అనిత, మనోహర్, పున్నం, శ్రీనివాస్, మారయ్య, లింగయ్య, సాగర్, గోపాల్, శ్రీనివాస్‌లతో పాటు రెండు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడా పతాకాన్ని ఊపి పరుగుపందెం పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సతీష్‌కుమార్, అతిథులు

## 5న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

**మంచిర్యాల క్రీడావిభాగం న్యూస్‌టుడే:** ఉమ్మడిజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న సీనియర్, జూనియర్ మహిళల విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఉదయం 9:30గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఈ చరవాణి(9849444744, 9494112288)ని సంప్రదించాలని కోరారు.

## గోదావరిలో.. స్మృతి క్షేత్రం

అది ఒకప్పుడు గలగల పారే గోదావరి. ఇప్పుడు చెత్త, పారిశుద్ధ్యంతో కళ తప్పింది. పట్టణంలో శ్మశానం లేకపోవటంతో స్థానికులు తమవారి అంత్యక్రియలు గోదావరిలోనే చేస్తుంటారు. వారి జ్ఞాపకార్థం కోసం అక్కడే సమాధులను నిర్మిస్తుంటారు. చుట్టు ముళ్లపొదలు, మున్సిపల్ డంపింగ్ యార్డు ద్వారా ఏర్పడిన చెత్త మధ్యలో తమవారి సమాధులు ఉండొద్దని కొందరు భావించారు. ఉన్నదాంట్లోనే కాస్త వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో సమాధి ఆవరణలో మొక్కలు నాటి అక్కడి పరిస్థితులను స్మృతి వనంలా మార్చారు. మంచిర్యాల పట్టణంలోని గోదావరిలో కొందరు పచ్చదనంతో ఏర్పాటుచేసిన సమాధులు నదిలో ప్రత్యేకతగా నిలిచాయి

- మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే


సమాధి చుట్టూ కొబ్బరిచెట్లను పెంచుతున్న దృశ్యం


సమాధి చుట్టూ పచ్చదనంతో నిర్మించిన సమాధి

## గొర్రెల పథకం లబ్ధిదారులు వెంటనే డీడీలు కట్టాలి

**చెన్నూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం అందజేస్తున్న గొర్రెల పంపిణీ పథకం కింద ఎంపికైన జిల్లాలోని లబ్ధిదారులంతా వెంటనే గొర్రెలను పొందేందుకు డీడీలు కట్టాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ కోరారు. బుధవారం స్థానికంగా యాదవ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెలు అనారోగ్యానికి గురైతే వెంటనే 1962 నెంబరుకు ఫోన్‌చేసి వెంటనే వైద్య సేవలు పొందాలని సూచించారు. పశువైద్యాధికారులు సైతం వెంటనే స్పందిస్తూ గొర్రెలకు సకాలంలో వైద్యం అందజేయాలన్నారు. ప్రభుత్వపరంగా జిల్లాలో ఇప్పటి వరకు 4,216 గొర్రెల యూనిట్లను అందించారని ఇంకా 1,017 యూనిట్లు లబ్ధిదారులకు అందించాల్సి ఉందన్నారు. గొల్లకురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సతీష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లికార్జున్‌యాదవ్, మండల అధ్యక్షుడు బాలేష్, నాయకులు మధు, రమేష్, నాగన్న, వెంకన్న, బాపు, మల్లన్న, పున్నం, రాజన్న, రాజు, భీమయ్య, మహేందర్, బాలు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా రెడ్‌క్రాస్ ఎన్నికలు

- **పోలింగ్ కేంద్రం వద్ద పోటాపోటీగా ప్రచారం**
- **పాత కొత్త కలయికతో పదిమంది సభ్యుల ఎన్నిక**
- **మూడు పదవులపై కుదరని ఏకాభ్రిపాయం**

**ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే**

ఐఆర్‌సీఎస్ చరిత్రలో తొలిసారిగా జరిగిన ప్రత్యక్ష ఎన్నికలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో రసవత్తరంగా సాగాయి. ఎన్నికల అధికారిగా డీసీఓ సంజీవ రెడ్డి వ్యవహరించిన ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచే ప్రారంభమైంది. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రం వద్ద అభ్యర్థులు తమ ప్రచారంతో హోరెత్తించారు. పోటాపోటీగా తమ గుర్తులను చూపిస్తూ ఓటు వేయాలని కోరారు. స్థానిక ఎన్నికలను తలపించేలా పోలింగ్ కేంద్రం వద్ద జనాలు గుమికూడారు. 3 గంటల వరకు ఓటింగ్ నిర్విరామంగా సాగింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు సంస్థ సభ్యులు బారులు తీరారు. ఎటువంటి ఓటింగ్ లేకుండా ఏకగ్రీవంగా కమిటీ నియామకం అవుతుందనుకున్న సమయంలో నామినేషన్ వేసిన సభ్యులు 21 మంది ఎన్నికలకే మొగ్గు చూపడంతో పోలింగ్ అనివార్యమైంది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు తమ స్థాయి మేరకు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. సంబంధిత సంస్థలో ఉన్న సభ్యుల సంఖ్య వివరాలను సేకరించి దూరప్రాంతంలో ఉన్నా కూడా ఓటు వేసేందుకు రప్పించినట్లు సమాచారం. కేంద్రం వద్ద అభ్యర్థుల హడావుడి చూసి అటువైపుగా వెళ్తున్న ప్రజలు పలువురు రెడ్‌క్రాస్ ఎన్నికలు ఇంత హంగామా ఉంటుందా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేయడం విశేషం.



పోలింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల ప్రచారం

### ఐదు పోలింగ్ కేంద్రాలు.. 20 మంది సిబ్బంది

రెడ్‌క్రాస్ ఎన్నికలకు మొత్తం డీసీఓతో కలిపి 20 మంది విధులు నిర్వర్తించారు. ఫంక్షన్ హాలులో ఐదు పోలింగ్ కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. సుమారు 3వేలకు పైగా ఉన్న సభ్యుల సంఖ్యలో దాదాపు 1026 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక్కొక్కరికి 10 ఓట్లు ఉండటంతో 10 మంది కమిటీ సభ్యులకు గాను ఒక్కో ఓటు వేసే అవకాశాన్ని ఇచ్చారు. కాగా చాలా వరకు అవగాహన లోపంతో రెండు మూడు ఓట్లను మాత్రమే వేశారు. కొంత మంది సభ్యులు వేలిముద్రలు బ్యాలెట్ పత్రానికి అంటడంతో ఓట్లు చెల్లకుండా పోయాయి.



ఓట్ల లెక్కింపు చేస్తున్న ఎన్నికల అధికారి, పాల్గొన్న అభ్యర్థులు

### భారీ మెజారిటీ సాధించిన చందూరి మహేందర్

ఈ ఎన్నికలో మొత్తం 21 మంది పోటీలో ఉన్నా పది మందికి మాత్రమే ఓట్లు పెద్ద మొత్తంలో పోల్ అయ్యాయి. ఇందులో పాత కమిటీ సభ్యులు ఐదుగురికి మెజార్టీ రాగా కొత్తగా పోటీ పడిన ఐదుగురికి అధికంగా ఓట్లు పడ్డాయి. పోలింగ్ పూర్తి అయిన అనంతరం మొత్తం ఐదు రౌండ్లుగా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. కౌంటింగ్‌లో ఆది నుంచి చందూరి మహేందర్ ఆధిపత్యాన్ని కొనసాగించారు. మొదటి రౌండ్ నుంచే ఆధిక్యాన్ని కొనసాగించారు. ఆయన సాధించిన ఓట్లకు దరిదాపులో కూడా ఏ ఒక్కరూ లేకపోవడం విశేషం. మహేందర్ 634 ఓట్లు సాధించి మొదటి స్థానంలో ఉండగా కంకణాల భాస్కర్ రెడ్డి(397) రెండు, పడాల రవి(369) మూడు, కాసర్ల శ్రీనివాస్(364)నాలుగో, వి.మధుసూదన్‌రెడ్డి(355) ఐదు, రాధాకృష్ణ(351) ఆరు, పీవీఎస్ఎన్ మూర్తి(325) ఏడు, కె.సత్యపాల్ రెడ్డి(305) ఎనిమిది, ఎడ్ల కిషన్(290) తొమ్మిది, నాగేందర్ రావు(279) పది స్థానాల్లో నిలిచారు. తొలిసారిగా బరిలో నిలిచిన సభ్యులు గట్టిపోటీ ఇచ్చారు.

★ నూతన కమిటీ సభ్యులుగా పది మందిని ప్రకటించిన డీసీఓ సంజీవరెడ్డి మూడు పదవులు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, కోశాధికారిలను ఏకగ్రీవం చేసుకునేందుకు సభ్యులకు అవకాశమిచ్చారు. సభ్యులందరూ దాదాపు అరగంట వరకు మంతనాలు జరిపినా ఫలితం తేలలేదు. 10 మందిలో నేనంటే నేను అనే ధోరణి కనిపించడంతో ఏ ఒక్క సభ్యుడు ఏకాభ్రిపాయానికి రాలేదు. చివరకు సభ్యులందరూ వాయిదాకి మొగ్గుచూపి కాస్త సమయం ఇవ్వాలని డీసీఓకు విన్నవించగా ఆయన అనుమతించారు. ఏకాభిప్రాయం కుదరకపోతే ముగ్గురు సభ్యులకు పాలనాధికారి ఆదేశాలు తీసుకుని రహస్య ఓటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

### విజేతల సంబరాలు

తొలిసారి నిర్వహించిన ఎన్నికలో ఘన విజయం సాధించిన సభ్యులకు వారివారి సహచరులు పూలమాలలతో సత్కరించారు. విజేతలకు అనుకూలంగా నినాదాలు చేస్తూ హాలును హోరెత్తించారు. మిఠాయిలు తినిపించి సంబరాలు చేసుకున్నారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

# యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- **విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్**
- **తెరాసలో చేరిన రాజన్నల సంఘం సభ్యులు**

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** ఏ ప్రభుత్వం చేయని విధంగా యాదవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వందల కోట్ల రూపాయలు కేటాయించారని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు కొనియాడారు. బుధవారం మందమర్రి పట్టణం రాజన్నవాడలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని యాదవ ఉపకులాల సభ్యులకు రాయితీ గొర్రెల యూనిట్లను అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజన్న సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సింగరేణి అధికారులతో చర్చించి రామన్‌కాలనీ ప్రాంతంలో కూరగాయలు, మాంసం మార్కెట్ ఏర్పాటు, కాలనీల్లో పూర్తిస్థాయిలో అంతర్గత రహదారుల నిర్మాణాలు, శ్మశానవాటిక ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ పురాణం సతీష్, జిల్లా ఇన్‌ఛార్జి, తెలంగాణ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం సమయంలో చెప్పిన మాట మేరకు కేసీఆర్ కులవృత్తుల అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. అనంతరం కాలనీకి చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తెరాసలో చేరారు. వారి మెడలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గొర్రె, మేకలను బహుమతిగా అందించారు. అంతకు ముందు రాజన్నల సంఘం సభ్యులు సంప్రదాయ నృత్యాలతో ప్రజాప్రతినిధులకు ఘనస్వాగతం పలికారు. తెరాస సీనియర్ నాయకుడు రవిందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లాల క్రాంతి, ఎస్.ప్రభాకర్, ఎండి అబ్బాస్, మేడిపల్లి సంపత్, నల్వాల సమ్మయ్య, బట్టు రాజ్‌కుమార్, పైడిమల్ల నర్సింగ్, మొగిలి కనుకయ్య, ఆవుల ఓదెలు, మేరుగు అంజయ్య, జక్కుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విప్ ఓదెలు, అరిగెలనాగేశ్వర్‌రావుకు గొర్రె, మేకలను అందజేస్తున్న సంఘం సభ్యులు



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## పాలనాధికారి కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

**మంచిర్యాల పట్టణం:** ఎస్సీ వర్గీకరణ చేయాలని, డప్పు, చెప్పు వృత్తిదారులు ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం పాలనాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కాశి సతీష్ మాట్లాడుతూ మాదిగల సంక్షేమం కోసం ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. కుల వృత్తిని నమ్ముకొని డప్పులు కొడుతూ, చెప్పులు కుడుతూ జీవనం సాగించేవారికి నెలకు రూ.2 వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోసం జిల్లా సంయుక్త పాలనాధికారి సురేందర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బెక్కం రాజారావు, కలాల రమేష్, దాసరి విజయ్‌సాగర్ చిట్యాల విక్రమ్, చిప్పకుర్తి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలి

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** ఈ నెల 5, 6న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే దళితమోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను విజయవంతం చేయాలని దళితమోర్చా రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణచారి పిలుపునిచ్చారు. బుధవారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ మోహన్, భాజపా పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెరాస ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించందన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తానని ప్రకటించిన కేసీఆర్ అనంతరం మాట మార్చారని విమర్శించారు. ప్రధానమంత్రి మోదీ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం దళితున్ని రాష్ట్రపతి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దండు రాజేందర్, జీవన్, పానుగంటి మధు, మేకల రమేష్, రామకృష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి తరానికి ఆదర్శం సావిత్రి బాయి పూలే

**మంచిర్యాలవిద్యావిభాగం, న్యూస్‌టుడే:** మహిళలకు చదువులు అవసరమని గుర్తించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచిన మహోన్నత మహిళ సావిత్రి బాయి పూలే అని జిల్లా విద్యాధికారి రవికాంత్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్), జాతీయ మహిళ ఉపాధ్యాయుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా డీఈఓతో పాటు సంఘాల నాయకులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమ నిర్వాహకులు జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాల ప్రత్యేకాధికారులను సన్మానించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి. శాంతి కుమారి, గోళ్ల రామన్న, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవికాంత్

# పెరిగిన జీతం.. పన్నుకు సరి..

**(మొదటిపేజీ తరువాయి)** రావడంతోపాటు, ఉద్యోగులకు చెల్లించే ఎల్‌పీజీ సొమ్ము, ఇతర అలవెన్సులు సైతం పన్ను పరిధిలో చేరుతున్నాయి. పది నుంచి 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికులు 20 శాతం పన్ను పరిధిలో ఉండగా, 20 నుంచి 30 ఏళ్ల మధ్య సర్వీసు పూర్తి చేసిన మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్‌మెన్‌తో పాటు అన్ని క్యాటగిరిల కార్మికులు 30 శాతం పన్ను పరిధిలో చేరారు. పదో వేతన ఒప్పందం మూలంగా 24 శాతం మేరకు జీతాలు పెరిగినా, సీనియర్ కార్మికులు 30 శాతం పన్ను పరిధిలో చేరడంతో వచ్చే సొమ్ము కన్నా ఆదాయపు పన్ను అధికం అవుతోందని వాపోతున్నారు. వేతన బకాయిల చెల్లింపు సందర్భంగానే యాజమాన్యం కార్మికుల నుంచి పెద్ద మొత్తం ఆదాయం పన్ను కోత విధించింది. అయినా నవంబరు, డిసెంబరు నెల వేతనాల్లో సగటున రూ. 10 వేల చొప్పున పన్ను చెల్లించాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. ఆదాయంలో సెక్షన్ 80సీ కింద చేసే పొదుపు కింద రూ. 1.5 లక్షల మేరకు పన్ను పోటు నుంచి మినహాయించారు. ఇది ఏ మూలకూ సరిపోవడంలేదు. సీఎంపీఎఫ్, కుటుంబ పింఛను, జీవిత బీమా తదితరాలన్నీ కలిపితే ఒక్కో ఉద్యోగికి సగటున దాదాపు రూ. రెండు లక్షల వరకు అవుతుంది. ప్రభుత్వం మాత్రం రూ. 1.5 లక్షలకే పొదుపును పరిమితం చేసింది. అదనంగా చేసే పొదుపుపై కూడా ఉద్యోగవర్గాలు పన్ను చెల్లించక తప్పని పరిస్థితి నెలకొంది.

## పన్ను పరిధి ఇలా ఉంది..

కేంద్ర ప్రభుత్వం రెండున్నర లక్షల రూపాయలలోపు ఆదాయం ఉన్నవారికి పన్ను నుంచి పూర్తి మినహాయింపునిచ్చింది. రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఆదాయం పొందితే ఐదు శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు రూ. 12,500+20 శాతం(మొత్తం ఆదాయం-5,00,000), రూ. పది లక్షలు దాటితే రూ. 1,12,500+30 శాతం (మొత్తం ఆదాయం-పది లక్షలు) చొప్పున చెల్లించాలి. ఇది కాకుండా అదనంగా విద్య పన్ను కింద రెండు శాతం, సెకండరీ, ఉన్నత విద్య పన్ను కింద మరో ఒక శాతం చొప్పున ఆదాయం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సింగరేణిలో ప్రస్తుతం 53వేల పైచిలుకు కార్మికులు పని చేస్తుండగా ఇందులో దాదాపు 25 వేల మంది 30 శాతం పన్ను పరిధిలో చేరారు. మరో 25 వేల మంది 20 శాతం పన్ను పరిధిలో చేరగా, కొత్తగా ఉద్యోగంలో చేరిన దాదాపు 3వేల మందికిపైగా ఉద్యోగులు మాత్రం ఐదు శాతం పన్ను పరిధిలో ఉంటారని అంచనా.

## అలవెన్సులను మినహాయించాలి

బొగ్గు గని కార్మికులు సైనికుల మాదిరిగా కష్టపడి పనిచేస్తున్నారని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కితాబునిచ్చిన విషయం తెలిసిందే. సాధారణ ఎన్నికలకు ముందు బొగ్గు గని కార్మికులను ఆదాయం పన్ను నుంచి మినహాయించేలా పార్లమెంటులో బిల్లు పెట్టిస్తామన్న నాయకులు, కాస్తో కూస్తో మాట్లాడి వదిలేస్తున్నారు. కోల్ ఇండియాలో పెర్కులపై చెల్లించే సొమ్మును లెక్కించి, దాదాపు అంతే మొత్తాన్ని అప్ కీప్ అలవెన్సు కింద చెల్లిస్తోంది. సింగరేణి కార్మికులకు కూడా ఇదే విధంగా అలవెన్సులపై పన్ను పోటు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఒక్కో కార్మికుడు సగటున రూ. 30 వేల వరకు లబ్ధి పొందే అవకాశం ఉందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు అభిప్రాయపడ్డారు. ఒక్కో కార్మికుడు పన్ను కింద రూ. 70 వేల నుంచి రూ. రెండు లక్షల వరకు చెల్లించడం వల్ల ఏడాదిలో పది నెలల వేతనమే పొందుతున్నారని, కేంద్రం రూ.పది లక్షల లోపు ఆదాయం ఉన్న వారిని పన్ను పరిధి నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా, పడిపోతున్న రూపాయి రేటును దృష్టిలో ఉంచుకుని పన్ను పరిధిని పెంచడం, పొదుపును రూ.1.5 లక్షల నుంచి రూ. 2.5 లక్షలకు పెంచాలని కోరారు.



# వ్యాపారులకు 'తెల్ల బంగారం'..!

**(మొదటిపేజీ తరువాయి)** వచ్చింది. మొదట్లో పత్తి ధర రూ.4,200 పలికింది. ఆదిలాబాద్, భైంసా పట్టణాల్లో కొనుగోళ్లు ప్రారంభించి రూ.4,100-4200 వరకు చెల్లించి వ్యాపారులు కొనుగోళ్లు జరిపారు. ఇది వరకే రైతులు పండించిన పంటను అమ్ముకున్నారు. రైతుల వద్ద పత్తి నిల్వలు నిండుకున్నాక ఇటీవల ధరలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం క్వింటా ధర రూ.5,200 వరకు పలుకుతోంది. పత్తి నాణ్యంగా ఉండటం విపణిలో క్యాండి ధర రూ.42 వేల వరకు పలుకుతుండటంతో పత్తికి డిమాండు ఏర్పడింది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

## వ్యాపారులకే తెల్లబంగారం'..!

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ధరల రూపంలో ఎప్పుడూ నష్టాలే మిగులుతున్నాయి. యాసంగి సాగు కోసం వ్యాపారుల వద్ద ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పొందేందుకు పంటను అమ్మక తప్పలేదు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు కుమ్మక్కయి ధరలను అదే స్థాయిలో కొనసాగించి కొనుగోలు చేపట్టి నిల్వ చేశారు. అంతర్జాతీయ విపణిలో ధరలు కలిసి వస్తుండటంతో వ్యాపారుల పంట పండుతోంది. పంట అమ్ముకున్న రైతు నష్టపోగా వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు లాభాలు గడించారు. గులాబి పురుగు సోకి దిగుబడులు తగ్గాయి. రైతులు పత్తి పంటను తొలగించడంతో విపణికి పత్తి ఉత్పత్తులు వచ్చే వీలు లేకపోవడంతో ధరలు మరింత పెరగనున్నాయి.

### కొనుగోళ్ల తీరు జిల్లాల వారీగా..!

● ఆదిలాబాద్ విపణిలో 23 లక్షల క్వింటాళ్ల పత్తి లక్ష్యం కాగా 14 లక్షల క్వింటాళ్లు, నిర్మల్ జిల్లాలో 12 లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా 3.10 లక్షల క్వింటాళ్లు, కుమురంభీం జిల్లాలో 5 లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా 1.65 లక్షల క్వింటాళ్లు, మంచిర్యాల జిల్లాలో రెండు లక్షల క్వింటాళ్ల లక్ష్యం కాగా 1.10 లక్షల క్వింటాళ్లు మాత్రమే కొనుగోళ్లు జరిపారు.

## కనికరించని ప్రకృతి..!

ఖరీఫ్ మొదట్లో ఆశాజనకంగా ఉన్న పత్తి పంటలు సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కలుపు మొక్కలు పెరిగిపోయాయి. మొదట్లో అతి కష్టం మీద కలుపు తీయించినా భారీ వర్షాలు, వరదలకు రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దీంతో నామమాత్రంగా ఎకరానికి ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. మొదట్లో రైతులంతా తాము పండించిన పత్తిని రూ.4,100-4200 ధరలకు అమ్ముకున్నారు. ఇప్పుడు రూ.5200 పైగా పెరగడంతో ఒక్కో రైతు ఎకరానికి రూ.5000-6000 మేర నష్టపోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా దక్కలేదు. విపణిలో పత్తికి మద్దతు ధర రూ. 4150 ఉండగా ప్రస్తుతం రూ.5200 వరకు ధరలు లభిస్తున్నాయి. క్వింటా రూ.1100 మేర అధికంగా ఉంది.



పత్తి పంటను తొలగిస్తున్న రైతు రాజారం బక్కన్న మండల కేంద్రం కుంటాల. రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి వేశాడు. ఇందుకు గాను రూ.40 వేలు వెచ్చించాడు. తీరా దిగుబడులు తగ్గి గులాబి తెగుళ్లు సోకడంతో పూర్తిగా నష్టపోయాడు. చేసేదేమి లేక పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు నేలను సాగుకు సన్నద్ధం చేసుకుంటున్నాడు. పత్తి సాగు చేసిన రైతులకు ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి.

# పశువైద్యం.. కడు దైన్యం..

**(మొదటిపేజీ తరువాయి)** ఇరుకుగా ఉండటం...శిథిలావస్థలో చేరడంతో సరైన వైద్యం అందడం లేదు. మందులను రిఫ్రిజిరేటర్లలోనే నిల్వ చేయాల్సి ఉన్నందున వర్షాలకు ఊరుస్తుండటంతో వాటిని నిల్వ చేయలేకపోతున్నారు. దీంతో పాటు పశువులకు అవసరమైన గడ్డి విత్తనాలు, దాణా నిల్వ ఉంచడం లేదు.



ఇది వేమనపల్లిలోని పశువుల ఆసుపత్రి. సొంత భవనం లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న ఒక పాత పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు. భవనం పూర్తి శిథిలావస్థకు చేరడంతో ఇందులో విధులు నిర్వర్తించాలన్నా...రైతులు పశువులను చికిత్సకు ఆసుపత్రికి తీసుకురావాలన్నా జంకుతున్నారు.



ఇది దండేపల్లి మండలం రెబ్బనపల్లి పశువైద్యశాల. రెండు దశాబ్దాల కిందట పెంకులతో నిర్మించిన భవనం ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భవనం పైపెంకులు పోయాయి. తలుపులు, కిటికీలు ధ్వంసం కావడంతో మందులు నిల్వ ఉంచడం లేదు.

## ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం

**డా. ఎల్లన్న జిల్లా పశువైద్యాధికారి మంచిర్యాల**

పశువైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల విషయం ఎన్నోసార్లు ఇప్పటికే అధికారులకు నివేదికలు పంపాం. ఖాళీగా ఉన్న పోస్టుల్లో దగ్గరగా ఉన్న సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించి వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. శిథిలావస్థలో వైద్యశాలలు ఉన్నచోట నూతన భవన నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేశాం. ఇప్పటికే 9 చోట్ల నూతన భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో పశువైద్యం అందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

### జిల్లాలో పశువులు ఇలా..

| పశువులు | సంఖ్య |
|---|---|
| ఆవులు, ఎద్దులు | 2,08,011 |
| గేదెలు | 1,07,987 |
| గొర్రెలు | 2,91,615 |
| మేకలు | 1,42,447 |
| కోళ్లు | 3,96,856 |
| ఇతర జంతువులు | 2,753 |
| ఇటీవల పంపిణీ చేసిన గొర్రెలు | 85,575 |

మూసి ఉన్న ఈభవనం దండేపల్లి మండలం ద్వారక పశువైద్యశాల. ఇక్కడ వైద్యాధికారి, అటెండర్ పోస్టులున్నాయి. వైద్యాధికారి కరీంనగర్ జిల్లాకు డిప్యుటేషన్‌పై వెళ్లగా అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. తాత్కాలికంగా తాళ్లపేట అటెండర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనితో ఈవైద్యశాల మూసి ఉంటుంది. 10 గ్రామాలకు కేంద్రంగా ఉన్న ఇక్కడ పశువులకు వైద్యం దయనీయంగా మారింది.





ఈ భవనం కోటపల్లిలోని పశువైద్యశాల. మండలంలోని 21 గ్రామాలకు ఇదొక్కటే దిక్కు. మండలం అంతటికి కలిపి ఒకే చిన్న రేకుల షెడ్డులో ఆసుపత్రి కొనసాగుతోందంటే గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు వైద్యం ఎలా అందుతుందో అర్థమవుతోంది. మండలంలోని దేవులవాడ, సిర్సా, జనగాం గ్రామాల్లో పశువైద్యశాలలు ఏర్పాటు చేయాలని రెండేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా ఇంతవరకు ఆసుపత్రులు మంజూరు కాలేదు.

# ఊరికి ఉపకారం



- ప్రజాహితం వారి అభిమతం
- పాఠశాలలకు భూమి విరాళం
- ఆదర్శంగా నిలుస్తున్న పల్లెవాసులు

వాంకిడి, న్యూస్‌టుడే

**భూముల వాటా కోసం సొంత అన్నదమ్ములు, బంధువుల మధ్య తగాదాలు జరగడం చూస్తున్నాం. ఒక్కోసారి విభేదాలు పెరిగిపోయి హత్యలకు దారి తీసిన సందర్భాలున్నాయి. స్వార్థ ప్రయోజనాలు వీడి ప్రజల అవసరాల కోసం భూ దానం చేసేవారు అరుదు. వాంకిడి మండలంలోని పలువురు తమకున్న భూముల్లో కొంత పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, చౌక ధరల దుకాణాల కోసం ఇతర సామాజిక అవసరాల కోసం భూ దానం చేశారు. ఊరి కోసం, ప్రజల అవసరాల కోసం భూదానం చేసి తమ ఉదారతను చాటుకుంటున్న వారిపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనం.**



వాంకిడి ఉన్నత పాఠశాల కోసం జయరాం విరాళంగా అందజేసిన విలువైన మూడెకరాల స్థలం ఇదే



ఉప్రె జయరాం

## పిల్లల చదువుల కోసం..

వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఉప్రె జయరాం 1978లో ఉన్నత పాఠశాల కోసం తనకున్న భూమిలో మూడెకరాల స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఆ సమయంలో పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థలాన్ని ఇవ్వడానికి ఎవరు ముందుకు రాలేదు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు శివానందం ఈ విషయాన్ని జయరాం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాఠశాలకు స్థలాన్నిస్తే భవిష్యత్తులో అందరికి ఉపయోగపడుతుందని భావించి భూమిని విరాళంగా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 620 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జీవితంలో పలువురికి ఉపయోగపడే పని చేయాలన్నది నా కోరిక. నేనిచ్చిన భూమిలో ఏర్పాటు చేసిన పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటూ ఉన్నత స్థానాలకు వెళుతుండడం తృప్తినిస్తోందని జయరాం ఆనందం వ్యక్తం చేశారు.



సవ్వాతిలో పాఠశాల, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలకు ధానం చేసిన భూమి



సోయం భీంరావు

## ఎకరం భూమి ఇచ్చారు

వాంకిడి మండలంలోని సవ్వాతి గ్రామానికి చెందిన సోయం జంగు గ్రామంలో పాఠశాల భవన నిర్మాణం కోసం ఎకరం భూమిని అందించారు. పాఠశాల నిర్మాణానికి పోను మిగతా స్థలంలో గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం భవనాలు నిర్మించారు. దీంతో గ్రామస్థులకు ఉపయోగకరంగా మారింది. పిల్లలకు చదువులు, గ్రామస్థులకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో మా తండ్రి సోయం జంగు భూమిని విరాళంగా అందించారని ఆయన కుమారుడు సోయం భీంరావు వివరించారు.



గోయగాంలో డీఆర్‌డిపో దుకాణం కోసం ధానం చేసిన స్థలం



దుర్వ ముకుంద్‌రావు

## చౌక ధరల దుకాణం, పాఠశాల కోసం..

వాంకిడి మండలంలోని గోయగాంకు చెందిన దుర్వ ముకుంద్‌రావు గ్రామంలో చౌకధరల దుకాణం, ఐటీడీఏ పాఠశాల నిర్మాణం కోసం భూమిని విరాళంగా అందజేశారు. దీంతో పాటు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు అదనపు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కాగా స్థలం లేక నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఏర్పడడంతో ముకుంద్‌రావును సంప్రదించారు. దీంతో మరోసారి పాఠశాల భవన నిర్మాణానికి స్థలాన్ని అందించి ఉదారతను చాటుకున్నారు. ఊరు అభివృద్ధి చెందితే అందరూ బాగు పడే అవకాశం ఉంది. ఊరి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ముకుంద్‌రావు పేర్కొంటున్నారు.

## ఆసుపత్రి నిర్మాణానికి

మండల కేంద్రంలోని ఆసుపత్రిని 30 ఏళ్ల కిందట నిర్మించారు. ఆసుపత్రి నిర్మించక ముందు మండలం వాసులు వైద్య సేవల కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరు కావటంతో భూమి కోసం వెతుకున్న తరుణంలో మండలంలోని గోండ్‌కోసార గ్రామానికి చెందిన దివంగత కొట్నాక బాజీరావు భూమిని విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వాంకిడిలో అయిదెకరాల భూమిని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఆ స్థలంలో 30 పడకల ఆసుపత్రిని నిర్మించారు.



వాంకిడిలో ప్రభుత్వ ఆసుపత్రి ఇదే



రాష్ట్రస్థాయిలో సాధించిన పతకాలతో ఆనందరావు, శకుంతల

# క్రీడా కుటుంబం



- పరుగులో చిరుత ఆనందరావు
- ఆయన అడుగుజాడల్లో పతకాలు సాధిస్తున్న భార్య, కూతుళ్లు
- రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మెరిసిన దంపతులు

**ఎవరి అభీష్టాలు వారికుంటాయి.. కుటుంబంలోని అందరూ ఒకే రంగాన్ని ఎంచుకొని రాణించే దృష్టాంతాలు తక్కువగా ఉంటాయి. ఓ కుటుంబంలోని అందరూ క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగడం అంటే పట్టణాలు, నగరాల్లో క్రీడల్లో పేరొందిన కుటుంబాలకే పరిమితంగా ఉంటుంది. మరి ఓ కుగ్రామంలోని బీద కుటుంబంలో తలిదండ్రులు, ఇద్దరు కూతుళ్లూ అథ్లెటిక్స్‌లో పతకాల పంట పండించడం అరుదైన విషయంగా చెప్పవచ్చు. ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడకు చెందిన ఆటో డ్రైవర్ వైరాగడే ఆనందరావు కుటుంబం అథ్లెటిక్స్‌లో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. వీరి ఆదర్శంపై 'న్యూస్‌టుడే' స్ఫూర్తిదాయక కథనం.**

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే

మండలంలోని బూరుగూడకు చెందిన వైరాగడే ఆనందరావు, శకుంతల దంపతులకు నలుగురు కూతుళ్లు. పెద్ద కూతుళ్లిద్దరికి పెళ్లిళ్లయ్యాయి. కడుబీద స్థితిలో ఉన్న ఈ కుటుంబ పోషణ కోసం ఆనందరావు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. యాభై ఏళ్ల వయసు సమీపిస్తున్న మలివయసులోనూ ఆనందరావులో క్రీడా స్ఫూర్తి తొణికిసలాడుతోంది. పదో తరగతి వరకు చదువుకున్న ఆనందరావు ఉపాధి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. తన క్రీడా స్ఫూర్తిని భార్య శకుంతల, కూతుళ్లు హేమలత, దీప్తిలకు అందించాడు. వారు కూడా ఆనందరావు బాటలో నడుస్తూ అథ్లెటిక్స్‌లో అదరగొడుతున్నారు. క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

### పరుగు పెడితే పతకమే..

వెటరన్ క్రీడాకారుడైన ఆనందరావు పతకాల పట్టికలో తాజాగా మరో మూడు పతకాలు చేరాయి. డిసెంబరు 29 నుంచి 31 వరకు బెల్లంపల్లిలో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ తెలంగాణ 5వ రాష్ట్రస్థాయి పోటీల్లో 10 కి.మీ. పరుగు, 1500 మీ. పరుగు, 800 మీ. పరుగులో తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించారు. పాల్గొన్న మూడింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు.



ఆటో నడిపిస్తూ..ఆనందరావు

మార్చి 23 నుంచి 27 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన 38వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆనందరావు రజత పతకం సాధించారు. ఈ పోటీల్లో 5 కి.మీ. రేస్ వాక్‌లో గమ్యాన్ని 30.13 నిమిషాల్లో చేరి ద్వితీయ స్థానంలో నిలిచారు. వెటరన్ క్రీడాకారుడిగా ఆనందరావు పరుగు, నడక పందేల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అప్పటికే రెండు బంగారు పతకాలు, ఐదు వెండి పతకాలను సాధించి ఈ ప్రాంతంలోని క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారు. తన గ్రామంలోని కాలువ గట్టే రన్నింగ్ ట్రాక్‌గా నిత్యం ఉదయం, సాయంత్రం 20 కి.మీ. నడక, పరుగు సాధన చేస్తున్నారు. తినడానికి బలమైన తిండిలేక పోయినప్పటికీ ఆత్మస్థైర్యంతో నెగ్గుతున్నానన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతానంటున్నారు. తనతో పాటు తన భార్య, కూతుళ్లను అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయికి సిద్ధం చేసిన ఆనందరావును తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం క్రీడా పురస్కారాన్ని అందజేసి సత్కరించింది. జిల్లా ఎస్పీ, క్రీడాకారులు, తోటి ఆటో డ్రైవర్లు ఆనందరావును పలు సందర్భాల్లో ఘనంగా సత్కరించారు.

### భర్త అడుగుజాడలో శకుంతల

భర్త ఆనందరావు కుటుంబ బాధ్యతల్లో పాలు పంచుకుంటున్న ఆయన అర్ధాంగి శకుంతల క్రీడల్లోనూ భర్త అడుగుజాడల్లో నడుస్తున్నారు. భర్త ఆటో డ్రైవర్‌గా వెళ్తే కూతుళ్ల చదువు, పోషణ భారం మోసేందుకు కూలి పనులకు వెళ్తూనే నడక, పరుగులో సాధన చేస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. భర్త ఆనందరావు రాష్ట్ర, జాతీయస్థాయి పరుగు పందేల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లినపుడు వెంట వెళ్లి ఆయన్ని ప్రోత్సహించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఆమె ఈ పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. డిసెంబరు చివర్లో బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌సిఫ్ పోటీల్లో పాల్గొనేందుకు భర్తతో పాటు వెళ్లారు. 40 ఏళ్ల పైబడిని వారితో పోటీపడి 5 కి.మీ. రేస్ వాక్‌లో, 200మీ.ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచారు. 400×100మీ.రిలే పరుగులో ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో మూడు రాష్ట్రస్థాయి పతకాలతో ఈ ప్రాంత క్రీడాభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తారు.



### కుస్తీలో హేమలత

ఆనందరావు కూతురు హేమలత ఇప్పుడు ఎమ్మెస్సీ చదువుతున్నారు. చిన్ననాటి నుంచి తండ్రి క్రీడా కౌశలాన్ని చూసి స్ఫూర్తి పొందారు. పాఠశాల, కళాశాల చదువుల సందర్భంగా యువతులు అరుదుగా రాణించే రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో పట్టు సాధించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొని పతకాలు సాధించి తండ్రితగ్గ తనయగా నిలిచారు.



### కరాటే, డిస్కస్‌త్రో, హ్యాండ్‌బాల్ క్రీడల్లో మెరిసిన దీప్తి

ఆనందారావు చిన్నకూతురు దీప్తి తండ్రి నుంచి క్రీడా స్ఫూర్తిని అందుకొని పలు క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. మందమర్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాన్ని సాధించారు. హ్యాండ్ బాల్ పోటీల్లో వరుసగా రెండేళ్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. డిస్కస్‌త్రో అథ్లెటిక్స్ లోనూ జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానం పొందారు. జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగేందుకు పట్టుదలతో ఉన్నానన్నారు. ప్రస్తుతం బీఎస్సీ చదువుతున్నారు.

# నాట్య మయూరం

- వేదిక ఏదైనా ప్రదర్శన అద్భుతం
- బుల్లితెర 'ఆట'లో ద్వితీయస్థానం
- నాట్యం, నటనలో దీక్ష ప్రతిభ

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే



**అభిరుచి, పట్టుదల, అలుపెరుగని సాధనతో తను ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నిరూపిస్తోంది ఈ బాలిక. తలిదండ్రుల ప్రోత్సాహంతో శాస్త్రీయ నృత్యంపై మక్కువ పెంచుకొని చిన్నతనంలోనే గొప్ప కళాకారిణిగా పేరు సంపాదించింది. బుల్లితెర రియాలిటీ షో ఆట 6లో అద్భుత నాట్యప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచింది. సినిమాల్లో అవకాశాలను అందుకొంది. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో స్వాగత నృత్యం చేసి కలెక్టర్ ప్రశంసలందుకున్న దీక్ష అసావా ప్రతిభపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.**

జూన్ రెండో తేదీన ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో 'ఏకదంతాయ వక్రతుండాయ' అంటూ శాస్త్రీయ స్వాగత నృత్యం చేసి అందరి దృష్టిని ఆకర్షించిన దీక్ష అసావ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వ్యాపారి కిషన్‌గోపాల్, పూనంల కూతురు. నాలుగో యేటనే చిన్నారికి నృత్యంపై ఆసక్తి ఉన్నట్లు గమనించిన తలిదండ్రులు స్థానిక శ్రీనర్తనం నృత్యాలయ ఆచార్యులు బిట్ల వెంకటస్వామి వద్ద శిక్షణ కోసం చేర్పించారు. అక్కడ మొదలైన దీక్ష నృత్య సాధన ఇప్పటికీ కొనసాగుతోంది. చదువుకొనే పాఠశాల, పట్టణంలోని ఉత్సవాల వేదికలపైన ప్రదర్శనలిస్తూ టీవీ, సినిమాల వరకు ఎదిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న దీక్ష భరత నాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద, పాశ్చాత్య నృత్యాల్లోనూ ఆరితేరింది. వేదిక ఏదైనా నృత్యంలో తన ముద్రవేసి ప్రశంసలందుకొంటోంది.



హైదరాబాద్‌లో జరిగిన పోటీలో దీక్ష నృత్యం

### బుల్లితెరపై...

అయిదేళ్ల క్రితం మందమర్రిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో బుల్లితెర ఆట ప్రదర్శన కోసం దీక్ష ఎంపికైంది. ఈ ఆట 6లో తన అసాధారణ ప్రతిభతో డ్యాన్స్ మాస్టర్లను ముగ్ధుల్ని చేసింది. తుది పోటీలో రెండో స్థానంలో నిలిచిందని దీక్ష గురువు బిట్ల వెంకటస్వామి తెలిపారు. చిన్నతనం నుంచే నాట్యంలో ఆకట్టుకున్న దీక్ష అన్ని స్థాయిల్లోనూ. అన్ని వేదికల్లోనూ ఆకట్టుకుంటోందని తెలిపారు.

### సినిమాల్లో...

నాట్యంలో ప్రతిభ కనబరుస్తున్న దీక్ష ఓంకార్ దర్శకత్వంలో నిర్మించిన జీనియస్ సినిమాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకుందని, విడుదల కావాల్సి మరో సినిమాలోనూ నటించిందని దీక్ష కుటుంబీకుల తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆవిర్భావ వేడుకల్లో దీక్ష స్వాగత నృత్యం చూసిన కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించి ప్రశంసించడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# ఆకలి తీర్చి.. ఆప్తులయ్యారు

- నిర్మల్ ప్రభుత్వ మాతా, శిశు సంక్షేమ ఆసుపత్రిలో నిర్వహణ
- నిత్యం రోగుల బంధువులకు అన్నదానం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే

**ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చేది సర్వసాధారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. అలాంటి వారి ఆకలిని తీర్చేందుకు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు వారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిర్మల్ ప్రభుత్వ మాతా, శిశు సంక్షేమ ఆసుపత్రికి వచ్చే రోగుల బంధువులు, సహాయకులకు శ్రీ సత్యసాయి నిత్యాన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేస్తూ తమవంతు సేవా దృక్పథాన్ని చాటుకుంటున్న నేపథ్యంపై 'న్యూస్‌టుడే' కథనం.**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా, శిశు సంక్షేమ ఆసుపత్రికి జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల నుంచి ప్రసూతి కోసం వస్తుంటారు. ఆసుపత్రిలో ప్రతినిత్యం సరాసరిగా పదికి పైగా ప్రసవాలు జరుగుతాయి. కొన్ని సమయాల్లో సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. రోగులు దాదాపు వారం రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి ఉంటుంది. అయితే సదరు రోగికి ఆసుపత్రి వారే అవసరమైన ఆహారం, పాలు వంటి వాటిని అందజేస్తారు. అయితే రోగితో పాటు ఉండే బంధువులు, సహాయకులు బయటి నుంచి ఆహారం తెచ్చుకోవడమో లేదా అక్కడే వంట చేసుకోవడమో వంటివి చేసుకునేవారు. ఆసుపత్రికి వచ్చే వారు పేద, మధ్య తరగతి వారే కావడంతో రోజుల తరబడి భోజనానికి పెద్ద మొత్తంలోనే ఖర్చు అయ్యేది. దీనిని గమనించిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు వారు నిత్యన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వారి ఆకలిని తీరుస్తున్నారు. ప్రతి నిత్యం ఉదయం 9.30 గంటలకు ఆసుపత్రిలో ఉన్న రోగుల వద్దకు వెళ్లి అక్కడ వారికి సేవలు చేసే సహాయకులు, బంధువులను గుర్తించి ఇద్దరేసి చొప్పున టోకెన్లను అందజేస్తారు. అనంతరం వారి సంఖ్యను బట్టి అవసరమైన ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారు.

### నిత్యం వందకు పైనే...

ప్రతి రోజు వంద నుంచి 150 మందికి సదరు ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యాన్నదానాన్ని అందజేస్తున్నారు. భోజనం విషయంలో ఎలాంటి వెనుకడుగు వేయకుండా ఇంటి వద్ద చేసే భోజనాన్ని మైమరిపించేలా సదరు ట్రస్టు వారు వండుతున్నారు. నాణ్యమైన బియ్యం వండుతున్నారు. ఒక కూర, చట్నీ, సాంబారు, మజ్జిగ, అన్నం అందజేస్తున్నారు. మధ్యాహ్నం భగవాన్ శ్రీ సత్యసాయిబాబాకు హారతి అనంతరం 12 గంటల నుంచి ప్రతినిత్యం భోజనం అందజేస్తున్నారు. సదరు బంధువులు, సహాయకులకు చాలినంత వడ్డిస్తారు. అలాగే భోజనం పరబ్రహ్మ స్వరూపమని దానిని వృథా చేయకూడదని వారు బోధిస్తుంటారు. ప్రతినిత్యం ఆరుగురు శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యుల బృందం వచ్చి భోజనాన్ని వడ్డిస్తారు. అలాగే వంట చేసేందుకు ఇద్దరు మహిళలను ప్రత్యేకంగా నియమించారు.





దాతల వివరాల కోసం ఏర్పాటు చేసిన బోర్డు

### మూడు చోట్ల...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు చోట్ల భగవాన్ శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆయా ఆసుపత్రుల్లో నిత్యన్నదాన కార్యక్రమం జరుగుతోంది. ఆదిలాబాద్‌లో 2012, మంచిర్యాలలో 2016లో ప్రారంభం కాగా, నిర్మల్ జిల్లా కేంద్రంలో 2017 అక్టోబరు 20న ప్రారంభించారు. దాతల సహాయ సహకారాలతో పాటు ట్రస్టు సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాలు, తదితర కార్యక్రమాల సమయంలో దాతలు ముందుకు వచ్చి అన్నదానం చేస్తున్నారు. ఒకవేళ దాతలు లేని సమయంలో సదరు ట్రస్టు వారే అన్నదానం చేపడుతూ ఆకలి తీరుస్తూ తమదైన ముద్రను వేసుకుంటున్నారు.



భోజనం వడ్డిస్తున్న సభ్యులు

### నిత్యం ఆరుగురు సభ్యులం సేవలందిస్తాం



**- కమల, శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యురాలు, నిర్మల్**

ఆరుగురు సేవాదళ్ సభ్యులతో ఒక బృందం ఏర్పాటు చేశాం. ప్రతి రోజు ఒక బృందం వచ్చి ఇక్కడ సేవలు చేస్తాం. రోగుల బంధువులు, సహాయకులకు ఎంత కావాలంటే అంత భోజనాన్ని అందజేస్తాం. ఇలాంటి సేవా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం చాలా ఆనందదాయకం.

### భోజనం చాలా బాగుంది



**- గంగవ్వ, రోగి బంధువు, బంగల్‌పేట్**

మాది నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్. నా కోడలు ప్రసవానికి ఆరు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చాం. నేను వచ్చినప్పటి నుంచి నిత్యం మధ్యాహ్నం ఇక్కడే భోజనం చేస్తున్నాను. అన్నంతో పాటు కూర, సాంబారు, చట్నీ, మజ్జిగ ఇస్తున్నారు. ఇంటి భోజనాన్ని మైమరిపించేలా చాలా బాగుంది.

### నాణ్యత విషయంలో రాజీపడం



**- బి.భీమ్‌సేన్, శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు అధ్యక్షులు, నిర్మల్**

అందజేసే భోజనం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఇంటిని మైమరిపించేలా అందజేస్తున్నాం. ఆసుపత్రికి వచ్చేవారు పేద, మధ్య తరగతి వారే. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని వారి ఇబ్బందులను దూరం చేయాలన్న లక్ష్యంతో ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యన్నదానం చేపడుతున్నాం. దాతలు లేని సమయంలో ట్రస్టు ఆధ్వర్యంలోనే భోజనం అందజేస్తున్నాం. దాతలు తమవంతు సహాయ సహకారాలు అందించి పేదల ఆకలిని తీర్చాలి.

# సేవతో చేరువై

- సామాజిక చైతన్యం ఆయన లక్ష్యం..
- పలు గ్రామాలకు రహదారి, తాగునీటి సౌకర్యం..
- ఆదర్శంగా నిలుస్తున్న దహెగాం ఎస్‌ఐ రమేష్

దహెగాం, న్యూస్‌టుడే

**చట్టా వ్యతిరేక పనులపై ఉక్కుపాదం మోపడంలో ఆ యువ ఎస్‌ఐ దిట్ట. ప్రజలతో మమేకమవుతూ వారు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణమే స్పందించి సామాజిక సేవ దృక్పథంగా పనులు చేయడం ఆయన నైజం. కొత్తపాత తేడా లేకుండా ప్రజల్లో కలిసిపోవడం ఆయన ప్రత్యేకత. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకొని పోలీసులంటే భయాన్ని తొలగిస్తున్నారు. అంతే కాదు రక్షక భట నిలయాన్ని ఉద్యాన వనంలా తీర్చిదిద్దారు. దహెగాం ఎస్‌ఐ దీకొండ రమేష్ సామాజిక సేవలపై 'న్యూస్‌టుడే' అందిస్తున్న కథనం.**

జిల్లాలోనే అతిమారుమూల మండలం దహెగాం. ఏ శాఖలోనైనా ఈ మండలంలో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు కొంత వెనుకముందు ఆలోచిస్తారు. అదే పోలీసు ఉద్యోగం విషయంలో మరింత సమస్యగానే ఉంటుంది. ఇలాంటి మండలంలో అక్టోబర్, 2015లో దీకొండ రమేష్ దహెగాం ఎస్‌ఐగా విధుల్లో చేరారు. మండలంలోని గ్రామాలపై అవగాహన పెంచుకోవడం, ఆయా గ్రామాల్లో జరిగే చట్టా వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి సారించారు. అక్రమ వ్యవహారాలపై ఉక్కుపాదం మోపారు. మరో వైపు గ్రామీణుల్లో కలిసి పోయేందుకు పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో గుర్తింపు సాధించారు. పేకాట, గుడుంబా, కోడి పందేల అడ్డాలపై దాడులు నిర్వహించి ఎన్నడూ లేని విధంగా కేసులు నమోదు చేశారు. ఒకే ఏడాదిలో రెండు సార్లు ఎస్పీ చేతుల మీదుగా పురస్కారాలు పొందిన ఘనత ఆయనకు దక్కింది. అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. తాగు నీటికి ఇబ్బందులున్నాయని తెలపగానే శంకరాపురం గ్రామస్థులకు చేతిపంపు వేయించారు. లోహ గ్రామస్థులకు బోరు, విద్యుత్తు మోటారు, మినీ మంచి నీటి ట్యాంకు నిర్మించి డీఎస్పీ సాంబయ్య చేతుల మీదుగా ఇటీవల ప్రారంభించారు.

### సామాజిక కార్యక్రమాల్లో ముందు...

- నాటుసారా తయారీదారులతో అప్పటి జిల్లా పాలనాధికారి చంపాలాల్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌లను ముఖ్య అతిథులుగా అవగాహన సదస్సు నిర్వహించారు.
- దిగిడ గ్రామంలో అంతర్గత రోడ్డు నిర్మాణాలు చేపట్టారు.
- శంకరపురంలో తాగునీటి కోసం చేతిపంపు వేయించారు.
- కొంచవెల్లి నుంచి చింతపురి ఎర్రవాగు వరకు మొరం రోడ్డు వేయించారు.
- కొంచవెల్లి గ్రామానికి చెందిన కె.పోశక్క అనే నిండు గర్భిణి రక్తస్రావంతో బాధపడుతుండగా సకాలంలో స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రక్తదానం చేయించి ప్రాణాలు కాపాడారు.
- పలు గ్రామాల్లో బడి మానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించారు.
- శంకరాపురం గ్రామంలో తాగు నీటి కోసం ప్రజలకు చేతిపంపు ఏర్పాటు చేశారు.
- దహెగాం పోలీస్‌స్టేషన్‌లో ఉద్యానవనంలా తలపిస్తున్న వివిధ రకాల మొక్కలను పెంచారు.
- దహెగాం పోలీస్‌స్టేషన్ పరిధిలో మెగా రక్తదాన శిబిరాలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు.
- రాంపూర్ గ్రామానికి చెందిన అంజలి అనే విద్యార్థినికి శస్త్ర చికిత్స నిర్వహించి ఆమెకు ప్రాణదాత అయ్యారు.
- బీబ్రా గ్రామంలో హరితహారంలో భాగంగా ప్రభుత్వ భూమిలో మొక్కలను నాటారు.
- లోహ గ్రామానికి 4 కిలోమీటర్ల, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి కోసం బోరు, విద్యుత్తు మోటారు, రక్షిత మంచి నీటి మినీ పథకం ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించారు.
- లోహ గ్రామంలో మెడిలైఫ్ ఆసుపత్రి వారి సహకారంతో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు.



రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ దీకొండ రమేష్ (దాచిన చిత్రం)



జిల్లా ఎస్పీ విక్రమ్‌జిత్ దుగ్గల్ చేతుల మీదుగా పురస్కారం..

### సామాజిక సేవతోనే సంతృప్తి



**- దీకొండ రమేష్, ఎస్‌ఐ దహెగాం**

సామాజిక సేవలతోనే ఎంతో సంతృప్తి ఉంటుంది. అధికారుల ప్రోత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చిన తనకు తోచిన విధంగా సహాయ సహకారాలందిస్తాను. నేరుగా తనను సంప్రదిస్తే అధికారుల సహాయ సహకారాలు తీసుకొని సమస్యలను పరిష్కరిస్తా. ప్రజలు సహకరిస్తే ఇంకా ముందుకు వెళ్తా.




## గోలేటి సింగరేణి పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి

**రెబ్బెన, న్యూస్‌టుడే :** బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వర్లు ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేకు ఎన్నో సమస్యలు ఎదురైనప్పటికీ కృషి, పట్టుదలతో మహిళల సమస్యలు పరిష్కరించేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్‌రావు, జి.మనోహర్ సావిత్రి బాయి జీవిత చరిత్ర, విశేషాలు, స్త్రీ విద్య వ్యాప్తికి ఆమె చేసిన కృషిని కొనియాడుతూ వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.అర్లారెడ్డి, ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాస్, ఆర్.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సింగరేణి పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వర్లు

## ఓసీపీ-3 సీహెచ్‌పీని సందర్శించిన సంచాలకులు

**యైటింక్లయిన్‌కాలనీ:** ఆర్జీ-2 డివిజన్‌లోని ఓసీపీ-3 సీహెచ్‌పీని బుధవారం సింగరేణి(ఇఅండ్‌ఎం) సంచాలకులు శంకర్ సందర్శించారు. ప్రాజెక్టులోని భారీ యంత్రాలను పరిశీలించిన ఆయన అనంతరం సీహెచ్‌పీని సందర్శించి బొగ్గు రవాణా ఫీడర్ల పనితీరు రోజుకు ఎన్ని రేకుల బొగ్గును విద్యుత్తు, సిమెంట్ కంపెనీలకు రవాణా అవుతోంది. బొగ్గు రవాణా యంత్రాల పనితీరుపరంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అనే విషయాలను సీహెచ్‌పీ(డీజీఎం) సదానందంతో మాట్లాడారు. సంచాలకుల వెంట ఆర్జీ-2 జీఎం విజయబాబు, ఎస్ఎస్‌వో జానకీరామారావు ఉన్నారు.

# వృత్తి శిక్షణ.. ఉపాధికి భరోసా

### మహిళలకు చేయూతనిస్తున్న బైరడ్, సత్యసాయి సేవా సమితి ☆ కుట్టుశిక్షణతో ముందడుగు

**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:**

**మహిళలు ఖాళీగా ఉండకుండా వృత్తి శిక్షణ నేర్చుకొంటూ స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా చాలా సంస్థలు ఉచితంగా వివిధ శిక్షణ కోర్సులను నేర్పిస్తున్నాయి. అందులో భాగంగానే బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ(బైరడ్) సహకారంతో సత్యసాయి సేవా సమితి సింగరేణి ప్రాంతంలోని మహిళలకు కుట్టు శిక్షణ అందించేందుకు ముందుకు వచ్చింది. శ్రీరాంపూర్‌లోని సత్యసాయి ధ్యాన మందిరంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ, ఈ సంస్థ మహిళలకు అందిస్తున్న చేయూతపై 'న్యూస్‌టుడే' కథనం..**

సత్యసాయి ధ్యాన మందిరంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ 45 రోజులపాటు జరిగింది. శిక్షణ పొందేందుకు సుమారు 80 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా వయస్సు, విద్యార్హతల ఆధారంగా 52 మందిని ఎంపిక చేశారు. వీరికి 26 కుట్టు మిషన్లతో ప్రతిరోజు శిక్షణ తరగతులు నిర్వహించి భోజన వసతి కల్పించారు. శిక్షణకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని బైరడ్ సంస్థ అందజేసింది. నిపుణులైన శిక్షకులు రజిత, నర్మద కుట్టు శిక్షణ, ఫ్యాషన్‌డిజైనింగ్‌లో మెలకువలు నేర్పించారు. శిక్షణ కాలంలో ఫ్రాక్స్, షర్ట్స్, పంజాబీడ్రెస్‌లు, నైటీస్, పెట్టికోట్స్, వివిధ రకాల డిజైన్ బ్లౌజ్‌లు, నెక్కర్లు మొదలైన వాటిని కుట్టడం నేర్పించారు. శిక్షణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సత్యసాయి సేవా సమితి సభ్యులు వెంకటేశ్వర్లు, మణి అన్ని ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. శిక్షణ పూర్తిచేసుకొన్న మహిళలు తమలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, సొంతంగా యూనిట్లు పెట్టుకొని స్వయం ఉపాధి పొందుతామని చెబుతున్నారు.


కుట్టు శిక్షణ నేర్చుకొంటున్న మహిళలు

### తక్కువ సమయంలో నైపుణ్యాలు మెరుగు

**- ఎనగంటి భాగ్యలక్ష్మి, శ్రీరాంపూర్**



తక్కువ సమయంలో కుట్టు శిక్షణలో నైపుణ్యాలు నేర్చుకొన్నాను. మొదట్లో దుస్తులు కుట్టడంలో ఎలాంటి అనుభవం లేదు. శిక్షణ పూర్తైన తర్వాత ఇప్పుడు వేటినైనా కుట్టగలననే నమ్మకం పెరిగింది. ఇంటివద్ద కుటుంబ సభ్యులకు అవసరమైన దుస్తులు కుడుతూనే స్వయం ఉపాధి పొందడానికి కృషి చేస్తున్నాను.

### భవిష్యత్తులో ఫ్యాషన్ డిజైనర్‌గా రాణించాలి

**- షైన్ సుల్తానా, శ్రీరాంపూర్**



ప్రస్తుతం ఎక్కువ డిమాండు ఉన్న ఫ్యాషన్ డిజైనింగ్‌లో రాణించాలనే ఉద్దేశంతో కుట్టు శిక్షణ పొందాను. శిక్షణ కాలంలో నేర్చుకొన్న నేపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకొంటూ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు నేర్చుకొంటా. దీనిద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందనే ఉద్దేశంతో ఈ రంగాన్ని ఎంచుకొన్నా. మహిళలు వృత్తి శిక్షణలు నేర్చుకోవడం ద్వారా ఆయా కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడవు.

### ఇంటివద్దనే ఉపాధి పొందవచ్చునని

**- అడిచర్ల హారిక, శ్రీరాంపూర్**



ఇంటివద్ద ఉండి ఉపాధి పొందవచ్చేననే ఉద్దేశంతో కుట్టు శిక్షణ పొందాను. శిక్షణ పూర్తైన తర్వాత టైలరింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసుకొని ఉపాధి పొందాలనుకొంటున్నా. ఇతర మహిళలు వృత్తి శిక్షణలు నేర్చుకొనేందుకు ముందుకు రావాలి. అప్పుడే సమాజంలో మహిళలకు గుర్తింపు లభిస్తుంది.

### శిక్షణతోపాటు మంచి మాటలు

**- బోగి సంతోష, శ్రీరాంపూర్**



సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిరోజు కుట్టు శిక్షణ ఇస్తూనే జీవితానికి ఉపయోగపడే మంచి మాటలు చెబుతున్నారు. శిక్షణ.. స్వయం ఉపాధికి ఉపయోగపడితే మంచి మాటలు ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. ఇంటివద్ద ఖాళీగా ఉండటం ఇష్టం లేక కుట్టు శిక్షణ నేర్చుకొనేందుకు దరఖాస్తు చేసుకొన్నా. శిక్షణలో తెలుసుకొన్న విషయాలు, నైపుణ్యాలతో జీవితంలో ఎలాంటి సందర్భాల్లోనైనా సొంతంగా బతుకవచ్చుననే ధైర్యం కలిగింది.

### మహిళలు వృత్తి శిక్షణపై ఆసక్తి పెంచుకోవాలి

**- నూక రమేష్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్**



వివిధ వృత్తి శిక్షణలు నేర్చుకొనేందుకు మహిళలు ముందుకు రావాలి. ఒక్కసారి నేర్చుకొన్న శిక్షణతో భవిష్యత్తులో వారు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుంది. శిక్షణ అనంతరం ఇచ్చే ధ్రువీకరణ పత్రంలో వివిధ దుకాణాల్లో పనిచేస్తూ బడి పిల్లల సమవస్త్రాలు కుడుతూ ఉపాధి పొందే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బైరడ్ సంస్థ ముందుకు రావడం అభినందనీయం.

## శబరిమలకు అయ్యప్ప స్వాముల పయనం

**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ప్రాంతానికి చెందిన అయ్యప్ప స్వాములు బుధవారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. గురుస్వామి సంగనబట్ల నరహరిశర్మ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కాలనీలోని అంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు ఆర్కే-8 కాలనీలోని గణేష్ మందిరం నుంచి ఇరుముడిలో కేరళకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు సాదు వీరభద్రస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, సభ్యులు బి.రాజేశం, పుట్ట రవి, రత్నం, శ్రావణ్, అప్పయ్య, లక్ష్మణ్, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


శబరిమలకు వెళ్లేందుకు సిద్ధమైన అయ్యప్ప భక్తులు

# రాష్ట్రస్థాయి వెటరన్ పోటీలకు సిద్ధం

### నేడు ఆర్కేపీలో పోటీలు

**రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే:** రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీలకు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. ఆర్కేపీలో నిర్వహించే 4వ తెలంగాణ రాష్ట్ర మాస్టర్ వెటరన్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాలకు చెందిన సుమారు 650 మంది క్రీడాకారులను హాజరుకానున్నారు. సుమారు 15 అంశాలల్లో క్రీడలు జరగనున్నాయి. పోటీల ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు వ్యవహరిస్తున్నారు. జిల్లా మాస్టర్ వెటరన్ అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు మందమర్రి ఏరియా సింగరేణి యాజమాన్యం పూర్తి సహాయసహకారాలను అందిస్తోంది. పోటీల కోసం ఠాగూర్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా హైజంప్, లాంగ్‌జంప్ కోసం కోర్టులను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరోవైపు పోటీలలో 40 నుంచి 90 సంవత్సరాల వయస్సు క్రీడాకారులు పాల్గొంటున్నారు. పురుష క్రీడాకారుల కోసం సింగరేణి ఉన్నత పాఠశాలలో, మహిళల కోసం రైల్వే స్టేషన్ సమీపంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో వసతిని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం పలువురు క్రీడాకారులు ఇతర జిల్లాల నుంచి పోటీలు జరిగే స్టేడియం చేరుకున్నారు. పోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యే దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, మంచిర్యాల పాలనాధికారి ఆర్వీ.కర్ణన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ జి.వివేకనంద, దిల్లీలో అధికార ప్రతినిధి వేణుగోపాలచారి, మంచిర్యాల డీసీపీ వేణుగోపాల్, మందమర్రి ఏరియా సింగరేణి జీఎం ఎం.రాఘవలు తదితరులు పాల్గొననున్నారు.



రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియం


పోటీల కోసం వేసిన ట్రాక్


జావెలిన్‌త్రో కోసం కోర్టు సిద్ధం

## ఏఐటీయూసీ సివిల్ విభాగం పిట్ కార్యవర్గం ఎన్నిక

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** మందమర్రి ఏరియా ఏఐటీయూసీ సివిల్ విభాగం పిట్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షునిగా డి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా నిర్మలచారీ, కార్యదర్శిగా గట్టు జగన్, సహాయ కార్యదర్శిగా సీహెచ్ శంకర్, కోశాధికారిగా ఎం.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జి. కొమురయ్య, లింగమూర్తి, జీ.నర్సయ్య. ఎన్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీమనాధుని సుదర్శన్, కంది శ్రీనివాస్, జి.ఎల్లయ్య.. అంకతి సాయిలు, బి. రవిందర్, కిష్టయ్య, బాబురావు, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.


ఏఐటీయూసీ సివిల్ విభాగం పిట్ కార్యవర్గం



పట్టుకున్న నిషేధిత గుట్కాలతో ఏసీపీ సీతా రాములు

## శ్రీరాంపూర్‌లో నిషేధిత గుట్కాల పట్టివేత

**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** శ్రీరాంపూర్ పోలీసు స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో నిషేధిత గుట్కాలను పట్టుకున్నట్లు జైపూరు ఏసీపీ సీతారాములు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం శ్రీరాంపూర్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ విలేకరులకు వివరించారు. బుధవారం సాయంత్రం శ్రీరాంపూర్ జాతీయ రహదారిపై ఎస్సై రవిప్రసాద్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ వైపు వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు వారికి తారసపడ్డాయి. పోలీసులు వాటిని ఆపి తనిఖీలు చేయగా సుమారు రూ.లక్ష విలువ గల నిషేధిత గుట్కాలు వారికి కన్పించాయి. వెంటనే వారు అప్రమత్తమై నిషేధిత గుట్కాలను తరలిస్తున్న మంచిర్యాలకు చెందిన వెంకటేష్, షేక్ అహ్మద్, ఎంఎ జావిద్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ ఎస్సై రవిప్రసాద్, ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






వెటరన్ పోటీల్లో పతకాలు సాధిస్తున్న జిల్లా క్రీడాకారులు


# మలి వయసు.. క్రీడాసొగసు

- పతకాలతో జిల్లా కీర్తిచాటుతున్న కార్మికులు
- జాతీయ స్థాయిలో రాణింపు
- నేటి నుంచి రాష్ట్రస్థాయి మాస్టర్ వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు

**రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే**

నోట్ల కొలదీ డబ్బుకన్నా మెరుగైన ఆరోగ్యం మనిషి జీవితానికి ఎంతో తృప్తినిస్తుంది అంటారు ఆరోగ్య నిపుణులు. ఇదే బాటలో సాగుతూ మధ్య వయస్కులైన ఉద్యోగులు ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరిలో కొందరు 50 వయస్సులో ఉంటే మరికొందరు అదీ దాటారు. వారిలో క్రీడోత్సాహం...పట్టుదల ఏ మాత్రం తగ్గలేదు... మైదానంలో అడుగుపెడితే చాలు పతకం రావాల్సిందే. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాల పంట పండిస్తున్నారు రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ సింగరేణియులు ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. గురువారం నుంచి రామకృష్ణాపూర్‌లో నిర్వహించే 4వ రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీల నేపథ్యంలో జిల్లాలో రాణిస్తున్న వెటరన్ క్రీడాకారుల గురించి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...

### నిత్య క్రీడాకారుడు నారాయణ...



మందమర్రి ఏరియాలో ఈత కొలను శిక్షకుడిగా పనిచేసే పప్పు నారాయణ వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధిస్తూ మన్ననలు పొందుతున్నారు. 800, 1500 మీటర్లు, 5 కిలోమీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాలు సాధిస్తున్నారు.

- గత డిసెంబరులో ఐదో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో(బెల్లంపల్లి) 10, 5 కిలోమీటర్ల పరుగులో బంగారు పతకాలు
- 2014లో గోదావరిఖనిలో జరిగిన తొలి తెలంగాణ రాష్ట్ర వెటరన్ పోటీల్లో 5, 10 కిలోమీటర్లు, 1500 మీటర్లలో బంగారు పతకాలు
- 2013లో ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు కృష్ణా జిల్లాలో, జాతీయ స్థాయిలో కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగిన పోటీల్లో కాంస్య పతకం సాధించారు.
- ఈత పోటీల్లో గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో, అదే సంవత్సరం హైదరాబాద్‌లో బంగారు పతకాలు అందుకున్నారు.
- 2015, 2016లో విజయవాడలో జరిగిన అమరావతి మారథాన్‌లో 22 కిలోమీటర్ల పరుగు పందెంలో తొలి స్థానం దక్కించుకున్నారు. 2017లో సైతం హైదరాబాద్‌లో బంగారు పతకం సాధించారు.

### బంగారు పతకాలు పండిస్తున్న బాలకృష్ణ



శ్రీరాంపూర్ ఏరియాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే టి.బాలకృష్ణ డిస్కస్‌త్రో, షాట్‌పుట్‌లో బంగారు పతకాలు పండిస్తున్నారు. కోలిండియా క్రీడాకారునిగా, పబ్లిక్ సెక్టారు పోటీల్లో పతకాలు దక్కించుకున్నారు. ప్రస్తుతం సింగరేణికి కోలిండియా స్థాయిలో వ్యక్తిగతంగా పతకాలు సాధిస్తున్న గుర్తింపు పొందుతున్నారు.

### రాజేశ్వర్‌రావులో తగ్గని ఉత్సాహం...



రామకృష్ణాపూర్‌కు చెందిన పి.రాజేశ్వర్‌రావు సింగరేణి ఉద్యోగిగా ఉద్యోగ విరమణ పొందారు. 70 ఏళ్ల వయస్సు విభాగంలో పతకాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు దక్కించుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడ వెటరన్ పోటీలు జరిగినా పాల్గొని పతకాలు సాధిస్తున్నారు.

### పోల్‌వాల్ట్‌లో రారాజు రాజబద్రీ...



రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రాజబద్రీ పోల్‌వాల్ట్‌లో రారాజు. సుమారు 20 ఏళ్లపాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించి జిల్లాకు ఖ్యాతిని తీసుకొచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిలో ట్రామర్‌గా పనిచేసిన ఆయన వాలీబాల్, హైజంప్ క్రీడల్లో సైతం పతకాలు సాధించారు. పోల్‌వాల్ట్ క్రీడలో జాతీయ స్థాయిలో 21 పతకాలు సాధించి సింగరేణిలో ఆదర్శంగా నిలిచారు.

### అథ్లెటిక్స్‌లో హవా చాటిన దేవయ్య



శ్రీరాంపూర్‌లోని ఆర్కే-8 గనిలో మైనింగ్ సర్దార్‌గా పనిచేసిన కె.దేవయ్య 500, 1500, 5 కిలోమీటర్ల పరుగుపందెంలో జాతీయ స్థాయిలో పతకాలు దక్కించుకున్నారు. కోలిండియా హాకీ, కబడ్డీ క్రీడాకారుడిగా గుర్తింపు పొందారు. 40 ఏళ్ల వయస్సు నుంచి పోటీల్లో పాల్గొంటున్నారు. 2007 నుంచి వివిధ పోటీల్లో వరుసగా బంగారు పతకాలు సాధించారు. అదే ఏరియాకు చెందిన మాన్‌సింగ్‌తో కలిసి పోటీల్లో పాల్గొని రాణించారు.

### పరుగు పందెంలో మధునయ్య హవా...



శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5 గనిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే వేల్పుల మధునయ్య పరుగుపందెం పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. 800, 1500, 5000 మీటర్ల విభాగంలో రాణించి బంగారు పతకాలు దక్కించుకున్నారు. గతేడాది జరిగిన మూడో తెలంగాణ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 5 కిలోమీటర్ల పరుగులో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. వీటితో పాటు రెండో, మూడో స్థానాలు పొందారు.

### బంగారు పతకాల మాన్‌సింగ్...



శ్రీరాంపూర్ ఏరియాలో కోల్‌ఫిల్లర్‌గా పనిచేసిన పరుగుల వీరుడు మాన్‌సింగ్ వెటరన్ పోటీల్లో పదుల సంఖ్యలో బంగారు పతకాలు సాధించి జిల్లాకు ఖ్యాతిని తీసుకొచ్చారు. ఆయన సుమారు 60పైగా బంగారు పతకాలు సాధించారు. సింగరేణిలో ఏరియా స్థాయిలో వరుసగా 2005 నుంచి 2012 వరకు బంగారు పతకాలు దక్కించుకున్నారు. 5, 10 కిలోమీటర్ల పరుగు పందెంలో గుర్తింపు పొందారు.

### నడకలో 'రాజ'కొమురయ్య...




రామకృష్ణాపూర్‌కు చెందిన మడిపల్లి రాజకొమురయ్య మందమర్రి ఏరియాలోని కె.కె-5 గనిలో జనరల్‌మజ్దూర్‌గా పనిచేస్తున్నారు. ఆరోగ్యంగా ఉంటామనే భావించి మొదలు పెట్టిన నడక ఆయనను రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించేలా చేసింది. 2001 నుంచి జిల్లా నుంచి ఇప్పటి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధిస్తున్నారు.

### లాంగ్‌జంప్‌లో స్వామి...



మందమర్రి ఏరియాలో సింగరేణి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న టి.స్వామి వెటరన్ పోటీల్లో సత్తాచాటుతున్నారు. లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్‌లో రాణిస్తున్నారు. మూడు అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు.

### ప్రోత్సహిస్తూనే పతకాలు...



జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ సంఘం బాధ్యులుగా కొనసాగిన చేతి శ్రీరాములు రామకృష్ణాపూర్ పట్టణానికి చెందినవారు. రాష్ట్ర, జాతీయ స్థాయి వెటరన్ పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. చేతి శ్రీరాములు క్రాస్‌కంట్రీ పోటీల్లో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా గుర్తింపు పొందారు. జిల్లాలో వెటరన్ క్రీడాకారులను అన్ని విధాల ఆదుకుంటూ ముందుకు సాగుతున్నారు.

### ఆదర్శం ఈ దంపతులు...



రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన గెడెల్లి కృష్ణమూర్తి-శాంత దంపతులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాల పంట పండించారు. సింగరేణిలో మైనింగ్ సర్దార్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కృష్ణమూర్తి కోలిండియా హాకీ క్రీడాకారుడిగా మంచి గుర్తింపు ఉంది. నడక పోటీలో పలు పతకాలు సాధించారు.

* భర్త ప్రోత్సాహంతో శాంతి 50 ఏళ్ల వయస్సు విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో పతకాలను అందుకున్నారు. 2005 నుంచి ఇప్పటి వరకు నడక పోటీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. 2006లో బెంగళూరులో జరిగిన ఆసియా మీట్, 2011లో తమిళనాడులోని ఈరోడ్‌లో జరిగిన పోటీల్లో బంగార పతకాలు గెలుచుకున్నారు.

### షాట్‌పుట్‌లో రాణించిన మల్లయ్య...



శ్రీరాంపూర్ ఏరియాలో ఫిట్టర్‌గా పనిచేసే బి.మల్లయ్య షాట్‌పుట్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. షాట్‌పుట్‌తో పాటు డిస్కస్‌త్రోలో సైతం రాణిస్తున్నారు. సింగరేణి తరపున కోలిండియా పోటీల్లో పాల్గొంటున్నారు.

### ఆటలకు ఆద్యుడు రాములు



సింగరేణి విశ్రాంత ఉద్యోగైన మన్నె రాములు రామకృష్ణాపూర్‌లో ఆటలకు ఆద్యుడిగా పేరుంది. జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో హర్డిల్స్ అంశంలో గోల్డ్‌మెడలిస్టుగా జిల్లా నుంచి గుర్తింపు పొందారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. వెటరన్ అథ్లెటిక్స్ సంఘం బాధ్యుడిగా కొనసాగుతున్నారు.



శ్రీరాంపూర్ జీఎం సుభానికి వినతి పత్రం అందజేస్తున్న భూనిర్వాసిత గ్రామాల సంక్షేమ సంఘం నాయకులు

## భూనిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** శ్రీరాంపూర్ ఉపరితల గని ముంపు గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఏరియా జీఎం సుభానికి తెలంగాణ సింగరేణి భూనిర్వాసిత ప్రభావిత గ్రామాల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సార్పీ ఓసీపీ వల్ల భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి వారసులకు ఉద్యోగాలు కల్పిస్తే ఈ ప్రాంత ప్రజల కష్టాలు కొంతమేర తీరుతాయన్నారు. నిర్వాసిత యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వాని విద్యార్హతను దృష్టిలో పెట్టుకొని వారి విద్యార్హత ఆధారంగా శిక్షణ ఇచ్చిన ఉద్యోగ అవకాశాలు పెంచాలని వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తెలంగాణ సింగరేణి భూనిర్వాసిత ప్రభావిత గ్రామాల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు లింగస్వామి, నాయకులు గాదె సత్యనారాయణ, సోమిశెట్టి రాములు, భానేష్, రాజమల్లు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




One can expect 3 to 5 VSAQs from these 4 lessons in inter exams and 5 questions in competitive exams. Inorder to cover all the basics, one must go through all Chapter and VSAQs along with solved problems. List out all important formulas at one place and be perfect with logarithams & square root based calculations for excellent score.

ప్రతిభ

# What is critical temperature?

## States of Matter, Stoichiometry, Thermodynamics, Chemical Equilibrium and Acids - Bases

### 2 Marks Questions

**Q:** Calculate Kinetic energy (in SI units) of 4 g of methane at –73°C.

**A:** $K.E = \frac{3}{2}nTR$

$= \frac{3}{2} \times \frac{4}{16} \times (-73 + 273) \times 8.314$

$= 1.5 \times 0.25 \times 200 \times 8.314$

$= 623.6$ J

**Q:** Calculate Kinetic energy of 5 moles of $N_2$ at 27°C.

**A:** $K.E. = \frac{3}{2}nTR = \frac{3}{2} \times 5 \times (27 + 273) \times 8.314$

$= 1.5 \times 5 \times 300 \times 8.314 = 18706.5$ J

**Q:** Which of the gases diffuses faster among $N_2$, $O_2$ and $CH_4$? Why?

**A:** At constant P & T, the rate of diffusion of a gas is inversely proportional to its molecular mass. $CH_4$ diffuses faster as it has least molecular mass (16 g/ mole).

**Q:** Calculate RMS speed, most probable speed of $CO_2$ gas at 27°C.

**A:** $U_{rms} = \sqrt{\frac{3RT}{M}}$

$= \sqrt{\frac{3 \times 8.314 \times (27 + 273)}{\frac{44}{1000}}}$

$= 4.42 \times 10^2$ m/sec

$U_{mp} = 0.8166 \times U_{rms} = 0.8166 \times 4.42 \times 10^2$
$= 3.36 \times 10^2$ m/sec

**Q:** State Dalton's law of partial pressures.

**A:** At constant temperature and volume, the total Pressure exerted by the mixture of non reactive gases is equal to sum of partial pressures of component gases ($P_1$, $P_2$)

$P_{total} = P_1 + P_2$

**Q:** What are standard ambient temperature and pressure (S.A.T.P) conditions?

**A:** 298.15 K temperature & 1 bar Pressure.

**Q:** Give the ratio of most probable (M.P), Average (AV) and R.M.S speeds of gas molecules.

**A:** $U_{M.P} : U_{AV} : U_{R.M.S}$

$= \sqrt{\frac{2RT}{M}} : \sqrt{\frac{8RT}{M}} : \sqrt{\frac{3RT}{M}}$

$= 1.000 : 1.128 : 1.224$

**Q:** What is critical temperature? Give its value for $CO_2$.

**A:** The temperature above which any gas can not be liquified by applying any pressure.

$T_C$ of $CO_2$ = 30.98°C

**Q:** What is Surface tension? Give its units in SI System.

**A:** The downward force acting per unit length perpendicular to the line drawn on the surface of liquid. Units : $Nm^{-1}$

**Q:** What is coefficient of viscosity? Give its units in SI system.

**A:** The Force, when velocity gradient $\left(\frac{du}{dz}\right)$ is unity and the area of contact is unit area (A). Units: NS $m^{-2}$

$F = n.A.\frac{du}{dz}$

**Q:** What is "Compressibility factor"?

**A:** The ratio of actual molar volume of gas to molar volume of an ideal gas. For ideal gas

$Z = 1.$ $\quad Z = \frac{PV}{nTR}$

**Q:** What is "Boyle's temperature"?

**A:** The temperature at which a real gas obeys ideal gas equation over appreciable range of pressure.

**Q:** Give Vander Waals equation of state.

**A:** $\left(P + a\frac{n^2}{v^2}\right)(V - nb) = nTR$

a, b = Vander Waals constants

n = no. of moles, P = pressure, V = Volume,

T = absolute temp., R = Universal gas constant

**Q:** What is "disproportionation reaction"? Give 1 example.

**A:** The redox reaction in which an element undergoes oxidation as well as reduction.

$2 H_2O_2 \rightarrow 2 H_2O + O_2$

**Q:** State the "Law of multiple proportions".

**A:** When 2 elements combine to form 2 or more compounds, then the mass of one element that combines with a fixed mass of other element in the ratio of whole number.

eg. CO & $CO_2$

**Q:** Give 2 redox reactions related to environment.

**A:** ★ Use of liquid $H_2$ as fuel

★ Development of OZONE hole by CFCs.

**Q:** What do you mean by "Significant figures"?

**A:** Meaningful digits which are known with certainity. Eg: 4.007 has 4 significant figures.

**Q:** Calculate the no. of moles present in
a) 540 g. of glucose b) 200 g. of $CaCO_3$

**A:** (a) $n_{glucose} = \frac{mass}{g.m.mass} = \frac{540}{180} = 3$ moles

(b) $n_{CaCO_3} = \frac{mass}{g.m.mass} = \frac{200}{100} = 2$ moles

**Q:** The empirical formula (E.F.) of a compound is $CH_2O$. Its molecular weight is 90. Calculate the molecular formula of the compound.

**A:** E.F. = $CH_2O$

E.F.Wt. = 12 + 2(1) + 16 = 30

$n = \frac{M.F.Wt.}{E.F.Wt.} = \frac{90}{30} = 3$

M.F. = $(E.F.)_n = (CH_2O)_3 = C_3H_6O_3$

**Q:** Assign oxidation number of underlined elements

a) $\underline{Cr}_2O_7^{-2}$ b) $Ca\underline{O_2}$ C) $\underline{O}F_2$ d) $K_2\underline{Mn}O_4$

**A:** a) $\underline{Cr}_2O_7^{-2}$

$2x + 7(-2) = -2$

$\therefore x = 6$

b) $Ca\underline{O_2}$

$+2 + 2x = 0$

$\therefore x = -1$

(c) $\underline{O}F_2$

$x + 2(-1) = 0$

$x = +2$

d) $K_2\underline{Mn}O_4$

$2(+1) + x + 4(-2) = 0$

$\therefore x = +6$

**Q:** Calculate normality of $H_2SO_4$ solution if 50 ml of it completely neutralises 250 ml of 0.1 N $Ba(OH)_2$ solutions.

**A:** $V_1N_1 = V_2N_2$

$N_1 = \frac{V_2N_2}{V_1} = \frac{250 \times 0.1}{50}$

$= 0.5$ N





**Q:** Calculate the volume of 0.1 M $KMnO_4$ required to react with 100 ml of $H_2C_2O_4.2H_2O$ solution in presence of $H_2SO_4$?

**A:** 2 Moles of $KMnO_4$

= 5 Moles of $H_2C_2O_4.2H_2O$

$\frac{V_1M_1}{n_1} = \frac{V_2M_2}{n_2}$

$V_1 = \frac{V_2M_2n_1}{n_2M_1} = \frac{100 \times 0.1 \times 2}{5 \times 0.1} = 40$ ml

**Q:** What is the sign conversion of a) work done on the system and b) work done by the system?

**A:** a) work done on the system = +Ve

b) work done by the system = –Ve

**Q:** What are "intensive" and "extensive" properties?

**A: Intensive property:** The property of a system which depends upon the total amount of the material. eg: Mass, Volume

**Extensive property:** The property of a system which doesn't depend upon the total amount of material. eg: Density, Viscosity

**Q:** The equilibrium constant for a reaction is 10. (T = 300 K). What will be the value of $\Delta G°$?

**A:** $\Delta G° = -2.303\ RT\log K_c$

$= -2.303 \times 8.314 \times 300 \times \log 10$

$= -2.303 \times 8.314 \times 300 \times 1 = -5.744$ K.J

**Q:** State 3rd law of thermodynamics.

**A:** The entropy of a pure and perfect crystal is zero at absolute zero temperature.

$\lim_{T \to 0} S = 0$

**Q:** Define "Enthalpy".

**A:** The total heat content of a system at constant pressure & temperature.

**Q:** Define "Entropy", "Standard molar entropy".

**A: Entropy:** The degree of disorderness of molecules of the system.

**Standard molar entropy:** The entropy of 1 mole of a substance at 1 atom pressure & 25°C.

**Q:** What is "Gibbs energy"?

**A:** The amount of energy available from a system which can be converted to useful work at constant Pressure & Temperature.

**Q:** Enthalpies of formation of CO, $CO_2$, $N_2O$ and $N_2O_4$ are –110, –393, 81 and 9.7 K.J $mol^{-1}$ respectively. Find the value of $\Delta_rH$ for the reaction $N_2O_4 + 3CO \rightarrow N_2O + 3CO_2$.

**A:** $\Delta_rH = H_{products} - H_{reactants}$

$= [3 H_{CO_2} + H_{N_2O}] - [H_{N_2O_4} + 3H_{CO}]$

$= [3 \times (-393) + 81] - [9.7 + 3(-110)]$

$= -778$ K.J

**Q:** What is "homogeneous equilibrium"?

**A:** The equilibrium in which all the reactants and the products are present in same phase

$N_2(g) + 3H_2(g) \rightleftharpoons 2NH_3(g)$



Writer:
ANS Sankara Rao
Subject Expert

**Q:** What is "heterogeneous equilibrium"?

**A:** The equilibrium in which reactants & products are present in different phase.

$CaCO_3(s) \rightleftharpoons CaO(s) + CO_2(g)$

**Q:** What is meant by "dynamic equilibrium"?

**A:** The reversible reaction in which the rate of forward reaction is equal to the rate of backward reaction and both are taking place even at equilibrium state.

**Q:** Calculate pH of 0.1825% HC*l* aqueous solution.

**A:** $[H^+] = N = \frac{0.1825}{37.5} \times \frac{1000}{100} = 5 \times 10^{-2}$

pH = –log [$H^+$]

pH = –log [$5 \times 10^{-2}$] = –[log 5 + log $10^{-2}$]

= –[0.6990 – 2] = 1.3010

**Q:** Calculate pH of $10^{-8}$ M NaOH.

**A:** $[OH^-] = [OH^-]_{NaOH} + [OH^-]_{H_2O}$

$= 10^{-8} + 10^{-7} = 10^{-7}(10^{-1} + 1)$

$= 1.1 \times 10^{-7}$

pOH = –log[$OH^-$]= –log[$1.1 \times 10^{-7}$] = 6.96

$\therefore$ pH = 14 – pOH= 14 – 6.96 = 7.04

**Q:** Calculate pH of 0.05 M $Ba(OH)_2$ solution.

**A:** $[OH^-] = N = 2 \times 0.05 = 0.1 = 10^{-1}$

pOH = –log[$OH^-$] = –log[$10^{-1}$] = –(–1) = 1

pH = 14 – pOH = 14 – 1 = 13

**Q:** Define pH.

**A:** Negative logarithm of $H^+$ ion concentration

pH = –log [$H^+$]

**Q:** What is "Solubility Product"?

**A:** The product of concentration of Cations & Anions present in saturated salt solution.

**Units:** $(moles/lit)^n$

**Q:** 50 ml of $NH_4OH$ & 25 ml of 2M $NH_4Cl$ were mixed to make a buffer. What is its pH if its $Pk_b$ is 4.8

**A:** $pOH = pk_b + \log\frac{M_sV_s}{M_bV_b}$

$= 4.8 + \log\frac{2 \times 25}{0.1 \times 50} = 4.8 + 1 = 5.8$

$\therefore$ pH = 14 – pOH

= 14 – 5.8 = 8.2

**Q:** All the bronsted bases are Lewis bases. Explain.

**A:** Bronsted base is proton acceptor.

$NH_3 + H^+ \rightarrow NH_4^+$. Lewis base is electron pair donor. Where $NH_3$ can accept a proton ($H^+$) and donates lone pair of electrons to $H^+$ ion. So $NH_3$ is Bronsted base as well as Lewis base.

**Q:** Classify the following solutions of salts into acidic and basic $AlCl_3$, $Na_2CO_3$, $CuSO_4$, $CH_3COONa$.

**A: Acidic:** $CuSO_4$ & $AlCl_3$

**Basic:** $CH_3COONa$ & $Na_2CO_3$

**Q:** What are 'London Forces'?

**A:** Forces of attraction between 2 temporary dipoles. Eg: n-pentane.




**ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) IIవ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.**

ప్రతిభ

# ఆహారానికి ఏదీ భద్రత...?

## జనరల్ స్టడీస్

### డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.

✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.

✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

### భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్ఠవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.

✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

*అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.

✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

### ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.

✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.

✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.

✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

*ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

### ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.

✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

# హాయ్! బుజ్జీ!!




రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

## పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

### తయారీ ఎలా?



◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.


### పుట్టింది ఎప్పుడంట?

● 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
● జస్టిన్ స్క్యాబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
● ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

### లోపల పువ్వులెలా?

● ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.






## ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

### స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

### ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు
- మదర్ థెరిసా

### నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్




### కవలలేవి?

ఒకేలా ఉన్న జతను పట్టుకోండి




### దారి కనుక్కోండి!



### సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [ ] with our (ముక్కు)
2. We [ ] with our (కళ్లు)
3. We [ ] with our (చెవి)
4. We [ ] with our (నాలుక)
5. We [ ] with our (చేతులు)

జవాబులు: స్కూల్ సవాల్: 1.1857 2.పోర్చుగల్ 3.నయా రాయ్‌పూర్
కవలలు: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See 3.Listen 4.Taste 5.Touch

# మంచిర్యాల ట్రాఫిక్ సీఐగా సతీష్



**మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే:** మంచిర్యాల పట్టణ ట్రాఫిక్ సీఐగా గడికొప్పుల సతీష్ బాధ్యతలు చేపట్టారు. స్థానిక డీసీపీ కార్యాలయం ఆవరణలోని ట్రాఫిక్ అధికారి ప్రత్యేక కార్యాలయంలో ఆయన బుధవారం విధుల్లో చేరారు. సతీష్ గతంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించి ఇటీవల పోలీసుశాఖలో జరిగిన పదోన్నతులలో భాగంగా ట్రాఫిక్ సీఐగా నియామకమయ్యారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# 'ఐటీడీఏలో అవినీతిని అరికట్టాలి'

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** ఐటీడీఏలో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికంతోపాటు పూర్తిస్థాయి పీఓను నియమించాలని హీరా సుక్క ఆదివాసీ పర్ధాన్ జాగృతి సమితి నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం ఆదిలాబాద్‌లో జిల్లా పాలనాధికారిని కలిసి తమ డిమాండ్లు వినిపించారు. సంఘం తరపున జ్ఞాపికను అందించారు. పాలనాధికారిని కలిసిన వారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్, ఉపాధ్యక్షుడు మెస్రం క్రిష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శిలు గేడం మాధవ్, కొచాడే నారాయణ్ తదిరుతులున్నారు.



పాలనాధికారికి జ్ఞాపికను అందజేస్తున్న పర్ధాన్ సంఘం నాయకులు

# విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** సింగరేణి కాలనీల్లో ఉన్న ప్రైవేట్ ఇల్లు ఉన్న వినియోగదారులు ప్రభుత్వ విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మందమర్రి డిస్కం ఏఈ అన్నం రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనెక్షన్ కోసం రూ. 2,125, గృహేతర కనెక్షన్ కోసం రూ. 3650 చెల్లించి రశీదు పొందాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వినియోగదారులు రశీదు లేకుండా డబ్బులు నేరుగా ఎవ్వరికి ఇవ్వకూడదని సూచించారు. పురపాలిక ఆస్తిపన్ను, వైరింగ్, నోటరీ, ఆధార్ పత్రాలను దరఖాస్తుతో జతపర్చాలని సూచించారు.

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

**మధ్యాహ్నం**

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్-2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

## ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 డీజే రిపీట్

01:15 స్టే.. ఫూలిష్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 పోవే.. పోరా

09:00 పటాస్

09:30 టాప్స్

10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ. 6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ. 9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ. 2:00, రా. 7:00)
- ★ సుఖజీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ. 3:00, రా. 9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ. 11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ. 11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ. 3:45, రా. 7:45)

## ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఝూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బఠానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 0, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 0, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 0, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 0, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 0, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 0, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

**SVBC — ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

**భక్తి TV — ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు, 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

**ZEE తెలుగు — ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్), 11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

**maa — ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

**GEMINI — ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

**HBO — ఉదయం:** 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, **మధ్యాహ్నం:** 12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, **సాయంత్రం:** 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ **రాత్రి:** 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.



# ఆరుతడి పైర్లలో సూక్ష్మనీటి పద్ధతులు



ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. రబీ పంటల్లో నీటి యాజమాన్యం- పంటల పెరుగుదల, దిగుబడి, నాణ్యతలపై ప్రభావం చూపుతుందని వ్యవసాయాధికారి రవీందర్ తెలిపారు.

వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యం తక్కువగా ఉంది. వినియోగించే నీటిలో దాదాపు 60-70 శాతం వృథా అవుతోంది. దీని వల్ల సాగునీటి వృథా, భూసారం క్షీణించడం వంటి సమస్యలు వస్తున్నాయి. అధునాతన నీటి పారుదల విధానాలైన బిందు, తుంపర్ల సేద్య పద్ధతుల వల్ల దిగుబడి పెరగడమే గాకుండా, నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.

నీరు ఎక్కువగా లభ్యమయ్యే చోట ఆ నీటిని విచ్చలవిడిగా వాడటం వల్ల సారవంతమైన భూములెన్నో చౌడు భూములుగా మారి పంటల దిగుబడి క్రమేణా తగ్గుతున్నాయి. నేలలు కోతకు గురవుతున్నాయి. ఆశించిన దిగుబడులు సాధించాలంటే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి. నీటిని పెట్టిన మొదటి మూడు రోజులలో నేల లోపలి పొరలు నీటితో నిండిపోయి పొరలలో ఉన్న గాలి బయటికి వెళ్ళిపోతుంది. దీనివల్ల నేలలో సామర్థ్యం కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. మొక్కలకు కావల్సిన పోషకాలు భూమిలో ఉన్నా మొక్కలకు లభ్యం కావు. దీని వల్ల మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. కానీ బిందు సేద్య పద్ధతిలో నీటిని ప్లాస్టిక్ గొట్టాలు, ఇతర పరికరాలతో బిందువుల రూపంలో అన్ని మొక్కలకు సమానంగా మొక్క వేరు భాగానికి కావల్సినంత అందించవచ్చు. ఈ విధానం ద్వారా భూమిలో ఎప్పుడు తేమ మాత్రమే ఉండేలా చేయవచ్చు.

★ మొక్కజొన్న జళ్ళు వేసేటప్పుడు, పాలు పోసుకునేటప్పుడు, గింజ గట్టిపడే సమయంలో నీరు చాలా అవసరం. వేసవిలో 7-10 రోజులకొకసారి నీటితడి ఇవ్వాలి.

★ వేరుశనగలో విత్తిన వెంటనే ఒకతడి, తరువాత 20-25 రోజులకు, ఆ తరువాత పూత, కాత దశలో ప్రతి 10-15 రోజులకు ఒక తడి ఇవ్వాలి.

★ పొద్దుతిరుగుడు పువ్వులో ఆశించిన దిగుబడులు సాధించాలంటే మొగ్గతొడిగే దశ, పువ్వు వికసించే దశ, గింజ కట్టే దశలలో నీటితడి అవసరం.

★ నువ్వు పంటకు పూత, కాయ పెరుగుదల, గింజకట్టు దశల్లో తడులు తప్పక ఇవ్వాలి.

★ శనగ పంటలో విత్తిన 20-25 రోజులలో తడి ఇవ్వాలి. శనగ పంట ఎక్కువ నీటిని తట్టుకోదు. అవసరాన్ని బట్టి నీటి తడులు అందించాలి.

★ కుసుమ పంటకు తేమ ఉన్న బలమైన నేలల్లో సకాలంలో వేసిన పంటకు నీరు ఇవ్వాల్సిన అవసరం లేదు. తేలిక నేలలకు, ఆలస్యంగా విత్తిన పంటకు ఒకటి, రెండుసార్లు తడులు ఇవ్వాలి. పూత మొదలైన తరువాత నీరు పెట్టవద్దు.

– న్యూస్‌టుడే, జైనథ్ (ఆదిలాబాద్ వ్యవసాయం)

# పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాడి పశువులను విధిగా పాకల్లో ఉంచి పోషించడాన్ని ప్రతి రైతు కర్తవ్యంగా భావించాలి. వాతావరణ ప్రభావాల నుండి పశువులను కాపాడే పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్', పశువుల నుండి వెలువడే మూత్రం, పేడ వెళ్లడానికి కాలువలు నిర్మించాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి ప్రస్తుతం మార్కెట్లో లభించే రబ్బర్ మ్యాట్లను పరచడం మంచిది.

తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. నిర్ణీత కాల వ్యవధిలో సున్నం వేయించాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. ఒకే వరుస కానీ, రెండు వరుసలు కానీ పశువులను కట్టి మేపడం, పాలు పిండటం వల్ల పశువులు వాతావరణ తీవ్రతకు గురికావు. వ్యాధుల నివారణ కూడా సులభం అవుతుంది.

షెడ్‌లు కట్టే రైతులను ప్రోత్సహించేలా షెడ్‌లకు బీమా సౌకర్యం కల్పించేందుకు రైతులను ప్రోత్సహించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. దీనిద్వారా పశుగ్రాసాలకు సహజంగా ఎరువు లభిస్తుంది. ఒకటి, రెండు పశువులున్నా పాక నిర్మాణం చేపట్టాలి. అగ్ని ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు కల్పించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

– మధుసూదనరావు, విజయ డెయిరీ, ఆదిలాబాద్



# హుస్తాలే.. నేస్తాలు!

## చేతులతో తడిమి.. మనసుతో చూసి ✤ ఆదర్శం ఈ చిన్నారుల ఆత్మవిశ్వాసం
## ✤ నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి



యోగాసనాలు చేస్తున్న సాయి అంధుల పాఠశాల విద్యార్థులు


ఏసీసీ(మంచిర్యాల), మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే

**నవరసాలే సప్తవర్ణాలుగా, శబ్దతరంగాలే జీవజాతులుగా, వినికిడి, స్పర్శచర్యలనే అనుభవాలుగా మార్చి మనస్సులనే చూపులుగా మార్చుకుని చీకటి జీవితాలనుంచి వెలుతురు దిశగా దూసుకుపోతున్నారు వీరు. అందరూ కళ్లతో చూస్తే వీరు మనస్సుతో చూస్తారు. బాహ్యనేత్రాలు లేకున్నా, భావనేత్రాలతో లోకాన్ని చూస్తూ బ్రెయిలీ లిపి ద్వారా చదువుతూ.. స్పర్శే శ్వాసగా భావిస్తూ అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సాయి అంధుల పాఠశాల విద్యార్థులు. ఓపెవు చదువులో రాణిస్తూనే శాస్త్రీయ, భక్తి, జానపదం, ఏ పాట అయినా అవలీలగా పాడేస్తూ తమ గాన మాధుర్యంతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ధ్వని అనుకరణ, యోగాసనాలు, సాంకేతిక రంగాల్లో ప్రతిభచాటుతూ అబ్బుర పరుస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రతిభా పాటవాలతో ఎందరికో స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారు. గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఈ అంధుల పాఠశాల గురించి 'న్యూస్ టుడే' ప్రత్యేక కథనం..**

ఉమ్మడి జిల్లాలో సుమారు 1000 వరకు అంధులు ఉన్నారు. ప్రభుత్వ పరంగా ఉమ్మడిజిల్లాలో ఒక్క అంధ పాఠశాల సైతం లేదు. దీంతో వీరంతా చదువుకు దూరమవుతున్నారు. చదువుకోవాలని ఆసక్తి ఉండి ప్రతిభ ఉన్నా అవకాశం లేక వారి ప్రతిభ మరుగునపడుతోంది. అంధ చిన్నారుల కోసం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



బ్రెయిలీ లిపితో పరీక్ష రాస్తున్న బాలికలు



బ్రెయిలీ లిపిలో పురాణ గ్రంథాలు

### ఉమ్మడి జిల్లాలో ఏకైక అంధుల పాఠశాల

అంధులను ఆదుకోవాలనే సంకల్పంతో మంచిర్యాల జిల్లాకు చెందిన అశోక్‌రావు, పద్మ, సంపత్‌వ్యాస్, దుర్గావ్యాస్‌లు ముందుకువచ్చారు. 2010లో శ్రీసాయి అంధుల పాఠశాలను స్థాపించి అంధులకు ఉచిత విద్య, భోజనం, వసతి, అన్ని కల్పిస్తూ విభిన్నప్రతిభా వంతులుగా తీర్చిదిద్దుతున్నారు. గత 8సంవత్సరాలుగా తమస్థాయి మేరకు వారికి ప్రత్యేక పద్ధతిలో చదువును అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయసహకారాలు లేకపోయిన కేవలం దాతల సహాయంతో ఈ పాఠశాలను నడిపిస్తున్నారు.

### సోనమ్మ గానం చేస్తే మైమరిచిపోవాల్సిందే



ఆదిలాబాద్‌జిల్లా తురకచాందకు చెందిన సోనమ్మ పాఠశాల ప్రారంభం నుంచి ఇక్కడ చదువుతోంది. సంగీతం నేర్చుకొంటుంది. కష్టతరమైన యోగాసనాలు అవలీలగా వేస్తుంది. పాటలు పాడుతూ ఆకట్టుకుంటుంది. పలు వేదికల్లో పాల్గొని తన ప్రదర్శనతో ఆహుతులను అలరిస్తుంది. భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు చదివి తనలాంటి వారికి చేయూతనివ్వాలని కోరుతోంది.

### బాలరత్న ఆదిత్య



నిర్మల్ జిల్లా పెంబి గ్రామానికి చెందిన ఆదిత్య ఏడో తరగతి చదువుతున్నాడు. చదువులో చురుగ్గా ఉండటంతో పాటు తనకిష్టమైన మిమిక్రీలో ప్రతిభ చాటుతున్నాడు. రాజకీయనాయకులు, సినీరంగ కళాకారుల గొంతును అనుసరిస్తూ ఆకట్టుకుంటున్నాడు. వేదికపై ఆదిత్య ప్రదర్శన ఇస్తే చాలు నవ్వుల్లో ముంచెత్తుతాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తన మిమిక్రీతో అబ్బురపరిచి బాలరత్న బిరుదు పొందాడు.



### ఏదైనా అవలీలగా..

ఈ బాలుడి పేరు రాజేందర్. స్వగ్రామం బుట్టాపూర్. ఏడో తరగతి చదువుతున్నాడు. చదువుతో పాటు కంప్యూటర్‌లో దిట్ట. గణితంలో 150 స్క్వేర్ ఎక్కాలు, క్యూబ్‌లు అవలీలగా చెప్పగలడు. పాటలు పాడతాడు. తల్లిదండ్రులు లేకపోయినా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తున్నాడు.

### అలవోకగా లయబద్ధంగా



ఈ బాలుడు హాజీపూర్ మండలం దొనబండకు చెందిన గణేష్- మల్లీశ్వరి దంపతుల కుమారుడు మహేష్. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చూపులేకపోయినా ఎంతో ధైర్యం ప్రదర్శిస్తాడు. చదువుతో పాటు వాయిద్యంలో పరిణతి చూపుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఎవరూ పాట పాడినా దానికి అనుగుణంగా వాయిద్యాన్ని వాయిస్తాడు. లయబద్ధంగా తాళం వేయడంతో పాటు తబలా, డోలక్, డప్పు వాయిద్యాలను అలవోకగా వాయించి అబ్బురపరుస్తాడు. "అందమైన సృష్టిని చూడకున్నా, సమాజం మమ్మల్ని పట్టించుకోకున్నా మేము అందత్వాన్ని జయించేందుకు చదువుకుంటున్నాం. లిపిని రచించిన లూయిస్‌బ్రెయిలీనే మాకు దేవుడు" అని ఈ బాలుడు చెబుతున్నాడు.

### అంజలి ఆత్మవిశ్వాసం ఆదర్శం



ఈ చిన్నారి పేరు అంజలి. నర్సక్కపేటకు చెందిన మధునయ్య - రాజక్క దంపతుల కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతోంది. చిన్న వయస్సులోనే దేశంలోని రాష్ట్రాలు, రాజధానులు, భాషలు, ఎక్కాలు చకచకా చదివేస్తుంది. అడిగిన ప్రతి ప్రశ్నకు ఒక్కని మిషంలోనే సమాధానం చెబుతోంది. వైకల్యం పక్కన పెట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. శాస్త్రీయనృత్యం నేర్చుకుంది. మనసుతో చూస్తూ అభినయించడం పాటకు అనుగుణంగా నటించడం ఆమె ప్రత్యేకత.

### భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలి



**అశోక్‌రావు, అంధుల పాఠశాల నిర్వాహకుడు, మంచిర్యాల**

ఎనిమిదేళ్ల నుంచి పాఠశాలను అద్దె భవనంలోనే నడిపిస్తున్నాం. ఖర్చు ఎక్కువగా కావడంతో పరిమితంగా విద్యార్థులను తీసుకోవాల్సి వస్తోంది. జిల్లా పాలనాధికారిని కోరగా గతేడాది ఐఆర్‌పీ(భవిత కేంద్రం)ని కేటాయించారు. సొంత భవనం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదు. అధికారులు స్థలం కేటాయిస్తే మరింత మందికి విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

---

ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న

## ముత్యాల ముగ్గుల పోటీ

### జనవరి, 2, 2018 విజేతలు

1. డి. అనిత, హైదరాబాద్; 2. జ్యోతి, ఖమ్మం; 3. కె. మాధవీలత, హన్మకొండ; 4. వి.విజయలక్ష్మి, హైదరాబాద్; 5. వి.ఉష, చెన్నై; 6. టి. సరళ, మంచిర్యాల్; 7. ఎ. రాధిక, గోదావరిఖని; 8. జె. నవ్యశ్రీ, ఖమ్మం; 9. ఎ. శ్రీలక్ష్మి, అడశర్లపాడు, ఖమ్మం; 10. వై. జయ, బెల్లంపల్లి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

ఈనాడు ఈటీవీ తెలంగాణ

## నిజాయితీ చాటుకున్న రైతు

**నర్సింగాపూర్ (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే:** హాజీపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన నల్ల రాజయ్య అనే రైతు తాను పండించిన వరి ధాన్యం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. ఈ ధాన్యానికి సంబంధించిన డబ్బులు రూ. 24,779 నగదును ఐకేపీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రెండుసార్లు రాజయ్య బ్యాంకు ఖాతాలో జమైంది. ఇది గ్రహించిన ఆ రైతు వెంటనే ఐకేపీ అధికారులను కలిశారు. వారి సూచన మేరకు ఆ డబ్బులను డీడీ రూపంలో తీసి తన మిత్రుడు మమత సూపర్‌బజార్ డైరెక్టర్ నల్ల రవితో కలిసి వెళ్లి మండలసమాఖ్య అధికారులకు అందజేశారు. తన నిజాయితీతో ఆదర్శంగా నిలిచిన రైతును తోటి రైతులు, మండలసమాఖ్య అధికారులు అభినందించారు.



తనవి కాని డబ్బుల డీడీని మంచిర్యాల మండలసమాఖ్య అధికారికి అందజేస్తున్న రైతు రాజయ్య

## స్వామి వారి ప్రసాదాలు నాణ్యంగా ఉండాలి

**గూడెం(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి వారి ప్రసాదాలు నాణ్యతగా ఉండాలని ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ అధికారులకు సూచించారు. ఆలయంలో బుధవారం ఆలయ అధ్యక్షుడు వెంకటస్వామి అధ్యక్షతన సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు తీర్మానాలు చేశారు. దేవస్థానానికి సీజీఎఫ్ నిధుల నుంచి రూ. 38 లక్షలు మంజూరయ్యాయని, వాటితో ఆలయంపైన రూ. 25 లక్షలతో వ్రత మండపము, విశ్రాంతి గది, పౌర్ణమి రోజున నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రేకుల షెడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని తీర్మానించారు. భక్తుల రద్దీ సమయాల్లో వారు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నారాయణ, సభ్యులు కొండు సత్తయ్య, మేడి నారాయణ, కొండా చంద్రశేఖర్, జాడి రమేశ్, సత్తవ్వ, గట్టు మురళీధర్‌రావు, ఆలయ పర్యవేక్షకులు రమణారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



గూడెం సత్యదేవుని ఆలయంలో ధర్మకర్తల సమావేశం నిర్వహిస్తున్న సభ్యులు



గూడెంలో సత్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

### గూడెం హుండీ ఆదాయం లెక్కింపు

**గూడెం(దండేపల్లి గ్రామీణం):** పుష్య పౌర్ణమి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం దేవాదాయ ధర్మదాయ శాఖ నిర్మల్ డివిజన్ పర్యవేక్షకుడు రంగు రవికిషన్ ఆధ్వర్యంలో లెక్కించినట్లు ఆలయ ఈఓ తోడేటి నారాయణ తెలిపారు. హుండీ ద్వారా రూ. 1,32,016, రసీదులు, ఇతరముల ద్వారా రూ. 1,13,589 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ. 2,45,605 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వెంకటస్వామి, ధర్మకర్తల మండలి సభ్యులు కొండు సత్తయ్య, కానుగంటి తిరుపతి, సాయిని సుధాకర్, ఆకుల తిరుపతి, మారిశెట్టి సత్తవ్వ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు దస్తురాబాద్‌లో 4కె రన్

### నూతన గ్రంథాలయ ప్రారంభోత్సవం

**కడెం, న్యూస్‌టుడే:** దస్తురాబాద్‌లో గురువారం ఉదయం నిర్వహిస్తున్న 4కె రన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామీణ్ సపోర్ట్ ఫౌండేషన్ కన్వీనర్ కదారి నరేష్ కోరారు. దస్తురాబాద్ పోలీసుల సహకారంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. దస్తురాబాద్‌నుంచి గొండుగూడెం వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో సినీ హీరో ప్రిన్స్, ఎవరెస్టును అధిరోహించిన మలావత్ పూర్ణ, నిర్మల్ జిల్లా అధికారులు, గ్రంథాలయ సంస్థ చైర్మన్, స్థానికులు పాల్గొంటున్న కార్యక్రమాన్ని మండల వాసులు జయప్రదం చేయాలని కోరారు. నూతనంగా ఏర్పాటుచేసిన గ్రంథాలయ ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

## సమావేశమైన ఆలయ పాలకమండలి సభ్యులు

**బాసర, న్యూస్‌టుడే:** బాసర సరస్వతీ ఆలయ పాలకమండలి సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులు తొలిసారిగా ఆలయం వద్ద సమావేశమై ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వచ్చే వసంతపంచమి ఉత్సవానికి భక్తుల సౌకర్యార్థం, ఉత్సవ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి ఆలయ అధికారులకు పలు సూచనలందించారు. సమావేశంలో వంశపారంపర్య ధర్మకర్త శరత్‌పాఠక్, ఆలయ ఈవో సోమయ్య, 14 మంది పాలకమండలి పాల్గొన్నారు.

# బెల్లంపల్లి

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యసిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు శివప్రతాప్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని ఆసుపత్రిలో సిబ్బందికి వ్యాధుల నివారణ పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు భాకపా జిల్లా సమావేశం

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సమితి సమావేశం ఈనెల 4న ఉదయం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ కార్యదర్శి మంతెన మల్లేష్ తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుండా మల్లేష్, జిల్లా కార్యదర్శి కలవేణ శంకర్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

## మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బుధవారం రాష్ట్ర పురపాలకశాఖ, ఐటీ మంత్రి కె.తారకరామారావును కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి పట్టణాభివృద్ధికి మంత్రి ప్రకటించిన రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే బెల్లంపల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని 100 పడకలుగా మార్చే విషయంలో త్వరలోనే జీ.ఓ. విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.



సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు

## పాఠశాల రికార్డులను పూర్తి చేయాలి

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాఠశాలలకు సంబంధించిన అన్ని రికార్డులను పూర్తి చేయాలని మండల విద్యాధికారి దామోదర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విద్యావనరుల కేంద్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. పాఠశాల వారీగా వచ్చిన ఎస్ఎంసీ నిధుల వివరాలను ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 5న పాఠశాలల్లో ప్రత్యేక మానిటరింగ్ టీం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును నమోదు చేయాలని సూచించారు.



పోటీల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, యువకులు

## కన్నెపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

కన్నెపల్లి(తాండూరు), న్యూస్‌టుడే: కన్నెపల్లి మండల స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం కన్నెపల్లిలో ప్రారంభించారు. మండల తెరాస యూత్ అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపోటీల్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 జట్లు పాల్గొంటున్నాయి. ఈపోటీలను బుధవారం స్థానిక తెరాస నాయకుడు పుల్లూరు రాజయ్య, నాయికినిపేట సర్పంచి ఒడ్డేటి అశోక్‌లు ప్రారంభించారు. ఇలాంటి పోటీలు గ్రామీణ ప్రాంతాల యువతలో స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని వారు ఈసందర్భంగా అన్నారు. బుధవారం నుంచి ప్రతి రోజు రెండు మ్యాచుల చొప్పున ఈపోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శేఖర్, ఇతర యువకులు పాల్గొన్నారు.

## 'నిధులు దుర్వినియోగం చేశారని ఫిర్యాదు'

నెన్నెల: నెన్నెల సర్పంచి ఆస్మా, కార్యదర్శి అభివృద్ధి కోసం వచ్చిన నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గౌడ సంఘం, సభ్యులు, వార్డు సభ్యులు కలిసి జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. అధికార దుర్వినియోగం చేస్తు ప్రశ్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేయిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు సాంబమూర్తి గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో కంపెల రమేష్, హరీష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

## ప్రక్షాళన పూర్తయినా..

# పరిష్కారం కాకపాయె..

- అటవీ రెవెన్యూ వివాదాల భూములు బీ కేటగిరీలోనే..
- ఏళ్లుగా మగ్గుతున్న వైనం

తాండూరు-వేమనపల్లి, న్యూస్‌టుడే

**రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన పేరుతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక సంస్కరణ ప్రారంభించి పూర్తి చేసింది. రికార్డుల్లో తప్పులు సవరించి, వివాదాలు పరిష్కరించి, పాత రికార్డులతో సరి చూసి కొత్తగా ఆన్‌లైన్ రికార్డులు నవరించాలని ఈపథకం ఉద్దేశం. వచ్చే ఖరీఫ్ నుంచి ప్రభుత్వం ఎకరాకు రూ.4వేల పెట్టుబడి డబ్బులు కూడా ఇస్తుండడంతో రికార్డులు సరిగా ఉన్న భూములకు ఈ డబ్బులు వర్తించే విధంగా ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ఇంత పెద్ద ప్రక్రియ పూర్తయినా కూడా జిల్లాలో రెవెన్యూ-అటవీ భూముల వివాదాలు మాత్రం అలానే ఉండి పోయాయి. రెండు శాఖల మధ్య పరిష్కారం కాని సమస్యతో భూములు సాగు చేసుకుంటున్న రైతులు నానాఅవస్థలు పడుతున్నారు.**

జిల్లాలో సెప్టెంబరు 15 నుంచి భూరికార్డుల ప్రక్షాళన ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరు వరకు ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారు. ప్రస్తుతం సర్వే చేసి సరిచేసిన రికార్డులను ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 379 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టారు. మొత్తం 4,30, 571 సర్వే నెంబర్లకు గాను 4,28,801 సర్వే నెంబర్లను పరిశీలించారు. వాటిలో డిసెంబరు నెలాఖరు వరకు ఇంకా 1,27,849 సర్వే నెంబర్లు వివాదాస్పదంగా గుర్తించారు. వాటిలో 70వేల ఎకరాల భూముల్లోని వివాదాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి. అంటే



కన్నెపల్లి మండలంలో వివాదాస్పద భూముల్లో అటవీ శాఖ పనులను అడ్డుకుంటున్న రైతులు



నెన్నెలలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదాస్పదంగా మారిన భూమి, ఇక్కడ రైతులు పంటలు సాగు చేస్తున్నా కూడా బీ కేటగిరీలో పొందుపరిచారు..

జిల్లాలో మొత్తం 13,09,262 ఎకరాల భూమి రికార్డులను ప్రక్రియలో పరిశీలించగా వాటిలో 4,34,274ఎకరాలు వివాదాస్పదంగా గుర్తించారు. వాటిలో సగం వరకు వివాదాలు పరిష్కరించాలని దరఖాస్తులు రాగా పరిశీలిస్తున్నారు. వివాదాస్పద భూముల్లో కోర్టు కేసులు, రెవెన్యూ కేసులు పోను అటవీ-రెవెన్యూల మధ్య నలుగుతున్నాయి.

### పట్టాలు మాత్రమే ఇచ్చారు..

జిల్లాలోని తాండూరు, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాల్లో అటవీ, రెవెన్యూ శాఖల పరిధి విషయంలో వివాదాలు నెలకొన్నాయి. కొన్ని భూములకు రెవెన్యూ శాఖ నుంచి పట్టాలిచ్చినా వాటిని తమవంటూ అటవీ అధికారులు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారు. కొన్ని మండలాల్లో వివాదాలు పరిశీలిస్తే..

★ నెన్నెల శివారులోని 671 సర్వే నెంబరులో 1800ఎకరాల భూమి ఉంది. ఈభూమిలో దాదాపుగా 300ఎకరాల వరకు రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఈభూమి తమదంటూ అటవీ అధికారులు సాగుకు కూడా వారు అనుమతివ్వడం లేదంటూ రైతులు వాపోతున్నారు.

★ గోదంపేట శివారులో సర్వే నెంబరు 3లో రెండో విడత భూపంపిణీ కార్యక్రమంలో భాగంగా 40మందికి 78 ఎకరాల భూమికి పట్టాలిచ్చారు. ఈభూమి తమదంటూ అటవీ అధికారులు రైతులను సాగు చేయనివ్వడం లేదు.

★ తాండూరు మండలంలోని పెగడపల్లి, మాదారం, చౌటపల్లి, రేచిని, కొత్తపల్లి, అబ్బాపూర్, చంద్రపల్లి, గంపలపల్లి, వెంకటాయపల్లి, కిష్టంపేట, రేపల్లెవాడ, అచ్చలాపూర్, తాండూరు, గోపాల్‌నగర్ శివారుల్లో దాదాపుగా 1800ఎకరాల భూములు వివాదాస్పదంగా పక్కన పెట్టారు.

### జనవరి చివరికి పరిష్కారం: వీరన్న, బెల్లంపల్లి, ఆర్డీవో

అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదాస్పదమైన భూముల రికార్డులను ప్రస్తుతం బీ కేటగిరీ కింద పొందుపరిచాము. ప్రస్తుతం ఏ కేటగిరీ కింద ఉన్న వివాదరహిత భూమి రికార్డులను ఆన్‌లైన్లో పొందుపరుస్తున్నాము. వివాదాస్పద భూముల విషయంలో కూడా జనవరి నెలాఖరు లేదంటే ఫిబ్రవరి నెలలో పరిష్కరించే చర్యలు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అన్ని పాత రికార్డులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటాము.

### భూములున్నట్టే కానీ ఇప్పటి వరకు ఉపయోగపడలేదు

- కంపెల లక్ష్మి, వేమనపల్లి



గోదంపేట శివారులో మాకు ప్రభుత్వం భూమి పట్టాలిచ్చింది. మొదటి సంవత్సరం సాగు కోసం వెళ్తే అటవీ అధికారులు అడ్డుకున్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 12 ఏళ్ల నుంచి మాకు ఇచ్చిన భూముల్లో పంటలు సాగు చేసుకోలేకపోయాము..

### హద్దుల సర్వే చేపడతాం

- రామలింగం, డీఎఫ్‌వో

ఇప్పటికే అటవీ భూముల సర్వే మొదటి విడతలో పూర్తి చేశాము. మరోసారి హద్దుల విషయంలో సర్వే చేపడతాము. అటవీ శాఖ హద్దుల్లోకి చొరబడి కొంతమంది సాగు చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. త్వరలో హద్దుల విషయంలో రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహిస్తాం.

## స్వచ్ఛ పట్టణంగా బెల్లంపల్లిని అభివృద్ధి చేద్దాం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సునీతారాణి

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్, స్వచ్ఛతెలంగాణ లక్ష్యం చేరి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో బెల్లంపల్లి కి చోటు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని ఛైర్‌పర్సన్ పసుల సునీతారాణి అన్నారు. బుధవారం బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె ఇన్‌ఛార్జి కమిషనర్ జి.మల్లారెడ్డి, డి.ఇ. దయాకర్‌తో కలిసి మాట్లాడారు. మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా బెల్లంపల్లి మనత సాధించడానికి కృషిచేసిన అధికారులను సిబ్బందిని, ఇతర సంస్థలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. బెల్లంపల్లి పట్టణాన్ని ఇలాగే మరింత స్వచ్ఛపట్టణంగా అభివృద్ధి చేస్తామని ఆమె తెలిపారు. ఇందుకు ప్రజలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందసంస్థలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజల్లో మరింత చైతన్యం చేసి ఎక్కడైన మరుగుదొడ్లు లేని ప్రాంతాలు ఉంటే అక్కడ కూడా వాటిని నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈనెలలోనే స్వచ్ఛసర్వేక్షణ్ పోటీలో కూడా మన బల్దియా పాల్గొంటుందన్నారు. ఇందుకోసం కూడా నిత్యం పట్టణంలోని వివిధ వార్డుల్లో పరిశుభ్రతను పాటించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే కార్యాలయంలో అన్నీ సేవలను ఆన్‌లైన్ చేయడంతో పాటు ప్రత్యేకంగా బల్దియాకు యాప్‌ను తయారు చేసినట్లు తెలిపారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరును పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలను అమర్చినట్లు తెలిపారు. కేంద్రం ఓడీఎఫ్ జాబితాలో బెల్లంపల్లికి చోటు దక్కడంతో ప్రత్యేకంగా నిధులు విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. పట్టణంలోని కాల్‌టెక్స్, కాంటాచౌరస్తాల్లో రెండు షీటాయిలెట్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సునీతారాణి



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

## పాఠశాలల అభివృద్ధి బాధ్యత కమిటీలదే

తాండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి బాధ్యత మొత్తం ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీలపై ఉంటుందని తాండూరు ఎంఈవో ప్రభాకర్ అన్నారు. బుధవారం తంగళ్లపల్లి ఉన్నత పాఠశాలలో మండలంలోని ఎస్ఎంసీ కమిటీలకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, సభ్యులు పాఠశాలలపై పర్యవేక్షిస్తూ గ్రామంలోని ప్రతీ బడీడు పిల్లలను కూడా పాఠశాలలో చేర్పించేలా చూడాలన్నారు. ప్రతీ ఒక్కరికి మెరుగైన విద్యే లక్ష్యంగా కమిటీలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. తాండూరు, రేచిని, అచ్చలాపూర్, ఉర్దూ పాఠశాలలహెచ్ఎంలు మురళీధర్ రావు, మల్లేషం, సత్యనారాయణ, పద్మజ, పాల్గొన్నారు.

# బెల్లంపల్లి

## పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

**బెల్లంపల్లి గ్రామీణం:** బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం పిచ్చికుక్క బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. తంగళ్లపెల్లి శివసాయి అక్షిత్(5) పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో కుక్క దాడి చేసినట్లు స్థానికులు పేర్కొన్నారు. బాలుడికి తల, చెవులపై తీవ్రగాయాలైనట్లు తెలిపారు. బాలుడికి చికిత్సను అందించడానికి మంచిర్యాల తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.



## గందరగోళంగా కూడళ్లు



గందరగోళంగా కాంటాచౌరస్తా కూడలి

బెల్లంపల్లి పట్టణంలో కూడళ్లు గందరగోళంగా మారాయి. కూడళ్లవద్ద రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన జరగడమే దీనికి ప్రధాన కారణం. కారణమవుతుంది. కూడళ్లను ఎక్కడైనా ప్రణాళికాబద్ధంగా చేపడతారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మాత్రం ఆడ్డదిడ్డంగా నిర్మించారు. పట్టణంలో హైమస్ లైట్లు, కూడళ్ల నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించి మున్సిపాల్టీ కార్యాలయం, ఏసీపీ కార్యాలయం, పాత జీఎం కార్యాలయం చౌరస్తా, కాంటా చౌరస్తాల్లో కూడళ్లను నిర్మించారు. ప్రధానంగా కాంటాచౌరస్తా ప్రమాదాలకు నిలయంగా ఉంది. ఇటీవల అగ్నిమాపక యంత్రం యూటర్న్ తీసుకునే సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. మరో రూ.20లక్షల వరకు కేటాయిస్తే కూడళ్ల వద్ద రోడ్డు విస్తరణకు అవకాశం ఉంటుంది. కూడళ్లను మరింత సుందరీకరణ చేస్తే తప్ప ప్రయోజనం కనిపించేలా లేదు. మున్సిపల్ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం



మున్సిపల్ కార్యాలయం వద్ద



సీఐ కార్యాలయంలోకి వెళుతుందా అన్నట్లుగా ఉన్న ఆర్టీసీ బస్సు



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## రాజకీయ శిక్షణ తరగతుల గోడప్రతుల ఆవిష్కరణ

**బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:** ఈ నెల 6, 7 తేదీల్లో నాగార్జనసాగర్‌లో నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతుల గోడప్రతులను బుధవారం ఆవిష్కరించారు. శిక్షణ తరగతులకు ప్రజాగాయకుడు గద్దర్, అల్లం నారాయణ, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శంకర్,నారాయణ, పట్టణ అధ్యక్షుడు చిలుక రాజనర్సు, జి.నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.గంగాధర్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ ఫెల్లోషిప్ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న నాయకులు

## రాజ్యాధికారంతోనే సమస్యలకు పరిష్కారం

**బెల్లంపల్లి పట్టణం:** దళితులకు రాజ్యాధికారంతోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ అన్నారు. బుధవారం అంబేడ్కర్‌భవన్‌లో అంబేడ్కర్ నేషనల్ ఫెల్లోషిప్ అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అవార్డు గ్రహీతలు మాలమహానాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల రాంమూర్తి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర ప్రధానకార్యదర్శి సబ్బని రాజనర్సు, ఉపాధ్యక్షుడు మల్లయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, జిల్లా యువజన అధ్యక్షుడు రాజేశ్వర్‌లకు సన్మానం చేశారు. మల్లేష్ మాట్లాడుతూ...ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఐక్యతతోనే ఉద్యమించాలన్నారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాసర్ల యాదగిరి, మధుకర్, రాష్ట్ర అధకార ప్రతినిధి బి.మధు, తిరుమల, విజయలక్ష్మీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భీమశంకర్, జిల్లా కార్యదర్శి పద్మ, నియోజకవర్గ అధ్యక్షులు చంద్రకళ, నర్సింగ్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



తాండూరులో తపస్ కాలసూచిక విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

## ఉపాధ్యాయ సంఘాల కాలసూచికలు విడుదల

**తాండూరు, న్యూస్‌టుడే:** తపస్ కాలసూచికలను బుధవారం తంగళ్లపల్లిలో విడుదల చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య, విడుదల చేశారు.

### భీమినిలో టీటీయూ ఆధ్వర్యంలో..

భీమిని మండల విద్యా వనరుల కేంద్రంలో తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) నూతన సంవత్సర కాలసూచికలను బుధవారం విడుదల చేశారు. సంఘం భీమిని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిండ్ల శివరామకృష్ణ, లింగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వాటిని విడుదల చేశారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, తుమ్మ వెంకటేశం, చంద్రశేఖర్, జీవన్‌కుమార్, శ్రీనివాస్, భూలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

**బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:** దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 187వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి, కాసిపేట సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాలల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. పాఠశాల నుంచి కాంటాచౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీని ఆర్‌సీఓ వెంకటలక్ష్మీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రినిపల్స్ ఐనాల సైదులు, పి.శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, ఉపాధ్యక్షుడు ఎ.రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బజార్‌ఏరియా జిల్లా పరిషత్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను కొనియాడారు. దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా మన్ననలు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు కె.రామ్మోహన్, రాజమల్లు, లింగయ్యలు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఐక్యవిద్యార్థి సంఘం నాయకులు ఆదర్శ్‌వర్ధన్, అల్లిసాగర్, బొడకుంటి సాగర్‌వర్మ, రంగ ప్రశాంత్, ఏడీఓ కిషన్, ఎంపీడీఓ వెంకటేష్, బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ, వైస్‌ప్రిన్సిపల్ సోమయ్యలు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ బాలికల వసతిగృహంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా చేపట్టారు. ఆమె చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ, బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లి సాగర్, నాయకులు సాగర్‌వర్మలు పాల్గొన్నారు.

**కాసిపేట గ్రామీణం:** తొలిమహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాధికారి దామోదర్ అన్నారు. మండలంలోని లంబాడితండా ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిభాయి పూలే జయంతిని జిల్లా సామాజిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం గోపాల్, సంకె రవి, శిలోజు మురళి, భుక్య చందులాల్, భోగే పోశం, దాగం రాయలింగు, సామని రాజం, ప్రధానోపాధ్యాయులు వేణు మాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### దేవాపూర్‌లో....

దేవాపూర్‌లోని నాయికపుగూడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఆదివాసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు రమణారెడ్డి, లచ్చయ్య, నాగేశ్వర్‌రావు, తిరుపతిరెడ్డి, కిష్టయ్య, చిన్నరమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కన్నెపల్లి(తాండూరు):** సావిత్రీబాయి పూలే 187వ వర్ధంతిని కన్నెపల్లి మండల కేంద్రంలో బుధవారం మాలీ కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కన్నెపల్లి బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చండె సత్యనారాయణ పాల్గొని సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో నెండుగూరి సంతోష్, మహేష్, ఉప సర్పంచి రోషన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

**నెన్నెల:** నెన్నెల మండలంలోని ఆవడం, మైలారం జడ్పీ పాఠశాలలో తెలంగాణ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముందుగా విద్యార్థులకు సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం తెలంగాణ విద్యార్థి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కనుసోథత్ సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మైలారం, ఆవడం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లింగయ్య, శ్రీనివాస్, విద్యార్థులు విద్యార్థి సంఘం నాయకులు సల్మాన్ పాషా, రాజు, సాయికిరణ్, హరీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి గ్రామీణం:** బెల్లంపల్లి మండలంలోని అంకుశం, బట్వాన్‌పల్లి, మాలగురిజాల, కాస్తుర్బా పాఠశాల, గురిజాల గ్రామాల్లో బుధవారం సావిత్రిబాయి పూలే 187వ జయంతిని విద్యార్థులు,ఉపాధ్యాయులు, స్వచ్ఛందసంస్థల సభ్యులు ఘనంగా నిర్వహించారు. మాలగురిజాలలో టీ-మాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు సావిత్రిబాయిపూలే గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల ఉపాధ్యాయులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బాలికల వసతిగృహంలో...



బీసీ సంఘాల ఆధ్వర్యంలో...



అంకుశంలో చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు



లంబాడీతండాలో పూలే చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న అధికారులు



సావిత్రిబాయి పటానికి నివాళులర్పిస్తున్న మాలీ కులస్థులు



సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చెన్నూరు

## 5న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

**మంచిర్యాల క్రీడావిభాగం:** ఉమ్మడిజిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న సీనియర్, జూనియర్ మహిళల విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో ఉదయం 9:30గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఈ చరవాణి(9849444744, 9494112288)ని సంప్రదించాలని కోరారు.

## తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**జైపూర్, న్యూస్‌టుడే:** తాగి వాహనం నడిపినందుకు జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన లారీ చోదకుడు బోరె రాజయ్యకు మూడురోజుల జైలు శిక్ష విధిస్తూ బుధవారం చెన్నూర్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఉదయభాస్కర్ తీర్పునిచ్చారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 31న రాత్రి జైపూర్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజయ్య మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.



వ్యవసాయశాఖ అందించిన వర్మికంపోస్ట్ పాలిథిన్ బెడ్స్‌తో రైతులు

## సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులు

**జైపూర్, న్యూస్‌టుడే:** సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడులు, తక్కువ ఖర్చుతో పొందవచ్చని ఇన్ఛార్జి ఏవో సుజాత అన్నారు. పరంపరాగత్ కృషి వికాస్‌యోజనలో భాగంగా కాన్కూర్ గ్రామ రైతులకు బుధవారం నూరు శాతం రాయితీపై వర్మి కంపోస్ట్ పాలిథిన్ బెడ్స్, వేపనూనెను సర్పంచి అంజాగౌడ్ చేతుల మీదుగా రైతులకు అందజేశారు. అనంతరం వాటిని ఏ విధంగా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు తిరుపతి, అఖిల్, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

## ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

**చెన్నూరు, న్యూస్‌టుడే:** చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని విద్యార్థులు చదువులకెంతటి ప్రాధాన్యమిస్తున్నారో క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సూచించారు. గురుకృప స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చెన్నూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ చేపట్టారు. 10, 12, 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పురాణం సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలు మానసికొల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాల్లో సైతం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో విద్యార్థులు పోటీల్లో రాణించి తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. క్రీడాకారులకు, క్రీడలకు పుట్టినిల్లుగా నిలిచి ఎందరో గొప్ప క్రీడాకారులను తయారు చేస్తున్న చెన్నూరులో మైదానం సక్రమంగా లేదని దీన్ని అభివృద్ధి చేసేందుకు మీవంతుగా కృషి చేయాలని గురుకృప స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీఎం.ప్రకాష్‌రావు, దాసరి మల్లేష్‌లు ఎమ్మెల్సీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. స్థానికంగా మినీ స్టేడియం నిర్మాణ పనులు సాగుతున్నాయన్నారు. స్టేడియం నిర్మాణం పూర్తైతే క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. క్రీడా పోటీల నిర్వహణకు అన్ని విధాలుగా సహకరించిన దాతలు పట్టణానికి చెందిన సేజ్ పాఠశాల నిర్వాహకులు పులి కిషోర్‌కుమార్, పులి చంద్రశేఖర్‌లను అతిథులు, పోటీల నిర్వాహకులు అభినందించారు. అంతకముందు క్రీడా పతాకాన్ని ఎగురవేసిన ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ స్థానిక సర్పంచి కృష్ణ, సీఐ కిషోర్‌కుమార్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కారెంగుల రామయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూసర్ల సురేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు రామారావు, రాంమోహన్, దాసరి మల్లేష్, పులి జయశ్రీ, అనిత, మనోహర్, పున్నం, శ్రీనివాస్, మారయ్య, లింగయ్య, సాగర్, గోపాల్, శ్రీనివాస్‌లతో పాటు రెండు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా పతాకాన్ని ఊపి పరుగుపందెం పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సతీష్‌కుమార్, అతిథులు



పరుగుపందెం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



జంతుగణనపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌డీఓ

## జంతుగణనను పకడ్బందీగా చేపట్టాలి

కోటపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 22 నుంచి 28 వరకు నిర్వహించే జంతుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని చెన్నూరు ఎఫ్‌డీఓ డి.రాజారావ్ సిబ్బందికి సూచించారు. ఇందులో భాగంగా బుధవారం కోటపల్లి అటవీక్షేత్ర కార్యాలయంలో కోటపల్లి, నీల్వాయి రేంజీలకు చెందిన అటవీ సిబ్బంది, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయమే అటవీప్రాంతానికి చేరుకొని అటవీ జంతువులు పాదముద్రల ఆధారంగా గణన చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగానే వృక్ష జాతుల వివరాలను సైతం నమోదుచేయాలని కోరారు. గణనలో అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేంజి అధికారులు రవి, అరవింద్, సిబ్బంది రేష్మ, నాగరాజాచారి తదితరులతో పాటు వివిధ అటవీ సెక్షన్, బీట్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## టీయూటీఎఫ్ కాలసూచీ ఆవిష్కరణ

**చెన్నూరు, న్యూస్‌టుడే:** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2018 కాలసూచీని బుధవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.ప్రేమ్‌రావ్, ప్రధాన కార్యదర్శి బి.రవీందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీయూటీఎఫ్ ముందువరుసలో ఉంటుందన్నారు. సీపీఎస్ రద్దు కోసం సంఘం తరపున అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. సర్వీసు నిబంధనలతో పదోన్నతులు త్వరలోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాములు, సిరంగి పవన్‌కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.బానయ్య, రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, నాయకులు జాఫరోద్దీన్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్, సత్యనారాయణ, సాంబశివరావు, మోహన్, వేమనపల్లి మండల నాయకులు అశోక్‌చందర్, సునీల్, అబ్దుల్‌కరీంసాబ్రి, గోపి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో టీయూటీఎఫ్ కాలసూచీని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

### కాలసూచీల ఆవిష్కరణ

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) కాలసూచీలను బుధవారం మందమర్రి విద్యావనరుల కేంద్రం ఆవరణలో విద్యాధికారి జాడి పోచయ్య సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్, గోపాల్‌రెడ్డి, చీర సమ్మయ్య, అజయ్, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ

**కోటపల్లి, న్యూస్‌టుడే:** కోటపల్లి మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన యాజమాన్య కమిటీల ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఒక్క రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. మండల విద్యాధికారి బెజ్జంకి జగన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్పీలు సురేష్, వెంకటేశ్వర్లు శిక్షణ ఇచ్చారు. రానున్న జూన్‌లో పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పాఠశాల యాజమాన్య కమిటీల నిర్మాణం, వారి బాధ్యతలపై అవగాహన కల్పించారు.



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున కేంద్ర బృందం సభ్యుడు

## మందకృష్ణను బేషరతుగా విడుదల చేయాలి

**జైపూర్, న్యూస్‌టుడే:** శాంతియుతంగా 2 రోజులుగా ఉపవాస దీక్ష చేస్తున్న మందకృష్ణ మాదిగను అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ప్రధాన మంత్రితో మాట్లాడి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, ప్రభుత్వం వెంటనే అతని మీద పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రాజలింగంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, లింగయ్య, మల్లేష్, శంకర్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**భీమారం:** తమ సంస్థ కార్యాలయంలో శాంతియుతంగా దీక్ష చేస్తున్న మందకృష్ణను అరెస్ట్ చేయడం అన్యాయమని ఐకాస జిల్లా కన్వీనర్ పోడేటి సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే మందకృష్ణను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**కోటపల్లి:** పార్లమెంట్‌లో ఎస్సీవర్గీకరణ వెంటనే చేపట్టాలని, ఈ మేరకు దీక్ష చేపట్టిన మందకృష్ణను అరెస్టుచేసిన పోలీసులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు కోటపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎల్కటూరి రవిందర్ మాదిగ మాట్లాడుతూ శాంతియుత పద్ధతిలో దీక్షచేపట్టిన తమ నాయకున్ని అరెస్టుచేయడం దారుణమన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడితెచ్చి పార్లమెంట్‌లో ఎస్సీవర్గీకరణ బిల్లును ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద రవికుమార్, బాపు, రాజేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యావనరుల కేంద్రం సందర్శన

**జైపూర్, న్యూస్‌టుడే:** మండలంలోని విద్యావనరుల కేంద్రాన్ని బుధవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాధికారి శ్రీనివాస్‌తో మాట్లాడి రికార్డులను ఏవిధంగా నిర్వహిస్తున్నారని తెలుసుకుని పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో పర్యటించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

## సుద్దాలలో గ్రామసభ

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని సుద్దాలలో బుధవారం అభివృద్ధి పనులపై గ్రామసభ నిర్వహించారు. పంచాయతీకి సంబంధించిన మూడునెలల ఆదాయ-వ్యయాలను ప్రజలకు వివరించారు. అందుబాటులో ఉన్న నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై పాలకవర్గం సభ్యులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచి దైనేని రాంబాయి, ఉపసర్పంచి నికుడ నారాయణ, వార్డుసభ్యులు, కార్యదర్శి విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: నిన్నటి ధరలు:, కిలో రూపాయల్లో: టమాట 10, వంకాయ 30, మిర్చి 30, బెండకాయ 50, అల్చింత 30, దొండ 30, క్యాబేజీ 40, కాలిఫ్లవర్ 50, కాకర 40, బోడ కాకర 150, క్యారెట్ 70, బీర 80, గోరుచిక్కుడు 40, చిక్కుడు 50, సొరకాయ 15, పాలకూర 20, తోటకూర 20, చుక్కకూర 30, కోతిమీర్ 30, ఆలు 12, ఉల్లిగడ్డ 35

## తెరపై ఈనాడు

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** మంచిర్యాలలో... శ్రీనివాస- ఎంసీఏ, వెంకటేశ్వర- హలో, సీసీసీలో దేవి తిరుమల స్క్రీన్-1లో- ఎంసీఏ, స్క్రీన్-2లో హలో. లక్ష్మీకాంప్లెక్స్: ఆక్సిజన్.

# చెన్నూరు




## రక్తనిధి కేంద్రంలో నిల్వలు

**ఏసీసీ(మంచిర్యాల:** మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో నిల్వలు బుధవారం వరకు ఎ పాజిటివ్ 6, ఎ నెగటివ్ 0, బి పాజిటివ్ 29, బి నెగటివ్ 1, ఏబీ పాజిటివ్ 1, ఏబీ నెగటివ్ 1, ఒ పాజిటివ్ 10, ఒ నెగటివ్ 7 అన్ని పరీక్షలు చేసి సిద్ధంగా ఉన్నాయి. అవసరం ఉన్న వారు కేంద్రం స్థిరవాణి సంఖ్య(08736-259259, 252259)లను, లేదా రక్తనిధి కేంద్రం నిర్వాహకుడు డా. డి. విష్ణు మూర్తి చరవాణి(9492557337)ని సంప్రదించగలరు.

# సావిత్రిబాయి చూపిన బాట అనుసరణీయం

★ ఘనంగా జయంతి వేడుకలు

**కోటపల్లి, న్యూస్‌టుడే:** నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి. కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల్లో ఘనంగా వేడుకలు జరిగాయి. ఉపాధ్యాయవృత్తికే వన్నె తెచ్చారని ఆమె సమాజానికి చూపినతోవ అనుసరణీయమని చెన్నూరు గ్రామీణ సీఐ బొల్లం రమేష్ అన్నారు. వేడుకలకు ముఖ్యఅథితిగా హాజరైన సీఐ మాట్లాడుతూ నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ఆమె చేసిన కృషి అందరికి ఆదర్శ ప్రాయమన్నారు. అంతకుముందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యాదాస్ ఆదర్శప్రాయమైన సావిత్రిబాయి పూలే జీవితాన్ని విద్యార్థినులకు వివరించారు. సమాజాన్ని, విద్యార్థుల్ని, కుటుంబాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దడంలో మహిళా పాత్రను వివరిస్తూ వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయినులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కొట్టె సత్తెమ్మ, ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చెన్నూరు:** సావిత్రిబాయి పూలే జయంతిని చెన్నూరులోని ఎమ్మార్పీ కార్యాలయంలో ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు సమర్పించి పూలే జీవిత చరిత్రను వివరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మండలంలోని మహిళ ఉపాధ్యాయులు, అధికారిణులను ఆహ్వానించిన సంఘ నాయకులు వారిని శాలువాలతో సన్మానించారు. తెరాసవి ఆధ్వర్యంలో కళాశాలలో సంఘ నాయకులు, విద్యార్థులు జ్యోతిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ రాధాకృష్ణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**చెన్నూరు గ్రామీణం:** మండలంలోని శివలింగాపూర్, దుగ్నెపల్లి, చల్లాయిపేట, సుద్దాల, పొక్కూరు తదితర పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చిలుముల కృష్ణమూర్తి, అసంపల్లి రమేష్, ఓంప్రకాష్, బిల్లా తిరుపతయ్య, చౌదరి, ఉపాధ్యాయులు పత్తి సంతోష్, మడక రవి, జీవన్‌రెడ్డి, అహర్‌ఖాన్, సంధ్యరాణి, క్రాంతికిరణ్, రాజేష్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

**జైపూర్:** సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. సాంఘిక సంక్షేమ గురుకులంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయ కర్త వెంకటలక్ష్మీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన సేవలను గుర్తు చేసుకొని మహిళ ఉపాధ్యాయురాళ్లకు సన్మానం చేసి, ఏక రూపదుస్తులను పంపిణీ చేశారు.

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడులు ఘనంగా జరిగాయి. బీఎస్పీ నాయకుడు తుంగపిండి రమేష్, నేతకాని హక్కుల సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పోట్యాల నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి విద్యార్థులకు విద్యాసామాగ్రి, స్వీట్లు పంపిణీ చేశారు.

**భీమారం:** సావిత్రిబాయి పూలే జయంతి వేడురలను ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జలంపెల్లి తిరుపతి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, నాగరాజ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి పట్టణం:** మందమర్రిలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం వేర్వేరుగా ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక ఊరు మందమర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, ఉపాధ్యాయురాళ్లు అనిత, జ్యోతిలను తెరాస విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఊదరి శ్రీకాంత్ గౌడ్, మూడారపు శేఖర్, మాసు వెంకటేష్, అఖిలేష్ పాండే, రాకేష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి మండల విద్యాధికారి జాడి పోచయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కస్తూరి శ్రీనాథ్‌చారీ, గుడికందుల రమేష్, అల్లి సాగర్, సాగర్‌వర్మ, యుగెందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పాతబస్టాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సత్యనారాయణ, ప్రతాప్, ఉపెందర్‌గౌడ్, శ్రీనివాస్, సట్ల రవిందర్, డి. శ్రీనివాస్, శంకర్, రమేష్, బి. చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వేరోస్ మంచిర్యాల జిల్లా మహిళ అధ్యక్షురాలు సలిగొమ్ముల భాగ్య ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలు అనురాధ, అంగన్వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఐ పద్మజ ఉపాధ్యాయురాలు శాంఖరి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి పట్టణం:** రామకృష్ణాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు ఉపాధ్యాయురాళ్లు షీలా, రాజ్యలక్ష్మీ, హేమాదేవి, హైమావతిలను ఘనంగా సన్మాంచి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అరవింద్, సత్యనారాయణ, శ్రీకాంత్, వెంకటస్వామి, సుధాకర్‌నాయక్, నాగలక్ష్మీ, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.


రామకృష్ణాపూర్‌లో ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు


సావిత్రిబాయి చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


చెన్నూరులోని ఎమ్మార్సీ కార్యాలయంలో...


చెన్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


శివలింగాపూర్ పాఠశాలలో..


సమన్వయ కర్త వెంకటలక్ష్మీని సన్మానిస్తున్న అధ్యాపకులు


భీమారం వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


మందమర్రిలో ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న తెరాస విద్యార్థి సంఘం నాయకులు


సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఈవో పోచయ్య తదితరులు


వేడుకల్లో పాల్గొన్న స్వేరోస్ అధ్యక్షురాలు సలిగొమ్ముల భాగ్య, ఉపాధ్యాయులు

# గొర్రెల పథకం లబ్ధిదారులు వెంటనే డీడీలు కట్టాలి

★ అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్

**చెన్నూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం అందజేస్తున్న గొర్రెల పంపిణీ పథకం కింద ఎంపికైన జిల్లాలోని లబ్ధిదారులంతా వెంటనే గొర్రెలను పొందేందుకు డీడీలు కట్టాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ కోరారు. బుధవారం స్థానికంగా యాదవ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెలు అనారోగ్యానికి గురైతే వెంటనే 1962 నెంబరుకు ఫోన్‌చేసి వెంటనే వైద్య సేవలు పొందాలని సూచించారు. పశువైద్యాధికారులు సైతం వెంటనే స్పందిస్తూ గొర్రెలకు సకాలంలో వైద్యం అందజేయాలన్నారు. ప్రభుత్వ పరంగా జిల్లాలో ఇప్పటి వరకు 4,216 గొర్రెల యూనిట్లను అందించారని ఇంకా 1,017 యూనిట్లు లబ్ధిదారులకు అందించాల్సి ఉందన్నారు. గొల్లకురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సతీష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లికార్జున్‌యాదవ్, మండల అధ్యక్షుడు బాలేష్, నాయకులు మధు, రమేష్, నాగన్న, వెంకన్న, బాపు, మల్లన్న, పున్నం, రాజన్న, రాజు, భీమయ్య, మహేందర్, బాలు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరులో మాట్లాడుతున్న సదానందం, యాదవ సంఘ నాయకులు

## ప్రార్థన దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:** హైదరాబాద్‌లో ఈనెల 5న నిర్వహించే ప్రార్థన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని క్రైస్తవ సంఘం నాయకురాలు చల్లగుల్ల విజయశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రహదారులు, భవనాల విశ్రాంత గృహంలో సంబంధిత ప్రచారప్రతులను ఆవిష్కరించారు. లోక కళ్యాణం కోసం ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమానికి కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి క్రైస్తవులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు సామ్యూల్, రజినికుమార్, పద్మారావు, రవిజోసెఫ్, స్వామిదాస్, జాషువా, ప్రభుదాస్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.